V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
18-12-2024
సంపుటి : 01 | సంచిక : 226 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




జమిలి బిల్లును ప్రవేశపెట్టేందుకు..

## లోక్‌సభ ఆమోదం

- అనుకూలంగా 269 ఓట్లు..వ్యతిరేకంగా 198 ఓట్లు
- వ్యతిరేకించిన కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ సహా పలు విపక్షాలు
- ఎన్డీయే మిత్ర పక్షాలు బిల్లులకు సంపూర్ణ మద్దతు
- బేషరతుగా మద్దతిచ్చిన టీడీపీ..
- 'ఓటర్లు విసిగిపోయారు'.. జమిలిపై 'కోవింద్' కీలక వ్యాఖ్యలు

2




## ఫ్రాన్స్‌లో తుపాను విధ్వంసం..

- తీవ్ర విచారం వ్యక్తం చేసిన ప్రధాని
- సాయానికి సిద్ధమన్న మోదీ



**ఢిల్లీ:** ఛీడో తుపాను ధాటికి ఫ్రాన్స్‌కు చెందిన ఓవర్సీస్ ప్రాంతమైన మాయోట్ దీవులు అతలాకుతలమయ్యాయి. దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విపత్కర సమయంలో ఫ్రాన్స్‌కు భారత్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.అవసరమైన మేర సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. తన ఆలోచనలన్నీ బాధిత కుటుంబాలపైనే ఉన్నాయని అన్నారు. అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సారథ్యంలో ఈ విషాదాన్ని ఫ్రాన్స్ అధిగమిస్తుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఆఫ్రికా ఖండంలోని మొజాంబిక్ ఛానల్‌లో... మిగతా2లో...

హైడ్రా ఏర్పడక ముందు ఉన్న నిర్మాణాల జోలికి

## వెళ్లబోం

- జులై తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం
- కూల్చివేతలపై కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు

2





# తగ్గేదేలే..

అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు ప్రారంభంతోనే రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై చర్చ..

హరీశ్ రావు-భట్టి మధ్య మాటల యుద్ధం

లగచర్ల ఘటనపై చర్చకు పట్టుబట్టిన బీఆర్ఎస్ సభ్యులు

నల్ల చొక్కాలతో, చేతికి సంకెళ్లు వేసుకుని నిరసన

లగచర్ల ఘటనలో అధికారులను సస్పెండ్ చేశామన్న మంత్రి సీతక్క

ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై చర్చ

విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే మూడు బిల్లుల ఆమోదం

2



తెలంగాణ అసెంబ్లీలో మంగళవారం కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం జరిగింది. తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు ప్రారంభంతోనే రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై వాడి వేడీ చర్చ జరిగింది. అటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఇటు మాజీ మంత్రి హరీష్ రావు వాదనలతో అసెంబ్లీ దద్దరిల్లింది.

లగచర్ల రైతుకు సంకెళ్లు వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు నల్ల చొక్కాలతో అసెంబ్లీకి వచ్చారు. చేతికి సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. అసెంబ్లీలో కూడా లగర్ల ఘటనపై చర్చకు పట్టుబట్టారు బీఆర్ఎస్ సభ్యులు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సభలో దుమారం రేపారు.

ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో ఏసీబీ విచారణలో కేటీఆర్ సమాధానాలు చెప్పాల్సిందేనన్నారు పొంగులేటి. మంత్రి పొంగులేటి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. వారికీ వీరికి కాదు అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు సమాధానం చెప్పడానికి తాను సిద్ధమన్నారు.విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే మూడు బిల్లులకు ఆమోదం తెలిపింది అసెంబ్లీ. స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లుతో పాటు యూనివర్సిటీల చట్టసవరణ బిల్లు.. జీఎస్టీ సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది.

కేటీఆర్ చుట్టూ..

## బిగుస్తున్న ఉచ్చు..

ఈ-ఫార్ములా రేస్ నిధుల బదలాయింపుపై విచారణకు గవర్నర్ అనుమతి

న్యాయనిపుణుల సలహాలు తీసుకుని గవర్నర్ ఆమోదం తెలిపారన్న ప్రభుత్వం

ఏసీబీకి లేఖ పంపిన సీఎస్



**విశ్వంభర, హైదరాబాద్:**

గత ప్రభుత్వ హయాంలో ఈఫార్ములా రేసు కోసం విదేశీ కంపెనీకి నిబంధనలతు విరుద్ధంగా నిధులు బదలాయించారన్న కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫార్ములాఈ కార్ రేసు వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇవ్వడంతో ఆ దిశగా రంగం సిద్ధమవుతోంది. గవర్నర్ అనుమతిని ఏసీబీకి పంపాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. దీంతో ఈమేరకు కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ అనుమతి లేఖను ఏసీబీకి సీఎస్ శాంతి కుమారి పంపారు. మంత్రివర్గ సమావేశంలో ఫార్ములాఈ కార్ రేసు వ్యవహారంపైన, విద్యుత్తు వ్యవహారాలకు సంబంధించి జస్టిస్ మదన్ లోకూర్ ఇచ్చిన నివేదికపైనా సమగ్రంగా చర్చించినట్లు తెలిసింది. ఫార్ములా రేసు... మిగతా2లో...

ప్రతి డాక్టర్ సేవకే..

## ప్రాధాన్యత ఇవ్వాలి

- రోగులకు వైద్య సేవలు అందించాలి
- యువవైద్యులకు రాష్ట్రపతి పిలుపు
- ఎంజీబీఎస్ విద్యార్థులకు పట్టాలు అందజేసిన ద్రౌపది ముర్ము

2



తెలంగాణలో ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు

## కన్వీనర్ల నియామకం

ఈఏపీసెట్‌కు ప్రొ.బి.డీన్ కుమార్, పీజీఈసెట్‌కు ప్రొ.అరుణ కుమారి, ఐసెట్ పరీక్షకు ప్రొ.ఎ.రవి

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఉమ్మడి ప్రవేశ పరీక్షల నిర్వహణకు కన్వీనర్లను నియమిస్తూ ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. 202526 ఏడాదికి పీజీ, యూజీ ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించనున్న పరీక్షలకు ఆయా వర్సిటీల వీసీలతో చర్చించి కన్వీనర్లను నియమించినట్టు ఉన్నత విద్యా మండలి పేర్కొంది.

జేఎన్‌టీయూ హెచ్ ఆధ్వర్యంలో జరగనున్న ఈఏపీసెట్‌కి కన్వీనర్‌గా ప్రొఫెసర్ బి.డీన్ కుమార్, పీజీఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ అరుణ కుమారిలను నియమించింది. మహాత్మాగాంధీ వర్సిటీ ఆధ్వర్యంలో జరగనున్న ఐసెట్ పరీక్షకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ అలువల రవిని ఉన్నత విద్యా మండలి నియమించింది. ఉస్మానియా వర్సిటీ ఆధ్వర్యంలో జరగనున్న ఈసెట్‌కి పి.చంద్రశేఖర్‌ని, లాసెట్, పీజీఎల్ సెట్‌లకు బి.విజయలక్ష్మిని కన్వీనర్‌గా నియమించింది. కాకతీయ వర్సిటీ నిర్వహించనున్న ఎడ్‌సెట్‌కి ప్రొఫెసర్ బి. వెంకట్రామ్ రెడ్డి, పాలమూరు వర్సిటీ ఆధ్వర్యంలో జరగనున్న పీఈసెట్‌కి ఎన్.ఎస్ దిలీప్‌ని కన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 101 | ₹ 118 |
| స్కిన్‌తో | స్కిన్‌లెస్ |
| ₹ 171 | ₹ 195 |

నిలకడగా బీజేపీ సీనియర్ నేత

## అద్వానీ ఆరోగ్యం..!

బులెటిన్ విడుదల చేసిన అపోలో దవాఖాన



**ఢిల్లీ:** బీజేపీ అగ్రనేత లాల్ కృష్ణ అద్వానీ ఆరోగ్యం నిలకడగా ఉందని ఢిల్లీలోని ఇంద్రప్రస్త అపోలో దవాఖాన మంగళవారం ఓ బులెటిన్ విడుదల చేసింది. నెమ్మదిగా కోలుకుంటున్నారని, ఒకటి, రెండు రోజుల్లో ఆయన్ను ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ) నుంచి షిఫ్ట్ చేస్తామని దవాఖాన యాజమాన్యం ధృవీకరించింది. ఈ నెల 12 నుంచి ఐసీయూలోనే అద్వానీ చికిత్స పొందుతున్నారు.భారత ఉప ప్రధాని ఎల్ కే అద్వానీ.. ఇంద్రప్రస్తలోని అపోలో దవాఖానలో ఈ నెల 12 నుంచి డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. క్రమంగా ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగు పడుతున్నది. ఆరోగ్య పరిస్థితిని బట్టి ఒకటి, రెండు రోజుల్లో..

మూసీలో కూలగొట్టిన ఇళ్లకు

## ఈఎంఐలు ఉంటాయా..?

- ఉంటే ప్రభుత్వం చెల్లిస్తుందా..?
- శాసనమండలిలో ఎమ్మెల్సీ కవిత సూటి ప్రశ్న

2



బీజేపీ చీఫ్‌గా

## శివరాజ్ సింగ్ చౌహాన్?

రేసులో గడ్కరీ సైతం!



**ఢిల్లీ:** బీజేపీ అధ్యక్షునిగా జేపీ నడ్డా వారసునిపై పార్టీలో చర్చ ప్రారంభమైంది. ఫిబ్రవరి నెలాఖరుకల్లా పార్టీ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. బీజేపీ చీఫ్‌గా ప్రస్తుత కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు ప్రముఖంగా విన్పిస్తున్నది.ఆర్ఎస్ఎస్ ఆశీస్సులు మెండుగా ఉన్న మంత్రి నితిన్ గడ్కరీ కూడా రేసులో ఉన్నారని ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం కేంద్ర మంత్రిగా ఉన్న వారికీ ఈ పదవి రావచ్చునని పార్టీలో ప్రచారం జరుగుతున్నది.

## ఫ్రాన్స్‌లో తుపాను విధ్వంసం..

(మొదటి పేజీ తరువాయి)

ఈ దీవులుంటాయి.హిందూ మహాసముద్రంలోని మయోట్ దీవుల్లో చిడో తుపాను సోమవారం బీభత్సం సృష్టించింది. తుపాను దాటికి దీవి మొత్తం చిగురుటాకులా వణికిపోయింది. గడిచిన వందేళ్లలో ఈ స్థాయిలో తుపాను రావడం ఇదే తొలిసారి. తుపాను తీవ్రత తెలుసుకున్న ఫ్రాన్స్ ఆగమేఘాల మీద సహాయక చర్యలు ముమ్మరం చేసింది. అక్కడున్న వారిని రక్షించేందుకు నౌకలను, మిలటరీ హెలికాప్టర్లను రంగంలోకి దింపింది. మీడియా నివేదికల ప్రకారం మరణాలు వేల సంఖ్యలోనే ఉండొచ్చని అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

## హైడ్రా ఏర్పడక ముందు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లబోం..



**విశ్వంభర, హైదరాబాద్:** కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. జులై తర్వాత చేపట్టిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పడక ముందు ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లబోమన్నారు.

''గతంలో పర్మిషన్ తీసుకొని ఇప్పుడు నిర్మిస్తున్న నిర్మాణాల వైపు వెళ్లం. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాటి కూల్చివేతలు తప్పదు. కొత్తగా తీసుకున్న అనుమతులను హైడ్రా పరిశీలిస్తుంది. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చెరువుల పరిరక్షణకు పనిచేస్తున్నాం. పేదల జోలికి హైడ్రా రాదు. వారి ఇళ్లను కూల్చివేస్తున్నామనే తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు'' అని రంగనాథ్ కోరారు.

## ప్రతి డాక్టర్ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలి



**విశ్వంభర, అమరావతి :** ప్రతి డాక్టర్ సేవకే ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము యువ వైద్యులకు పిలుపునిచ్చారు. యువ వైద్యులుగా అత్యుత్తమ సేవలందించాలని సూచించారు. మంగళగిరి ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవం సందర్భంగా ఎంబీబీఎస్ విద్యార్థులకు పట్టాలు అందజేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి రోగికి వైద్య సేవలు అందించాలని, ఆయుష్మాన్ భారత్ ద్వారా దేశ ప్రజలకు ఆరోగ్య సేవలు తేలిగ్గా అందించడమే ధ్యేయంగా ఉండాలని కోరారు. పట్టాలు పొందిన యువ వైద్యుల్లో 2/3 వంతు మహిళా డాక్టర్లు ఉన్నారనని, భారత మహిళలు, యువతులు అన్ని రంగాల్లో ఉన్నతి సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ పూర్తి ఆరోగ్యంపై దృష్టిని సారించాలని, ప్రాణాపాయాలు, యోగాసనాలు చేయాలన్నారు.

ప్రపంచపటంలో భారతదేశం మెడికల్ సేవలలో అందుబాటులో ఉండే దేశంగా నిలవటానికి డాక్టర్ల సేవలు మరువలేనివని,ఆరోగ్యకరమైన, అభివృద్ధి సాధించే భారతదేశం మనందరికీ కావాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రపతిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. మెడికల్ అనేది ఇప్పుడు మెడ్‌టెక్‌గా మారిపోయిందని అన్నారు.

మంగళగిరికి 10 ఎకరాలు ఇస్తామని, అవకాశముంటే తనకు ఇక్కడ చదువుకోవాలని ఉందని పేర్కొన్నారు. కొలనుకొండలో రీసెర్చ్ సెంటర్, ఐఐటీతో అనుసంధానించాలని భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు ఆయూష్, ప్రకాష్‌రావు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో రాష్ట్రపతికి స్వాగతం పలికిన ఏపీ గవర్నర్, ముఖ్యమంత్రి...

అంతకుముందు ఏపీ పర్యటనలో భాగంగా గన్నవరానికి చేరుకున్నరాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విమానాశ్రయం లో గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.అనంతరం విమానాశ్రయంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ముర్ము రోడ్డుమార్గంలో మంగళగిరికి చేరుకున్నారు.

## నిలకడగా బీజేపీ సీనియర్ నేత అద్వానీ ఆరోగ్యం..!

(మొదటి పేజీ తరువాయి)

ఐసీయూ నుంచి బయటకు తరలిస్తాం' అని దవాఖాన తెలిపింది.

గత ఆగస్టులో కూడా అపోలో దవాఖానలో అద్వానీ చికిత్స పొందారు. ఈ ఏడాది ప్రారంభంలో ఎయిమ్స్ లో చికిత్స పొందారు. గత మార్చిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనకు భారత్ రత్న పురస్కారం అందజేశారు. 1927 నవంబర్ ఎనిమిదో తేదీన కరాచీ (ప్రస్తుతం పాకిస్థాన్)లో అద్వానీ జన్మించారు. 1942లో ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్ గా చేరారు. 19861990, 199398, 200405 మధ్య బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా అద్వానీ పని చేశారు.

## ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు ఊరట

### ఇతర రాష్ట్రాల్లో చదివిన రాష్ట్ర విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలి

### జీవో 140 సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో ఎంబీబీఎస్, బీడీఎస్ విద్యార్థులకు హైకోర్టులో ఊరట లభించింది. ఇతర రాష్ట్రాల్లో చదివిన రాష్ట్ర విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలని ఉన్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ మేరకు జీవో 140 సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.



# తగ్గేదేలే..



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో చీఫ్:** తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు ప్రారంభంతోనే రాష్ట్రప్రభుత్వ అప్పులపై వాడి వేడీ చర్చ మొదలైంది. అటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఇటు మాజీ మంత్రి హరీష్ రావు వాదనలతో అసెంబ్లీ దద్దరిల్లింది. సభలో బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన చేపట్టారు. డిప్యూటీ సీఎం నీ సభలోకి పిలవాలని డిమాండ్ చేశారు. అనంతరం అసెంబ్లీలో వచ్చిన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. గత ఏడాది 52 వేల కోట్లు మాత్రమే అప్పు తీసుకున్నామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రశ్నోత్తరాల లో ఎలా ఉండాలి అనేది హరీష్ రావుకి తెలియదని అనుకుంట అని భట్టి విక్రమార్క అన్నారు.

షార్ట్ డిస్కషన్‌లో లాగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అప్పులపై చర్చకు మేం సిద్ధమని తెలిపారు. మీలాగా మేము వెనక్కి పోమన్నారు. ప్రజల కోసం పని చేసే మాపై ప్రివిలేజ్ మోషన్ అంట అని మండిపడ్డారు. అధికారం పోయాకా.. అంత మర్చిపోయారని తెలిపారు. అలా శాసించడం ఏంటి అధ్యక్ష చైర్ నీ అని భట్టి మండిపడ్డారు. సభాపతి అంటే గౌరవం ఉండొద్దా? అన్నారు. బీఏసీ లో పదేళ్లు ఏం చేశారు? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకేం చర్చ చేయాలో స్పీకర్ కి ఇవ్వండి అని అప్పట్లో చెప్పే వారన్నారు. నిన్న మేము కూడా అదే చెప్పామన్నారు. స్పీకర్ కి మీరు ఏం చర్చ చేయాలని అనుకుంటున్నారో ఇవ్వండి అని చెప్పామన్నారు. లేదు... అది కరెక్ట్ కాదు.. అని వాకౌట్ చేశారని గుర్తుచేశారు. పోచారం స్పీకర్ గా ఉన్నప్పుడు నిర్ణయం ఆయన చేసుకున్నారని తెలిపారు.

కానీ గడ్డం ప్రసాద్ చెప్పింది మాత్రం లేదు.. మేము వినం అంటున్నారని భట్టి తెలిపారు. పోచారంకి ఒక గౌరవం... స్పీకర్ గా ప్రసాద్ కుమార్ కి ఇచ్చే గౌరవం ఇదా..? అని ప్రశ్నించారు. ఇదేం పద్ధతి? అని మండిపడ్డారు. మీరు శాసించినట్టు సభ నడవదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష కోట్ల అప్పు చేయలేదు.. రూ.52 వేల కోట్లు అప్పు చేశామన్నారు. అప్పులకు 65 వేల కోట్లు కట్టామన్నారు. రూ. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టారన్నారు. అప్పులు కడుతూ... పెండింగ్ బిల్లులు చెల్లిస్తూ పోతున్నామన్నారు. రూ.40 వేల కోట్లలో 14 వేల కోట్లు చెల్లించామన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు కోరుకునే వాళ్ళు దీన్ని తప్పు పట్టరని తెలిపారు. ధాన్యం కొన్న మూడు రోజులకే డబ్బులు ఇస్తున్నామని తెలిపారు. మీ మోకానికి పదేళ్లలో ఎప్పుడైనా ఇచ్చారా..? అని మండిపడ్డారు. బోనస్ కూడా సన్నాలకి ఇస్తున్నామన్నారు. మ నియోజకవర్గం లో చిట్టిబాబు అనే రైతు నాకు మేసేజ్ పెట్టారు..బోనస్ నాకు వచ్చింది... మంచి జరిగింది అని భట్టి తెలిపారు.

**హరీష్ రావు మాటలు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అప్పులపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు శాసన సభలో ఘాటుగా స్పందించారు. ఏడాదికి రూ.52 వేల కోట్లు మాత్రమే రుణం తీసుకున్నామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం కింద తీసుకున్న రుణాలు రూ. 51 వేల 277 కోట్లు. ఈ ఉదయం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిపోర్ట్ కూడా తీసుకున్నాను. ఇవాళ కలిపితే మరో రూ. 3 వేల కోట్లు. అంటే రూ. ఎఫ్ఆర్‌బీఎం కింద 55, 277 కోట్లు తీసుకున్నారు. రూ. 61,991 కోట్లు కార్పొరేషన్ హామీల కింద తీసుకోగా మరో రూ. 10,099 కోట్లు హామీలు లేకుండానే తీసుకున్నారు. మొత్తంగా ఈ ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అప్పు రూ. 1,27,208 కోట్లు.. ఇలాగే కొనసాగితే 5 ఏళ్లలో రుణం రూ. 6,36,040 కోట్లు అని హరీష్ రావు తెలిపారు.

### నల్లచొక్కాలతో బీఆర్ఎస్ సభ్యులు

లగచర్ల రైతుకు సంకెళ్లు వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు నల్ల చొక్కాలతో అసెంబ్లీకి వచ్చారు. చేతికి సంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. అసెంబ్లీలో కూడా లగర్ల ఘటనపై చర్చకు పట్టుబట్టారు బీఆర్ఎస్ సభ్యులు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సభలో దుమారం రేపారు. అరెస్ట్ అయిన లగచర్ల రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు బేడీలు వేసిన ఘటనలను ప్రస్తావిస్తూ అప్పటి ఫోటోలు చూపించారు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.బీఆర్ఎస్ తీరుపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతుల గురించి మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్‌కు లేదంటూ మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే ఎంతో మంది రైతులకు బేడీలు వేశారన్నారు మంత్రి సీతక్క. లగచర్ల ఘటనలో అధికారులను సస్పెండ్ చేశామన్నారు.

**అసెంబ్లీలో ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారం...**

ఫార్ములాఈ కార్ రేసింగ్ వ్యవహారంలో కేటీఆర్‌తోపాటు బాధ్యులపై చర్యలుంటాయన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వ్యాఖ్యలు.. తెలంగాణ రాజకీయాల్లో హీట్ పెంచాయి. కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ ఇచ్చిన అనుమతిని ఏసీబీకి పంపాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు చెప్పారు. ఏసీబీ విచారణలో కేటీఆర్ సమాధానాలు చెప్పాల్సిందేనన్నారు పొంగులేటి. మంత్రి పొంగులేటి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. వారికీ వీరికి కాదు అసెంబ్లీ సాక్షిగా ప్రజలకు సమాధానం చెప్పడానికి తాను సిద్ధమన్నారు కేటీఆర్. ఈ కార్ రేసింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు కేటీఆర్ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందన్నారు జగదీశ్ రెడ్డి. ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో సభలో చర్చపెడితే కేటీఆర్ సమాధానం చెప్తారన్నారాయన. ఈ సందర్భంగా పొంగులేటి కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు ఎమ్మెల్యే వివేకానంద. బీఆర్ఎస్ లీడర్ల కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. కేటీఆర్‌ను జైల్లో పెట్టాలని ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఈ రేస్ వ్యవహారంలో బీఆర్ఎస్ నేతల అరెస్టులు తప్పవని కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. అయితే కక్ష సాధింపు చర్యలను ప్రజలను హర్షించరంటున్నారు బీఆర్ఎస్ నేతలు.

**ఆందోళనల మధ్యే మూడు బిల్లులకు ఆమోదం..**

విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే మూడు బిల్లులకు ఆమోదం తెలిపింది అసెంబ్లీ. స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లుతో పాటు యూనివర్సిటీల చట్టసవరణ బిల్లు.. జీఎస్టీ సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఎలాంటి చర్చ లేకుండానే ఈ మూడు బిల్లులకు సభ ఆమోదం తెలపడం గమనార్హం. రాష్ట్ర పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ అనంతరం సభ బుధవారానికి వాయిదా పడింది.అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గర బీజేపీ నిరసనకు దిగింది. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేసింది. కౌలు రైతులకు రుణాలు, పట్టాలు ఇవ్వాలని సీపీఐ డిమాండ్ చేసింది.

### జమిలి బిల్లును ప్రవేశపెట్టేందుకు..

# లోక్‌సభ ఆమోదం





**ఢిల్లీ:** లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశంఒకే ఎన్నిక' ప్రణాళిక ఎట్టకేలకు పార్లమెంట్ ముందుకొచ్చింది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా, మరో బిల్లును కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ మంగళవారం లోక్‌సభ లో ప్రవేశపెట్టారు. తొలుత ఈ బిల్లును సభ ముందు ఉంచగా.. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ సహా పలు ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అటు ఎన్డీయే మిత్ర పక్షాలు బిల్లులకు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఆ తర్వాత బిల్లును ప్రవేశపెట్టడంపై ఓటింగ్ నిర్వహించారు.

అనుకూలంగా 269 ఓట్లు..

జమిలి బిల్లును ప్రవేశపెట్టేందుకు కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ తీసుకొచ్చిన తీర్మానంపై ఓటింగ్ జరిగింది. హైబ్రిడ్ విధానంలో దీన్ని చేపట్టారు. ఇందులో కొంతమంది ఎలక్ట్రానిక్ పద్ధతిలో ఓటు వేయగా.. మరికొంతమంది ఎంపీలు బ్యాలెట్‌లో తమ అభిప్రాయాలను తెలియజేశారు. మొత్తంగా ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టేందుకు 269 మంది ఎంపీలు అనుకూలంగా ఓటేశారు. 198 మంది వ్యతిరేకించారు. ఆ తర్వాత 'జమిలి బిల్లుల'ను కేంద్రమంత్రి సభలో ప్రవేశపెట్టారు.

బేషరతుగా మద్దతిచ్చిన టీడీపీ..

ఈ బిల్లుకు భేషరతుగా మద్దతు ఇస్తున్నట్లు తెదేపాకు చెందిన కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సభకు తెలియజేశారు. ''సృజనాత్మక ఆలోచనలకు తెదేపా ఎప్పుడూ మద్దతిస్తుంది. సహకార, సమాఖ్య తత్వానికి మేం అనుకూలం. జమిలి ఎన్నికలతో ఖర్చు తగ్గి సామర్థ్యం పెరుగుతుంది. పోలింగ్ శాతం మెరుగవుతుంది. ఎన్నికల ఖర్చు రూ.లక్ష కోట్లు దాటుతోంది. నిరంతరం ఎన్నికల నిర్వహణ వల్ల అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది'' అని టీడీపీ ఎంపీ వివరించారు.

బిల్లుపై ఎవరు ఏమన్నారంటే..

''జమిలి బిల్లు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధం. దీన్ని కేంద్రం తక్షణమే ఉపసంహరించుకోవాలి'' కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ తెలిపారు.

''రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ఈ బిల్లుతో బిడ్ వేస్తున్నారు. జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారితీస్తాయి'' ఎస్పీ నేత ధర్మేంద్రయాదవ్

''జమిలి ఎన్నికలంటే రాష్ట్రాల హక్కులను దెబ్బతీయడమే. ఇది ప్రజాస్వామ్యానికి వైరస్ లాంటిది. ప్రస్తుతం మనకు కావాల్సింది జమిలి ఎన్నికలు కాదు.. ఎన్నికల సంస్కరణలు. గతంలో ఎన్‌జేఏసీ (నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్) బిల్లును కూడా ఇలాగే చర్చ లేకుండా ఆమోదించుకున్నారు. ఆ తర్వాత మౌలిక స్వరూపానికి ఎన్‌జేఏసీ విరుద్ధమని సుప్రీంకోర్టు దాన్ని కొట్టేసింది. జమిలి ఎన్నికల చట్టం వస్తే దానికీ అదే పరిస్థితి ఎదురవుతుంది'' టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ

''జమిలి ఎన్నికలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధం. ఇవి అధ్యక్ష తరహా పాలనకు దారితీస్తాయి. ప్రాంతీయ పార్టీలను దెబ్బతీస్తాయి'' మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

''ఇది రాష్ట్రాల హక్కులను దెబ్బతీయడమే. జమిలి ఎన్నికల బిల్లును జేపీసీ పంపాలి. లేదా దీన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి'' ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే

''ప్రతిపక్షాలకు సంస్కరణలంటే అలర్జీ. అందుకే దీన్ని వ్యతిరేకిస్తోంది. జమిలి బిల్లుకు మేం పూర్తిగా మద్దతిస్తున్నాం'' శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే

''ఈ బిల్లును జేపీసీకి పంపడానికి మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. క్యాబినెట్ సమావేశంలో మోదీ స్వయంగా ఈ సూచన చేశారు'' కేంద్రమంత్రి అమిత్ షా

''జమిలి ఎన్నికల నిర్వహణ అంశం కొత్తది కాదు. 1983 నుంచి ఈ తరహా ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ ఉంది. దీనివల్ల రాష్ట్రాల హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లదు. రాజ్యాంగ మౌలిక స్వరూపానికి ఇది వ్యతిరేకం కాదు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం కాదు. స్వీడన్, జర్మనీ వంటి దేశాల్లోనూ జమిలి ఎన్నికలు జరుగుతున్నాయి. రాజకీయ కోణంలోనే ప్రతిపక్షాలు ఆలోచిస్తున్నాయి'' అర్జున్ రామ్ మేఘ్‌వాల్ 'ఓటర్లు విసిగిపోయారు'.. జమిలిపై 'కోవింద్' కీలక వ్యాఖ్యలు...

జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకేసారి ఎన్నికల ప్రతిపాదన కార్యరూపం దాల్చిన తర్వాత ఎన్నికల ప్రక్రియకు అది మరింత ఊతమిస్తుందన్నారు. తద్వారా దేశాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. కోల్‌కతాలో ఓ ఆదివాసి సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన ఆయన.. ఏటా ఓట్ల కోసం వచ్చే నేతలతో ఓటర్లు విసిగిపోయారని, తరచూ అటువంటి పరిస్థితి కోరుకోవడం లేదన్నారు. జమిలి బిల్లు పార్లమెంటుకు వచ్చిన తరుణంలో కోవింద్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

వేగంగా ఆర్థికాభివృద్ధి..

''జమిలి ప్రతిపాదన 202930లో పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చిన తర్వాత.. ఏదో ఒక ఎన్నిక కోసం ఓటర్లు ఏటా పోలింగ్ బూత్‌లకు వెళ్లాల్సిన పని ఉండదు. ఇది ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. ప్రస్తుతమున్న జీడీపీకి అదనంగా మరో 1.5శాతం పెరుగుతుంది. ఒకవేళ ఇదే జరిగితే జీడీపీ 10శాతం పెరగడానికి ఎక్కువ సమయం పట్టదు. దాంతో ప్రపంచంలోనే మూడు, నాలుగో ఆర్థిక శక్తిగా మన దేశం నిలుస్తుంది'' అని మాజీ రాష్ట్రపతి పేర్కొన్నారు.

ఎన్నికల ఈ ప్రక్రియకు ఏకకాల ఎన్నికలు మరింత ఊతమిస్తాయని మాజీ రాష్ట్రపతి పేర్కొన్నారు. నేతలు ఏటా ఓట్లు అడగాల్సి వస్తే.. అభివృద్ధికి సంబంధించిన హామీలు ఎందుకు అమలు చేయలేదు అన్న ప్రశ్నకు ప్రజలకు సమాధానం ఇవ్వాలన్నారు. ఇలా ప్రతిసారి ఎన్నికలు జరగడం వల్ల పోలింగ్ బూత్‌లకు వెళ్లేందుకు ఓటర్లు కూడా విముఖత చూపిస్తారని చెప్పారు.జమిలి నివేదికపై మాట్లాడుతూ.. ఉన్నతస్థాయి కమిటీ ఛైర్మన్‌గా అనేక రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సంఘం అధికారులతో సమావేశమైన విషయాన్ని కోవింద్ గుర్తుచేసుకున్నారు. మొత్తంగా వీటికి సంబంధించి 18వేల పేజీల నివేదిక ప్రస్తుతం అందరికీ అందుబాటులో ఉందన్నారు. ఎలాంటి గ్రంథాలయాలకు వెళ్లకుండానే ఒకే ఒక్క మౌజ్ క్లిక్‌తో వాటన్నింటినీ చూడొచ్చన్నారు.

## కేటీఆర్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

(మొదటి పేజీ తరువాయి)

పూర్వాపరాలు, అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ ఒప్పందం చేసుకోవడం, ఆర్‌బీఐ అనుమతి లేకుండా రూ.46 కోట్ల మేర విదేశీ కరెన్సీ చెల్లించడం వంటి వ్యవహారాలపై పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఫిర్యాదు మేరకు ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో కేటీఆర్‌తోపాటు పురపాలకశాఖ అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను, చీఫ్ ఇంజినీర్‌ను బాధ్యులుగా పేర్కొన్నారు. అధికారులపై విచారణకు ప్రభుత్వం ఇంతకుముందే అనుమతి ఇచ్చింది. కేటీఆర్‌పై కేసు నమోదుకు గవర్నర్ నుంచి అనుమతి కోరగా, సుమారు నెల రోజుల తర్వాత ఇటీవల అనుమతి లభించింది. గవర్నర్ అనుమతి రావడం, సీఎస్ లేఖతో ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఏసీబీ ఇప్పుడు గతంలో మంత్రిగా ఉన్న కేటీఆర్‌పై తన దర్యాప్తును కొనసాగించవచ్చు. ఏసీబీ అధికారులు త్వరలోనే నోటీసులు జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.

## మూసీలో కూలగొట్టిన ఇళ్లకు ఈఎంఐలు ఉంటాయా..?




**విశ్వంభర, హైదరాబాద్ :** మూసీ అభివృద్ధి పేరిట ఆ పరివాహక ప్రాంతంలో కూలగొట్టిన ఇళ్లకు ఈఎంఐలు ఉంటే ప్రభుత్వం చెల్లిస్తుందా..? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సూటిగా ప్రశ్నించారు. మూసీ అభివృద్ధి కోసం మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా డీపీఆర్ చేస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు శాసనమండలిలో ప్రస్తావించగా.. ఎమ్మెల్సీ కవిత పలు అంశాలపై ప్రశ్నలు సంధించారు.మూసీ నది విషయంలో డీపీఆర్ ఆధారంగా అంచనా వ్యయాలు ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ రూ. 4100 కోట్లు కావాలని ప్రపంచ బ్యాంకును ప్రభుత్వ ఆశ్రయించినట్లు మాకు నిర్దిష్టమైన సమాచారం ఉంది. ప్రపంచ బ్యాంకును ప్రభుత్వం ఆశ్రయించిన విషయం వాస్తవమా కాదా..? డీపీఆర్ తయారు కాలేదని ప్రభుత్వం ఈ రోజు సభకు చెప్పింది. ఏ తేదీన ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సాయం కోరుతూ ప్రతిపాదనలు పంపించింది. మూసీ కోసం రూ. 14,100 కోట్ల వ్యయం అవుతుందని, నిధులతో పాటు అనుమతులు ఇప్పించాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఏ ప్రాతిపదికన అడిగారు. ఒక వేళ కేంద్రాన్ని సాయం కోరడం, ప్రపంచ బ్యాంకు సాయం కోరడం వాస్తవమైతే సభను, ప్రజలను ఎందుకు తప్పదోవపట్టిస్తున్నారు..? సభను తప్పదోవ పట్టిస్తే అవసరమైతే... ప్రివిలేజ్ మోషన్‌ను ప్రవేశపెడుతాం అని కవిత హెచ్చరించారు.

మూసీ నదిగర్భంలో నివసించే 309 కుటుంబాలు వాళ్లంతట వాళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతోంది. కానీ హృదయవిదారకమైన వీడియోలను చూస్తే ప్రభుత్వం చెబుతున్నది అవసస్తవమని స్పష్టమవుతోంది. ఆ 309 కుటుంబాలు సమ్మతిస్తూ ఏవైనా పత్రాలపై సంతకాలు చేసి ఉంటే అవి సభకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 181 కుటుంబాలు తామంతట తామే కూల్చేసుకొని వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతోంది... ఇది వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంది. మూసీ నిర్వాసితుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలి అని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కవిత సూచించారు.

## ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత ఎప్పుడు?

### - బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి నేటికి ఏడాది పూర్తయిందని.. హామీలు నెరవేర్చకుండా ఇంకెంతకాలం ప్రజలను మోసం చేస్తారని భాజపా శాసనసభాపక్ష నేత ఎ.మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన మాట్లాడారు.''ఆరు గ్యారంటీలు నెరవేర్చేందుకు తగినంత బడ్జెట్ లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెబుతున్నారు. అన్ని వాస్తవాలు తెలిసినా అధికారం కోసం తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆరు గ్యారంటీలు అమలు చేయని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిపై చీటింగ్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నా. ప్రజల్ని మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులంతా రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలి. కాంగ్రెస్ హామీలపై వాయిదా తీర్మానం ఇస్తే స్పీకర్ తిరస్కరించారు. అసెంబ్లీలో మాట్లాడనీయకుండా అధికార పక్షం మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోంది. ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నిస్తున్నాం'' అని మహేశ్వర్‌రెడ్డి అన్నారు.



# లగచర్ల ఘటనపై చర్చకు పారిపోతున్న ప్రభుత్వం

### - మాజీ మంత్రి జగదీష్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీని ఓ ప్రహసనంగా మార్చేసిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ లో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గొంతు నొక్కేందుకు ప్రయత్నించినా ప్రజాక్షేత్రంలో మాత్రం మా గొంతు నొక్కలేరని అన్నారు.శాసనసభ రూల్ బుక్ ప్రకారం అసెంబ్లీ నడవడం లేదని , లగచర్ల రైతులకు బేడీల వేసిన ఘటనపై రెండు రోజులుగా చర్చకు పట్టుబడుతున్నా చర్చించకుండా ప్రభుత్వం పారిపోతుందని మండిపడ్డారు. లగచర్ల, ఫార్ములా ఈ ఘటనలపై కాంగ్రెస్‌కు దమ్ముంటే చర్చకు పెట్టాలని డిమాండ్ చేశారు. చర్చించే ధైర్యం లేక రేవంత్ మొహం చాటేస్తున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ మోసాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. శాసనసభను పదిహేను రోజులు నడిపి, బీఆర్ఎస్ హయాంలో చేసిన ప్రతి పనిని చర్చిద్దామని సూచించారు. రాష్ట్రంలో పోలీస్ పాలన నడుస్తోందని, ప్రభుత్వం అన్నివ్యవస్థలను నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ఎన్ని సవాళ్లు ఎదురైనా ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని అన్నారు. కేసులు, అరెస్టులు అంటూ నాలుగు గోడల మధ్య ఉండి రేవంత్ వార్తలు రాయిస్తున్నారని విమర్శించారు.

# సీఎం పేరు మర్చిపోవడమే అల్లు అర్జున్ చేసిన తప్పా?: కేటీఆర్



**విశ్వంభర, హైదరాబాద్:** పుష్ప2 సక్సెస్ మీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పేరు మర్చిపోవడమే నటుడు అల్లు అర్జున్ చేసిన తప్పా? అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం పేరు మర్చిపోయినంత మాత్రాన అరెస్ట్ చేస్తారా? అని నిలదీశారు. "అసెంబ్లీ సమావేశాలు 15 రోజుల పాటు పెట్టండి. మొదట ప్రజా సమస్యలపై చర్చిద్దాం. స్కాములు, ఫార్ములా అంటున్నారు.. అన్నీ చర్చిద్దాం. కేబినెట్ మీటింగ్‌లో కాదు.. అసెంబ్లీలో చర్చ పెట్టండి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్యనేతలతో తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సహా పలువురు నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రుణమాఫీ పూర్తి చేయని, రైతుబంధు ఇవ్వని సీఎం రేవంత్‌రెడ్డికి సర్పంచి ఎన్నికల్లో రైతులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. లగచర్ల అంశాన్ని రాజ్యసభలో కూడా ప్రస్తావిస్తామని తెలిపారు. కొడంగల్ నుంచే బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభం కావాలన్నారు. జమిలి ఎన్నికలు అంటున్నారు.. కాంగ్రెస్‌ను పంపేందుకు 2028 వరకు వేచి చూడాల్సిన అవసరం కూడా రాదేమోనని కేటీఆర్ వ్యాఖ్యానించారు.



ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ లంకలపల్లి ఆనంద్ కుమార్ మంగళవారం మా ఓల్డ్ ఏజ్ హోమ్, వనస్థలిపురంకు విచ్చేసి హోమ్ లోని వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధులందరికీ దుప్పట్లు, పండ్లు స్వీట్స్ అందజేశారు. ఆయన వెంట శ్రీమాన్ గ్రూప్ చైర్మన్ అనూప్ చక్రవర్తి లింగాల అరుణ్, ప్రసాద్, రెడీ టు సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్, సెక్రటరీ ప్రవీణ్ గద్దె, విజయ్ నేత, మహేష్ ఉన్నారు.

- విశ్వంభర, వనస్థలిపురం

### లగచర్ల గిరిజన రైతులను

# వెంటనే విడుదల చేయాలి..

### - దాసోజు శ్రవణ్ డిమాండ్



**విశ్వంభర, హైదరాబాద్ :** రాక్షస ఆనందం పొందుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. లగచర్ల గిరిజన రైతుల విడుదలకు వెంటనే చర్యలు తీసుకోవాలి అని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ బీఆర్ఎస్ శ్రేణులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి, లగచర్ల గిరిజన రైతుల అక్రమ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. లగచర్ల గిరిజన రైతులను అక్రమంగా జైలులో నిర్బంధించి, థర్డ్ డిగ్రీలు ప్రయోగించి రాక్షస ఆనందం పొందుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించే చర్య అని తీవ్రస్థాయిలో విమర్శించారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తూ గిరిజన రైతులకు అవసరమైన బెయిల్ రాకుండా అవరోధాలు సృష్టిస్తోంది. రైతులను జైళ్లలో ఉంచి అన్యాయంగా ఇబ్బందులు పడేలా చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నాం. అంతేకాక, ఈ అత్యంత కీలకమైన అంశంపై అసెంబ్లీలో చర్చకు కూడా అనుమతించకపోవడం దురభిమానం అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని, వారి విడుదల కోసం తక్షణ చర్యలు చేపట్టాలని దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. రైతన్నల హక్కులను రక్షించడం ప్రభుత్వ బాధ్యత, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విలువలతో ప్రభుత్వాలు ముందుకు సాగాలి. లగచర్ల ఘటనలో నిరంకుశ విధానాలకు పాల్పడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పార్టీ నిలదీస్తుంది అని శ్రవణ్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, ఖైరతాబాద్ బీఆర్ఎస్ శ్రేణులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ వినతిపత్ర సమర్పణ కార్యక్రమంలో దాసోజు శ్రవణ్, మన్నే కవిత, మన్నే గోవర్ధన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, విప్లవ్, తదితర నేతలు పాల్గొన్నారు.

# పేర్ని నానీ.. పేదల బియ్యం బొక్కేసి నీతికబుర్లా?

### - మంత్రి కొల్లు రవీంద్ర



**విశ్వంభర, అమరావతి:** వైసీపీ నేత పేర్ని నాని పేదల బియ్యం బొక్కేసి నీతి కబుర్లు చెబుతున్నాడని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. పేర్ని నానిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. రూ.90లక్షల విలువైన 185 టన్నుల బియ్యాన్ని తినేశారని దుయ్యబట్టారు. పేర్ని కుటుంబం అంతా పరారీలోనే ఉందన్న మంత్రి కొల్లు రవీంద్ర.. దొంగ అయిన పేర్ని నానికి పరామర్శలు విడ్డూరమని మండిపడ్డారు. వైసీపీ అంతా దొంగల పార్టీనే అని అర్థమవుతోందని ఆక్షేపించారు.

**రేషన్ బియ్యం మాయంపై అధికారులు చర్యలు..**

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పేర్ని నానికి చెందిన గిడ్డంగిలో రేషన్ బియ్యం మాయంపై అధికారులు చర్యలు చేపట్టారు. గోడౌన్‌లో ఉన్న రేషన్ బియ్యాన్ని మచిలీపట్నంలోని మార్కెట్ యార్డుకు తరలించారు. 8 లారీల ద్వారా లారీకి 500 బస్తాలను లోడ్ చేసి తరలిస్తున్నారు. పొట్లపాలెం గ్రామంలోని పేర్ని నానికి చెందిన గోడౌన్‌లో 185 టన్నుల రేషన్ బియ్యం మాయం కావడంపై గోడౌన్ యజమానిగా ఉన్న పేర్ని నాని సతీమణి జయసుధపై పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పౌరసరఫరాల అధికారులు సంబంధిత గోడౌన్‌లో ఉన్న రేషన్ బియ్యం నిల్వలన్నింటినీ మచిలీపట్నం మార్కెట్ యార్డుకు తరలిస్తున్నారు. గోడౌన్‌లో స్టాక్ మొత్తాన్ని ఖాళీ చేయించిన తర్వాత ఈ గిడ్డంగిని బ్లాక్ లిస్టులో పెట్టనున్నారు. గోడౌన్ పరిసరాలకు ఎవరూ రాకుండా వైసీపీ కార్యకర్తలు కాపలా కాస్తున్నారు.

### ఆరేండ్ల కనిష్టానికి.. హైదరాబాద్‌లో

# పడిపోయిన ఉష్ణోగ్రతలు



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. గత ఆరేండ్లలో ఎన్నడూ లేనంతంగా కనిష్టానికి పడిపోయాయి. హెచ్‌సీయూ, మౌలాలీలో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, బీహెచ్ఈఎల్‌లో 7.4, రాజేంద్రనగర్‌లో 8.2, గచ్చిబౌలి 9.3, వెస్ట్ మారేడుపల్లి 9.9, కుత్బుల్లాపూర్, మచ్చబొల్లారం 10.2, శివరాంపల్లి 10.3, జీడిమెట్ల 11.4, బాలానగర్ 11.5, పటాన్‌చెరు 11.7, షాపూర్‌నగర్ 11.7, లింగంపల్లి 11.8, బోయిన్‌పల్లి 11.9, బేగంపేట 12, ఆసిఫ్‌నగర్ 12, నేరెడ్‌మెట్ 12.1, లంగర్‌హౌస్ 12.2, మోండా మార్కెట్ 12.4, చందానగర్ 12.7, షేక్‌పేట 12.8, మాదాపూర్ 12.8, ముషీరాబాద్ 12.9, చాంద్రాయణగుట్ట 13, కూకట్‌పల్లి 13.1, గోల్కొండ 13.2, సఫిల్‌గూడ, హయత్‌నగర్ 13.3, ఉప్పల్ 13.4, మల్లాపూర్ 13.5, ఆదర్శ్‌నగర్ 13.5, తిరుమలగిరి, చర్లపల్లి 13.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అతితక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలాలో 6.3 డిగ్రీలు రికార్డయ్యాయి. నిర్మల్ జిల్లా తాండ్రలో 6.3, ఆదిలాబాద్ జిల్లా పోచర 6.4, జైనాథ్ 6.5, అర్లి (టీ) 6.6, చాప్రాల్ 6.6, సంగారెడ్డి జిల్లా సత్వార్ 6.6, వికారాబాద్‌లోని బంట్వారం 6.7, సంగారెడ్డిలోని న్యాల్కల్‌లో 6.7, ఎలిమినేడు, రాచలూరు (రంగారెడ్డి) 6.7, సిర్పూర్ యూ (ఆసిఫాబాద్) 6.7, చందనపల్లి (రంగారెడ్డి) 6.7, కోహిర్ (సంగారెడ్డి) 6.7, మర్పల్లి (వికారాబాద్) 6.8, వికారాబాద్ జిల్లాలోని నగరం (టీ), మన్నెగూడలో 6.8, నల్లవెల్లి (సంగారెడ్డి) 6.8, పోతరరెడ్డిపేట (సిద్దిపేట) 6.9, జహీరాబాద్ (సంగారెడ్డి) 6.9, మెనూర్ (కామారెడ్డి) 6.9, రాఘవపేట (జగిత్యాల) 7.3, కెరమెరి (ఆసిఫాబాద్) 7.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉత్తరాది నుంచి ఈదురుగాలులు, శీతల పవనాలు వీస్తుండటంతో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సిందే..

# లేదంటే ఆందోళనలు చేస్తాం

### - ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ

**విశ్వంభర, హైదరాబాద్ :** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోతే ఎంఐఎం ఊరుకోదు అని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని బకాయిలను బీఆర్ఎస్ ప్రభుత్వం చెల్లించింది. బీఆర్ఎస్ పెట్టిన బకాయిలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాల్సిందే అని ఓవైసీ డిమాండ్ చేశారు. శాసనసభలో జీరో అవర్ సందర్భంగా ఎమ్మెల్యే ఓవైసీ ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని ప్రస్తావించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, కాలేజీల యాజమాన్యాలు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నిధుల విడుదల చేయకపోవడంతో 7 లక్షల మంది విద్యార్థులు ప్రతి ఏడాది నష్టపోతున్నారు. ఈ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. విద్యార్థుల వద్ద ఫీజులు వసూలు చేసి కాలేజీలు నడుపుతున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడం కారణంగా.. 20 లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా బాధపడుతున్నారు. 4 లక్షల మంది టీచింగ్ స్టాఫ్ సమయానికి జీతాలు పొందలేకపోతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం మరిచిపోవద్దు అని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ సూచించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆగిపోవడంతో చాలా కాలేజీలు మూతపడుతున్నాయి. ఏడాది కాలం నుంచి ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు కూడా విడుదల చేయడం లేదు. ఇది బర్నింగ్ ఇష్యూ. దయచేసి అడుగుతున్నా.. సగంలో సగం అయినా నిధులు విడుదల చేయాలి. విద్యార్థుల జీవితాలతో ఎందుకు ఆడుకుంటున్నారు. ఏదో నోట్ చేసుకుంటున్నాం.. అని మంత్రులు చెప్పొద్దు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోవద్దు. తప్పకుండా నిధులు విడుదల చేయండి. ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించడం ప్రభుత్వాల బాధ్యత. నిధులు విడుదల చేయకపోతే ఎంఐఎం పార్టీ ఆందోళనలు చేపడుతుంది. నిరసనలు వ్యక్తం చేస్తాం. అన్ని పార్టీలు మద్దతు పలకాల్సిన అవసరం ఉంది అని ఎమ్మెల్యే ఓవైసీ కోరారు. ఇక ఇదే అంశంపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రయత్నించగా, స్పీకర్ మైక్ ఇవ్వలేదు.



### సంధ్య థియేటర్ ఘటనలో

# బాలుడి ఆరోగ్య పరిస్థితి వెల్లడించిన సీపీ




**విశ్వంభర, హైదరాబాద్:** ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడిన బాలుడు శ్రీతేజ్‌కు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. మంగళవారం కిమ్స్ ఆసుపత్రికి వచ్చిన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్.. వైద్యఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినాతో కలిసి బాలుడు శ్రీతేజ్‌ను పరామర్శించారు."13 రోజులుగా బాలుడికి చికిత్స కొనసాగుతోంది. ప్రస్తుతం వెంటిలేటర్ సాయంతో చికిత్స అందిస్తున్నారు. డిసెంబరు 4న జరిగిన తొక్కిసలాట ఘటనలో శ్రీతేజ్‌కు ఆక్సిజన్ అందక బ్రెయిన్ డ్యామేజ్ అయింది. వెంటిలేటర్ సాయంతో ఆక్సిజన్ అందిస్తున్నారు. పూర్తిగా కోలుకునేందుకు సమయం పడుతుందని వైద్యులు చెబుతున్నారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు బులిటెన్ విడుదల చేస్తారు" అని సీపీ తెలిపారు. ప్రభుత్వ పరంగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, బాలుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదు?..

### సంధ్య థియేటర్‌కి షోకాజ్ నోటీసులు

**విశ్వంభర, హైదరాబాద్:** ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య థియేటర్‌కు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 4న రాత్రి పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల జరిగిన ఘటనపై లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో తెలపాలంటూ నోటీసులు జారీ చేశారు. దీనిపై పది రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.థియేటర్‌కు ఇరువైపులా రెస్టారెంట్‌లు ఉన్నాయని, నటులొస్తే భద్రత కల్పించలేమని చిక్కడపల్లి పోలీసులు ముందుగానే హెచ్చరించినట్టు ఓ రిపోర్టు సామాజిక మాధ్యమాల్లో ఇప్పటికే వైరల్ అయింది. సంధ్య 70ఎంఎం, 35ఎంఎం రెండు థియేటర్లు ఒకేచోట ఉండగా, వీటిలో దాదాపు 2,520 సీటింగ్ కెపాసిటీ ఉంది. మహిళలు థియేటర్‌లోకి వెళ్లేందుకు ప్రత్యేకంగా ఎంట్రీ, డిస్‌ప్లే బోర్డులు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ప్రేక్షకులు థియేటర్‌లోకి వెళ్లేందుకు ఒకటే మార్గం ఉంది. ఎక్కువ మంది ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చే విధంగా ప్రోత్సహిస్తోన్న యాజమాన్యం .. రద్దీని నియంత్రించేందుకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదని పోలీసుల దర్యాప్తులో తేలింది. అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు వచ్చిన సమయంలో జరిగిన తొక్కిసలాటలో మహిళ మృతి చెందడం, బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణించారు. ఈ కేసులో ఇప్పటికే అల్లు అర్జున్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. తాజాగా సంధ్య థియేటర్ లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసు ఇచ్చారు.






# నిన్నటి తరాన్ని అనుసరిద్దాం..

ఆ రోజుల్లో పిల్లల ఆటలన్నీ ఆరుబయటే! 2000 సంవత్సరం వరకు పిల్లల జీవనశైలి ఆరోగ్యకరంగా ఉండేది. రోజంతా మైదానాల్లో గడిపేవారు. నేటి తరం పిల్లలకు స్మార్ట్‌ఫోనే గ్రౌండ్‌గా మారిపోయింది. వీడియోగేమ్సే ఆటవిడుపుగా మారాయి. అయితే, ఆరుబయట ఆడుకునే పిల్లలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం పరిశోధన తేల్చింది. ఈ ఆటలు వారిలో శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతోపాటు సామాజిక నైపుణ్యాలనూ మెరుగుపరుస్తాయని వెల్లడించింది.



నాటి తరానికి తెర అంటే.. టీవీ మాత్రమే! సినిమా అంటే.. ఆదివారమే! కానీ, ఇప్పటి పిల్లలు రోజంతా స్క్రీన్‌లోనే గడిపేస్తున్నారు. ఆటలేకాదు, పాఠాలు కూడా స్క్రీన్‌కు అంకితమై వింటున్నారు. స్మార్ట్‌ఫోన్, ట్యాబ్, కంప్యూటర్.. ఇలా స్క్రీన్ ఉచ్చులో చిక్కుకొని అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారు. దేశంలో దాదాపు 61 శాతం మంది తల్లిదండ్రులు, తమ పిల్లల స్క్రీన్‌టైమ్ గురించి ఆందోళన చెందుతున్నారని పలు పరిశోధనల్లో తేలింది. స్మార్ట్ దునియాలో చక్కర్లు కొడుతున్న బాల్యం.. పిల్లల భాషాభివృద్ధికి గొడ్డలిపెట్టుగా మారుతున్నదనీ, వారి మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతున్నదని అధ్యయనకారులు హెచ్చరిస్తున్నారు. అందుకే, పిల్లల స్క్రీన్‌టైమ్ తగ్గించాలనీ, వారిని ఆరుబయట ఆడుకునేలా ప్రోత్సహించాలనీ సూచిస్తున్నారు.

పుస్తకాలే నేస్తాలు..

నైంటీస్ కిడ్స్ దాచుకున్న స్లామ్‌బుక్స్‌ను ఒక్కసారి తిరగేయండి. చాలా పేజీల్లో హాబీస్ దగ్గర.. 'రీడింగ్ బుక్స్' అనే కనిపిస్తుంది. పుస్తకాలే నేస్తాలుగా గడిచిన బాల్యం వాళ్లది. చందమామ కథలు చదువుతూ.. నిద్రలోకి జారుకున్న తరం వాళ్లది. మరిప్పుడో.. స్కూల్ బుక్స్, హోమ్ వర్క్ తప్ప, వేరే పుస్తకమే తెలియకుండా రోజులు గడిపేస్తున్నారు. కాబట్టి.. మీ పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచండి. ప్రతిరోజూ పడుకునే ముందు.. వారికి ఒక మంచి పుస్తకం ఇచ్చి చదవమనండి. పుస్తకాలు చదవడం వల్ల వారిలో ఆలోచనా శక్తి పెరుగుతుంది. భాషా నైపుణ్యాలూ మెరుగుపడుతాయి.

ప్రకృతి ప్రేమికులు..

నాటికాలం పిల్లలు.. ప్రకృతి ప్రేమికులు. చుట్టూ ఉండే చెట్టూ చేమల్ని చూసే ఎక్కువగా నేర్చుకున్నారు. నేటి తరానికి ఇల్లు, స్కూలూ తప్ప.. వేరే ప్రాంతం పెద్దగా తెలియదు. అయితే.. ప్రకృతితో మమేకమైతేనే.. పిల్లల్లో సృజనాత్మకత పెరుగుతుంది. సమస్యపరిష్కార సామర్థ్యాలు మెరుగుపడతాయన్న విషయం తల్లిదండ్రులు గుర్తించాలి. అందుకే.. ప్రకృతిలో ఉన్న వింతలను, సహజత్వాన్ని పిల్లలకు అలవాటు చేయాలి. వైరస్‌లు, బ్యాక్టీరియాలు అంటూ భయపెట్టకుండా.. పిల్లల్ని స్వేచ్ఛగా మట్టిలో ఆడుకోనివ్వాలి. నీళ్లలో గెంతనివ్వాలి. ప్రకృతిని ప్రేమించేలా.. వారిని ప్రోత్సహించడం చాలా అవసరం.

బంధాలతో అనుబంధం

90వ దశకంలో ఉమ్మడి కుటుంబాలే ఎక్కువగా ఉండేవి. ఏ పండుగొచ్చినా ఇళ్లన్నీ జనాలతో అనుబంధాల కలబోతలా కళకళలాడేవి. నలుగురు కలిసి ఒక ఇంట్లో ఉండటమే గగనంగా ఉన్న ఈ రోజుల్లో.. ఇప్పటితరం కుటుంబంతో కన్నా సామాజిక మాధ్యమాల్లోనే ఎక్కువగా గడుపుతున్నది. ఫలితం.. మనిషికి ఉండాల్సిన సహజ భావోద్వేగాలు కూడా మృగ్యమైపోతున్నాయి. ఈ పోకడ.. వారి భవిష్యత్తులో మరిన్ని విపత్కర పరిస్థితులకు దారితీసే ప్రమాదం ఉంది. కాబట్టి, పిల్లల మధ్య ప్రేమానురాగాలు పెరిగేలా చూడండి. రోజుకు ఒకపూటైనా కుటుంబసభ్యులంతా కలిసి భోజనం చేసేలా ప్లాన్ చేసుకోండి. అన్నదమ్ముల పిల్లలను తరచూ కలుసుకునే పరిస్థితులు కల్పించండి. తద్వారా వారికి బంధాల విలువ తెలిసొస్తుంది.

# స్మార్ట్ వర్కర్‌కే ఇప్పుడు క్రేజ్



ఇప్పుడంతా స్మార్ట్ యుగం. హార్డ్‌వర్కర్ అన్న పేరుకన్నా స్మార్ట్ వర్కర్ అన్న పదానికే ఇప్పుడు క్రేజ్ ఉంది. తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తిని ఇవ్వడం అన్నది ఇటు పనిచేసేవారికీ హాయిగొలిపే అంశమే. మీరూ స్మార్ట్ వర్కర్‌గా మారిపోవాలనుకుంటే ఇదిగోండి కొన్ని టిప్స్.

పనుల జాబితా: రోజును ప్రారంభించబోయే ముందే ఆ రోజు ఏం చేయాలి అన్నదాని మీద అవగాహన ఉండాలి. స్టాండప్ కాల్స్, రివ్యూ, క్లయింట్ మీటింగ్, ఇంటర్నల్ డిస్కషన్స్--- ఇలాంటివన్నీ ఎప్పుడెప్పుడు ఉంటాయి అన్నది ఒకసారి అవలోకించుకుంటే, ఆ సమయానికి మిమ్మల్ని మీరు చక్కగా ప్రెజెంట్ చేసుకోగలుగుతారు. ఏ గ్యాప్ దగ్గర విశ్రాంతి తీసుకోవచ్చు. ఏ సమయంలో పనిచేసుకోవచ్చు అన్నదీ తెలుస్తుంది.

ప్రాధాన్యతా క్రమంలో..: పనిచేసేప్పుడు కూడా ఏ పని ఎక్కువ ప్రయారిటీ అన్నది చూసుకోవాలి. అంటే 20 శాతం టాస్క్‌లు 80 శాతం పనిని పూర్తిచేస్తాయి. ముందుగా ప్రాధాన్యం ఉన్న అలాంటి వాటిని గుర్తించి, పూర్తి చేసుకుంటే మిగతావి చేయడం సులభం అవుతుంది.

నో చెప్పండి: చెప్పిన ప్రతి పనికీ తలూపడం కాకుండా, ముందుగా మీ దగ్గర ఉన్న పనులకు పట్టే సమయాన్నీ వాటి ప్రాధాన్యాన్ని అంచనా వేసుకోండి. అవీ ఇవీ చేయడం కష్టం అనిపిస్తే తప్పకుండా నో చెప్పండి. లేకపోతే లేనిపోని గందరగోళానికి గురై సకాలంలో ఏ పనీపూర్తి చేయలేరు.

ఇంటర్‌వెల్ ఉండాలి: సుదీర్ఘ సమయం పనిచేస్తూ ఉండటం అంటే హార్డ్ వర్క్ చేయడమే. కానీ, క్రమం తప్పకుండా బ్రేక్‌లు తీసుకుంటూ పనులు పూర్తి చేస్తే అది ఒత్తిడిగా అనిపించదు. అధ్యయనాలు చెబుతున్న విషయం ఏమిటంటే ఇలాంటప్పుడు పనులు త్వరగా పూర్తవుతాయట కూడా.

సత్వర స్పందన: ఏదైనా ఇష్యూ మీ దగ్గరకి వచ్చినప్పుడు, ఒక మెయిల్‌కు రెస్పాండ్ అవ్వాల్సి వచ్చినప్పుడు వెనువెంటనే దానికి రిప్లై ఇవ్వండి. అవసరమైన వారి దృష్టికి ఆ సమస్యను తీసుకెళ్లండి. దీని తర్వాతే ఆ టాస్క్‌కు సంబంధించిన పని మొదలుపెట్టండి. వెంటనే స్పందిచడం అన్నది స్మార్ట్ వర్కర్ లక్షణాల్లో ప్రధానమైనది.

# విశ్వనాథుడు మహా విశ్వకవి



విశ్వంలో మన విశ్వనాథవారికి సాటిరాగల సాహితీమూర్తిమత్వం మరొటి ఉందా? లేదు. విశ్వనాథ సత్యనారాయణ సాహితీ మూర్తిమత్వం విశ్వసాహిత్యంలోనే అరుదైనది. వారు తెలుగువ్యక్తి కాకపోయుంటే ఈనాటికి విశ్వకవిగా విస్తృతికెక్కేవారు.

తెలుగువారికి తొలి జ్ఞానపీఠాన్ని అందించిన కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ. విశ్వనాథ వారి ఏ రచన అయినా సరే భారతీయ ఆత్మను, జీవుని వేదనను ప్రతిబింబించేదే. ప్రతీ అక్షరంలోను అసాధారణ ఊహాశక్తిని, అద్భుత రచనాశైలిని నింపి పాఠకుల హృదయాలలోకి పరుగులెత్తించగలిగిన శక్తి ఆయన సొంతం. తెలుగు సాహిత్య ప్రక్రియల్లో విశ్వనాథ వారు స్పృశించని ప్రక్రియలేదు. తన రచనల ద్వారా కులాతీత, మతాతీత విధానాలను ఎండగట్టారు. ఆధునిక తెలుగు రచయితల్లో ఆయన పేరు లేకుండా తెలుగు సాహిత్య చరిత్ర గురించి వివరించలేం. ఈ నేపథ్యంలో ఆయన్ను గురించి కొన్ని ఆసక్తికర విషయాలు తెలుసుకుందాం.

విశ్వనాథ రచనల్లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సినవి ఆంధ్రపౌరుషము, రామాయణ కల్పవృక్షము, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, పురాణవైర గ్రంథమాల, కాశ్మీర చారిత్రిక నవలలు, విశ్వనాథ మధ్యాక్కఅలు, నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తి వంటివి. తెలుగు తనమన్నా, తెలుగు భాష అన్నా విశ్వనాథకు ప్రత్యేక అభిమానం. ఆంధ్ర పౌరుషం, ఆంధ్రప్రశస్తి ఆయన మొదటి రచనలలోనివి. విశ్వనాథ రచనలలో అతని పాండిత్యమే కాక, రచనాశిల్పం, పాత్ర చిత్రణ, చారిత్రక అవగాహన అద్భుతంగా కనిపిస్తుంటాయి. ఆయన చేసిన ''రామాయణ కల్పవృక్షము'' అనే పుస్తక రచనకు గాను జ్ఞాన్ పీఠ్ అవార్డు అందుకున్నారు.

విశ్వనాథ సత్యనారాయణ 1895 సెప్టెంబరు 10న కృష్ణా జిల్లాలోని నందమూరులో జన్మించారు. ఆయన తల్లి దండ్రులు పార్వతమ్మ, శోభనాద్రి సత్యనారాయణ. తన ప్రసంగాల ద్వారా ఏదైతే చెప్పేవారో అదే ఆచరించి చూపేవారు. ఆయన రాసిన "శ్రీమద్రామాయణ కల్పవృక్షం'' రచనకు జ్ఞానపీఠ అవార్డు వచ్చింది.. ఆయన రాసిన వరలక్ష్మీ త్రిశతి అనే స్మృతికావ్యం పాఠకులను మరో లోకంలోకి విహరింపజేస్తుంది. చారిత్రక నవల చెద్దెన్న సేనాని ఆయనకు ప్రతిష్ఠ తెచ్చింది.

సంచలన రచనలు..

నన్నయ్య, నాచనసోమన, అల్లసాని పెద్దన, కాళిదాసుల కవితా ధోరణుల మీద ఆయన రాసిన విమర్శనాత్మక వ్యాసాలు ఆణిముత్యాలు. కొన్ని రచనలను రేడియో నాటికలుగా మలిచారు. ఆయన రచనలను ఇతర భాషల్లో కూడా అనువదించారు. ఆయన రేడియో కోసం నాటకాలు, ప్రసంగాలు రూపొందించారు. అమృత శర్మిష్ఠమ్, గుప్త పాశుపతమ్, అనే నాటకాలను, ఆశనిరాశకు అనే నాటికను, దేవీత్రిశతి, వంటి కావ్యాలను ఆయన సంస్కృత భాషలో రచించారు. వీరిరచనలన్నీ సంచలన రచనలే. సత్యనారాయణ చేపట్టని ప్రక్రియకాని, ప్రయోగం కానీ లేదు.

## విశేషమైన ప్రతిభా పాటవాలు

వారి నవల, కథ , నాటిక, పాట, ఏదైనా తగిన పరిష్కారాన్ని అందించే విధంగా ఉండటం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పద్య రచన అపూర్వం. సంస్కృత నాటకాల్లో గుప్త పాశుపతం, అమృత శర్మిష తెలుగు నాటకాల్లో కనకరాజు, అనార్కలి ప్రసిద్ధమైనవి. ఆయన కొన్ని పత్రికలకు సంపాదకులుగా కూడా పని చేశారు. కొంతకాలం ఆయన ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమికి ఉపాధ్యక్షుడుగా ఉన్నారు.

గుర్తింపు, అవార్డులు..

కోల్‌కతా, ముంబయి ఢిల్లీ, మద్రాసు, బెంగుళూరు వంటి పట్టణాల్లో ఆయన పొందిన సత్కారాలు అపూర్వమైనవి. 1964లోఆంధ్ర విశ్వ కలా పరిషత్ విశ్వనాథ వారిని కళా ప్రపూర్ణ బిరుదుతో సత్కరించారు. భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో గౌరవించింది.కవిగా పండితునిగా, నవలా రచయితగా, నాటక కర్తగా, విమర్శకుడుగా, గాయకుడిగా రాణించిన విశ్వనాథ వారు 1976 అక్టోబరు 18న తనువు చాలించారు. ఆ అద్భుత ప్రతిభాశాలి నడిచిన సాహితీసేవా మార్గంలో నేటి యువత చిత్తశుద్ధితో అడుగులు వేయాలని ఆశిద్దాం.

# వలసలు లేకుండా ప్రపంచ అభివృద్ధి లేదు

**నేడు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం**




విశ్వ వ్యాప్తంగా అధిక సంఖ్యలో పెరుగుతున్న వలసలను పరిశీలించి ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ, 1990 డిసెంబర్ 18న జరిగిన సమావేశంలో 'వలసకార్మికులు, వారి కుటుంబ సభ్యుల హక్కుల రక్షణ' గురించి ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ప్రపంచవ్యాప్తంగా వలస వెళ్తున్న పౌరులందరి కోసం డిసెంబర్ 18ని అంతర్జాతీయ వలసదారుల దినోత్సవంగా ప్రకటించింది.ఆనాటి నుండి ప్రతి సంవత్సరం "డిసెంబర్ 18 అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం"గా జరుపుకుంటున్నారు.

వలస అంటే...బతుకు దేరువు కోసం,లేదా ఆర్థికాభివృద్ధి కొరకు చేసుకునే "నివాస మార్పు" గా భావించ వచ్చు. వలసల వల్ల ఆటంకాలు ఎదురైన కూడా అభివృద్ధి, మానవ వికాసం జరిగే అవకాశం ఉంది. ప్రజలు వలసలతో పలు అవకాశాలను పొందగలుగుతున్నప్పటికీ కష్టాలను కూడా ఎదుర్కోవలసి వస్తుంది.వలసలు లేకుండా ప్రపంచ అభివృద్ధి లేదేమో అనిపిస్తుంది.అది "నెట్టివేయబడడం లేకా ఆకర్శించబడడం వల్ల మాత్రమే జరుగుతుంది.

వలసలకు ఎన్నో కారణాలు ఉన్నాయి. వలస అనేది, వెళ్లేలా "నెట్టివేయబడే" పరిస్థితులు కొన్నైతే, వున్నచోట పరిస్థితులు అనుకూలంగా లేక మరొక చోట "ఆకర్షణీయంగా" ఉండడం మరొక కారణం. పేదరికం, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు ఒక కారణమైతే, . అధిక వేతనాలు, మెరుగైన జీవనం, ఇతర ప్రాంతములోని అనుకూల పరిస్థితులు వలస వెళ్ళడానికి మరొకారణంగా చెప్ప వచ్చు. పని కోసం, బతుకుదెరువు కోసం పల్లెల నుంచి పట్టణాలకు, నగరాలకు గానీ, ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి గానీ వలస వెళ్లడాన్ని "అంతర్గత వలసలు" అంటారు. ఒకదేశం నుంచి మరొకదేశానికి వెళ్లడాన్ని "అంతర్జాతీయ వలసలు" అంటారు. ఉన్న ఊర్లో ఉపాధి కరువై బతుకుదెరువు కోసం వేరే ప్రాంతాలకు, దేశాలకు వెళ్లేవారు కొందరు, మరింత మెరుగైన జీవితం కోసం, అధిక సంపాదన కోసం వెళ్లేవారు మరికొందరు. కొన్ని మిలియన్ల వలసదారులు చేసిన సహకారాన్ని గుర్తుంచుకొని వారిని గౌరవించు కోవలసిన అవసరం ఉంది.వలసదారుల వల్ల సమాజానికి కలిగే ప్రయోజనం ప్రజలకు తెలిస్తే,వలసదారులను గౌరవిస్తూ వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడవచ్చు.

ఈ చొరవపై ఆధారపడి, డిసెంబర్ 18 వలస హక్కుల అంతర్జాతీయ మరియు వలసదారుల హక్కులపై


అంతర్జాతీయ వలస దినోత్సవం యొక్క ఐక్య రాజ్యసమితి ప్రకటన ఒక ముఖ్యమైన దశగా భావించ వచ్చు. ఇది వలసదారుల రక్షణకు సంబంధించిన వారందరికీ ఉపయుక్తంగా ఉంది. మానవ హక్కులు మరియు వలసదారుల యొక్క ప్రాథమిక స్వేచ్ఛపై సమాచారాన్ని వ్యాప్తి చేయడం, అనుభవాలను పంచుకోవడం మరియు వలసదారుల రక్షణను నిర్ధారించడానికి చర్యలు చేపట్టడం ద్వారా, ఈ రోజుకు గౌరవం ఇవ్వవచ్చు నాని చాలా దేశాలు దీనిని ఆమోదించాయి.ఇంకా ఆమోదించని దేశాలు కూడా ఉన్నాయి.

అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం రోజు ప్రతి దేశములోని వలసదారులను గుర్తించి వారి సేవలను అభినందిస్తూ, వారికి ఉన్న ప్రాథమిక హక్కులకు ఎలాంటి భంగం కలుగ నీయమనే ధైర్యం ఇవ్వవలసిన అవసరం ఉంది.వారికి గౌరవాన్ని కల్పించడం వల్ల వారి సేవతో దేశాభివృద్ధి జరుగుతున్న విషయం మరిచిపోవద్దు. ప్రవాసులకు అన్నివిధాలుగా రాయితీలు కల్పిస్తూ వారిని ప్రొత్సహిస్తే ఆనతి కాలంలో అభివృద్ధిని సాధించవచ్చు. ప్రపంచమంతా కలసి ఒక యూనిట్ గామారుతున్న తరుణంలో వలస అనేది నిరంతరము జరిగే ప్రక్రియగా మనం భావించవచ్చు.గత చరిత్రను పరిశీలిన చేస్తే కారణం ఏదైనా వలస అనేది సాధారణము అనే విషయం మనకు అర్థమవుతుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో స్వస్థలాల నుంచి వేరేచోటికి తరలివెళ్లే వారి సంఖ్య 45.5 కోట్లు. ఇది క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం ప్రతి సంవత్సరం దాదాపు కోటి 40 లక్షల మంది ఒక చోటు నుండి మరో చోటుకు వలస వెలుచున్నారని లెక్కలు తెలుపుతున్నాయి. 1979లో అంతర్రాష్ట్ర వలస కార్మిక చట్టం వచ్చింది. వేతనాలు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, పని పరిస్థితులు మెరుగుపరచడం, శ్రమ దోపిడీని నిరోధించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. చట్టం ఉన్నప్పటికీ అమలు అనేది పగడ్బంది గా జరగాలి కదా.

ప్రపంచవ్యాప్తంగా 130కి పైగా దేశాలలో మూడు కోట్ల మంది ప్రవాస భారతీయులు, భారత సంతతి ప్రజలు నివసిస్తున్నారని ఒక అంచనా. తెలంగాణ ప్రాంతం నుంచి 1970లో వలసలు ప్రారంభమయ్యాయి. అప్పుడే గల్ఫ్ దేశాల్లో పెట్రోల్ నిల్వలు బయటపడటంతో అక్కడ కూలీల అవసరం ఏర్పడింది. ఇక్కడ బతుకు దెరువులేని రైతులకు, వ్యవసాయ కూలీలకు అక్కడ మంచి అవకాశం దొరికింది. తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న కార్మికులు తమ కుటుంబాల ఆర్థికపరిస్తితి మెరుగయ్యేలా చూస్తున్నారు.కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల జైలు పాలవుచున్న వారిని అదుకోవడములో ఇంకా ముందుండాలి. ప్రమాదవశాత్తు మరణించిన వలసదారుని మృత దేహం సొంత గ్రామానికి చేర్చడం అనేది ఇప్పుడు కష్టంగా ఉంది. కుటుంబాన్ని వదిలి పొట్టకూటి కోసం వెళ్లిన వలస కార్మికులకు అక్కడి ప్రభుత్వాలు మరియు ఇక్కడి ప్రభుత్వాలు అండగా ఉండి జరగరాని ఘోరం ఏదైనా జరిగితే వెంటనే తగు చర్యలు తీసుకొని లబ్ధి చేయవలసిన భాధ్యత ఇరు దేశాల ప్రభుత్వాలపై ఉంది.

ఒకప్పుడు ఒక గ్రామం నుండి మరొక గ్రామమునకి మాత్రమే వలస వెళ్ళేవారు. కానీ నేడు గ్రామాలను దాటి ఒక జిల్లా నుండి మరొక జిల్లాకు, ఒక రాష్ట్రం నుండి మరొక రాష్ట్రం నకు వలస పోవడం అనేది సర్వసాధారణం అయిందని మనం చూస్తున్నాము. ఇప్పటి అత్యాధునిక కంప్యూటర్ యుగంలో కూడా ఒక దేశం నుండి మరో దేశానికి వలస వెళ్లడం అనేది అతి సాధారణం అయిపోయింది. ఒకప్పుడు ప్రవాసులుగా ఉండడం అనేది ఒక హోదాగా భావించేవారు. ఇప్పుడున్న పరిస్థితులలో విదేశాలు వెళ్ళిరావడం అనేది పక్క ఊరికి వెళ్లినంత సులభం అయింది.ఈ మధ్య చదువుల కోసం అని కొందరు,కొలువుల కోసం అని మరికొందరు విదేశాల్లో స్థిర నివాసం ఏర్పరచుకుంటున్నారు. కొన్ని దేశాల చట్టాలు కూడా వలస కార్మికులకు బాసటగా నిలవడం వల్ల ఇతర దేశాలకు వెళ్లడం సులభం అయింది. ఐక్యరాజ్య సమితి 1990 వ సంవత్సరం డిసెంబర్ 18 వ తేదీ నాడు "అంతర్జాతీయ వలస దారుల హక్కులను" పరిరక్షించడానికి ఒక ఒడంబడికను చేకూర్చింది. తరువాత వివిధ తీర్మానాల తరువాత 2000 సంవత్సరంలో నుండి ఈ ఈ రోజుని "అంతర్జాతీయ వలసదారుల దినంగా" జరపడం ఆనవాయితీగా మారింది.విదేశాల్లో గత ఇరవై సంవత్సరాలుగా ముఖ్యంగా కంప్యూటర్ రంగంలో భారతీయులకు ఎక్కువ అవకాశాలు అందుచున్న విషయాన్ని గుర్తించిన యువత ఆ వైపుగా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తూ ఇతర దేశాలలో స్థిరపడి మరికొందరిని అక్కడికి రప్పించుకుంటున్నారు.మొదట్లో వైద్య, విద్యా, పరిశోధనా రంగాల్లోని నిష్ణాతులు మాత్రమే వలసవెళ్ళేవారు. కానీ తదనంతరం ప్రారంభమైన కంప్యూటర్ రంగ అభివృద్ధి, కంప్యూటర్ నిపుణలతో వలసలు ఎన్నో రెట్లు పెరిగింది. దానితో పాటు ఆదాయం పెరిగింది.ప్రవాసులుగా వెళ్లినవారి ఇప్పుడిప్పుడే వ్యాపారరంగం లో రాణిస్తున్నారు. రాజకీయ రంగములో కూడా కొంతమంది అడుగుపెట్టి విజయాలు సాధించిన సందర్భాన్ని మనం గుర్తించ వచ్చు. తమ ఉనికిని కాపాడుకుంటూ,మాతృదేశం పై మమకారం చూపుతూ మరెందరికో సహకారాన్ని అందిస్తున్న....

ఏ దేశమేగినా ఎందుకాలిడిన పొగడరా నీ తల్లి భూమి భారతిని......అనే మాటను నిజం చేయాల్సిన బాధ్యత కుడా ప్రవాసుల మీదవుంది.



- గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమఉపాధ్యాయ అవార్డ్ గ్రహీత.
9963499282

## కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీటీసీ



**విశ్వంభర, రామన్నపేట:** సిరిపురం గ్రామ మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిశారు.

## సామాజిక తనిఖీ నిర్వహణ నిమిత్తం సమావేశం



**విశ్వంభర, ఆత్మకూరు:** మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహణ నిమిత్తం సామాజిక తనిఖీ బృందం, ఉపాధి హామీ పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, గ్రామాల ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పనులలో ఖర్చు చేసిన 3కోట్ల 36 లక్షల పనులకు సంబంధించిన రికార్డు తనిఖీ బృందానికి ఇవ్వడం జరిగింది అని అన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి ఎంపీవో ఏ లోకేశ్వర్ రెడ్డి, ఏపీఓ బి రమేష్, ఈసీ ఎస్ శ్రీనివాస్, సామాజిక తనిఖీ ఎస్ ఆర్ పీ గంగరాజు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, తనిఖీ బృందం, ఏఫ్ఏలు పాల్గొన్నారు.

## అయ్యప్ప సన్నిధిలో అన్నదానం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** మండల కేంద్రంలో మంగళవారం రోజు ముస్లిం సోదరులు అయ్యప్ప స్వాములకు అయ్యప్ప సన్నిధిలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు రమేష్, పాండు, ప్రశాంత్, అనిల్, వెంకన్న, అంజయ్య, తదితర స్వాములు, ముస్లిం సోదరులు అజీమ్, అఫ్జల్, జమాల్, జాంగిర్, షానూర్, అజ్జు, వసీం, షానూర్, అబ్బాస పాల్గొన్నారు.

## తెగిన కాల్వకు మరమ్మతు చేయాలి



**విశ్వంభర, నెల్లికుదురు:** మానుకోట జిల్లాలోని మదనతుర్తి, మునిగలవీడు, కౌసల్యదేవిపల్లి, బొజ్జన్న పేట గ్రామాలకు సాగునీరు అందించే తెగిన తుమ్మల బంధం కాలువకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు గునిగంటి రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సర్వే మంగళవారం మదనతుర్తి, బంజర, లక్ష్మీపురం గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలువను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 4 ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు గ్రామ రైతులు కె. జనార్ధన్ యాకయ్య, సోమయ్య, లచ్చయ్య, ఉప్పలయ్య పాల్గొన్నారు.

## జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ. 40 వేల విరాళం



**విశ్వంభర, కడ్తాల్:** సలార్ పూర్ గ్రామంలో సేవాలాల్, జగదాంబ ఆలయానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 40 వేల రూపాయల విరాళాన్ని అందించింది. ఆలయ ప్రాంగణంలో మంచినీటి సౌకర్యం కోసం బోర్ మోటార్, పంప్ సెట్ లను ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకొని ట్రస్ట్ మంచినీటి సౌకర్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ విరాళాన్ని అందించింది. దైవభక్తితో ఏ పని చేసినా అందులో విజయం సాధిస్తామని ట్రస్ట్ చైర్మన్ అన్నారు. అనంతరం గ్రామానికి చెందిన నేనావత్ చంద్రు మరణించారని తెలుసుకొని కుటుంబానికి 5 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలీ పంతు, మాజీ ఎంపీటీసీలు ప్రియా రమేష్, సాయిలు, నాయకులు బాబా, ప్రకాష్, పకీర, చందు జగన్, గోపాల్, మల్లేష్, రాజు, హైదర్, శ్రీశైలం, శ్రీను, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

**ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి**



**విశ్వంభర , హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని అదేవిధంగా జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేయాలని లకిడికపూల్ లో కలెక్టర్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీం అక్తర్ కు మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ రాష్ట్రం లో కొంతమందికి వర్గీకరణ జరిగితే ఎక్కడ తమ ఉనికి కోల్పోతామో అని, వర్గీకరణ సమస్య ఇలాగే కొనసాగాలని ఆకాంక్షించే వారు రాష్ట్రంలో ఉన్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ ఫలాలు అందాలని అందుకు జిల్లాలను యూనిట్ గా తీసుకోవాలని అన్నారు. ఉమ్మడి మహబూబ్నగర్, కరీంనగర్, వరంగల్ , రంగారెడ్డి లో మాదిగలు అధిక సంఖ్యలో ఉన్నారని వారికి జనాభాకు తగిన విధంగా వర్గీకరణ ఫలాలు అందించి న్యాయం చేయాలని అన్నారు. మూడు దశాబ్దాల మాదిగ ఉద్యమంలో అనేక కీలక మలుపులు తిరిగాయని ఇప్పుడు రాష్ట్రం విడిపోయాక మాదిగలు తెలంగాణ రాష్ట్రంలో మెజారిటీ కులంగా, అతిపెద్ద కులంగా ఉన్నారని అన్నారు. మాదిగలు జనాభా దామాషా ప్రకారం విద్యా,ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నంద్రు నరసింహా రావు మాదిగ, బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, బోమ్మెర స్టాలిన్, శివ మాదుగుల తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రామచంద్ర సీత సమేత కళ్యాణ మహోత్సవం

**పాల్గొన్న భారతినగర్ డివిజన్**

**కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**



**విశ్వంభర, సంగారెడ్డి :** శ్రీ సీతా సమేత శ్రీ రామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మార్గశిర మాసం పునర్వసు నక్షత్రం సందర్భంగా భేల్ ఎంఐజీ కాలనీలోగల శ్రీ రామాలయంలో పట్టాభిరాముని పరిణయ వేడుక వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి దంపతులు కల్యాణ వేడుకల్లో పాల్గొని స్వామి వారికి పరిణయ వేడుకను వైభవంగా నిర్వహించారు. దేవాలయంలో గల మూలమూర్తులకు పూజలు నిర్వహించి అనంతరం దేవాలయం ప్రాంగణంలో గల కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉత్సవమూర్తులకు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పరిణయాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ భేల్ ఎంఐజి రామాలయం ప్రతి నెల పునర్వసు నక్షత్రం రోజున శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించడం అభినందనీయమన్నారు . దేవాలయ అధ్యక్షుడు భీమ్ రెడ్డి కమిటీ సభ్యులు శ్రీనివాస్, సత్యనారాయణ, హనుంజయ, టి.వి రావు, సంపత్ గౌడ్, రాకేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెల్లుల్ల ఎల్లమ్మ దేవాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత

ఎండోమెంట్ అధికారులు, గ్రామస్తుల వాగ్వాదం



**విశ్వంభర, మెట్ పల్లి:** మెట్ పల్లి మండలం వెల్లుల్ల ఎల్లమ్మ దేవాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. గత మంగళవారం ఎల్లమ్మ దేవాలయాన్ని ఎండోమెంట్ అధికారులు స్వాధీనపరుచుకున్న విషయం తెలిసిందే. ఎల్లమ్మ దేవాలయాన్ని ఎండోమెంట్లో కల్పవద్దని వెల్లుల్ల గ్రామ ప్రజలు గత వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు ర్యాలీలు ధర్నా రాస్తారోకోలు నిర్వహిస్తున్నారు . అయితే నేడు మంగళవారం కావున దేవాలయానికి అధిక సంఖ్యలో భక్తులు రానుండగా ఎండోమెంట్ డిపార్ట్మెంట్ కు సంబంధించిన ఏవో కాంత రెడ్డి విధుల్లో భాగంగా నేడు ఎల్లమ్మ ఆలయం వద్దకు సిబ్బందితో వచ్చారు. గ్రామస్తులు భారీ సంఖ్యలో ఎండోమెంట్ సిబ్బందిని అడ్డుకునే ప్రయత్నం చేసి ఎండోమెంట్ ఆధీనంలో ఉన్న ఎల్లమ్మ ఆలయాన్ని తిరిగి గ్రామస్తుల ఆధీనంలో నడిపించుటకు ఆర్డర్లు తీసుకొస్తామని అప్పటివరకు దేవాదాయ శాఖ ఎల్లమ్మ దేవస్థానం పరిధిలోకి రావద్దని ఏవో కాంతారెడ్డి కోరారు. దానికి ఏవో మాట్లాడుతూ మీరు సరైన పత్రాలు ఎండోమెంట్ అధికారులచే ఆర్డర్లు తీసుకురావాలని లేనిపక్షంలో మా విధులకు ఆటంకం కలిగించవద్దని గ్రామస్తులతో పేర్కొన్నారు విషయం తెలుసుకున్న సీఐ నిరంజన్ రెడ్డి ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. గ్రామ విడిసి సభ్యులు వెల్లుల్ల గ్రామంలో గల 40 మందిరాలు ఉన్నవి ఎల్లమ్మ దేవాలయం తో పాటు 40 దేవాలయాల లో జరుగు నిత్య పూజలకు గ్రామ వీడీసీ ద్వారా నిధులు చేకూరుస్తామని ఎల్లమ్మ దేవాలయం తో పాటు గ్రామంలో గల 40 దేవాలయాలను ఎండోమెంట్ ఆధీనంలోకి తీసుకోవాలని లేదా ఎల్లమ్మ దేవాలయాన్ని వీడీసీకి అప్పగించాలని గ్రామస్తులు విడిసి సభ్యులు కోరారు.

# బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం



**విశ్వంభర, ఆత్మకూరు:** సింగారం గ్రామంలో మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి బీఆర్ఎస్ పార్టీ మండల శ్రేణులు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గ్రామంలో పచ్చని పంట పొలాలను చూసి కళ్లు మండిన రేవంత్ రెడ్డి సర్కార్ ఫార్మాసిటీ పేరుతో భూములను లాక్కోవాలని చూస్తే లగచర్ల గ్రామం చైతన్యవంతమైన రైతులు తిరగబడినందుకు రైతులపై అక్రమంగా కేసులు పెట్టారన్నారు. అలాగే వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించడం దారుణమన్నారు. రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలను మానుకొని ఇకనైనా రేవంత్ రెడ్డి సర్కార్ కి బుద్ధి ప్రసాదించాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు బీసు చందర్ గౌడ్ మాట్లాడుతూ లగచర్ల రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేసి, రేవంత్ రెడ్డి సర్కార్ ని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ పల్లెర్ల సత్యనారాయణ, సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేష్ గౌడ్, మాజీ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాష బోయిన ఉప్పలయ్య యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయండి

**గుగులోతు సూర్య ప్రకాష్ ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్**



**విశ్వంభర, మహబూబాబాద్:** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలను జయప్రదం చేయాలని మహబూబాబాద్ జిల్లా పెద్ద గూడూరు మండల కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కో కన్వీనర్ గుగులోతు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ ఈనెల 26, 27 తేదీలలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్వహిస్తున్నామన్నారు. సమావేశాలను విద్యార్థి లోకమంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై సమరసిల పోరాటాల పై భవిష్యత్తు కార్యచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పేరుతో కొనసాగిస్తున్న కాంగ్రెస్ పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని, ఫుడ్ పాయిజన్లు ఘటన తో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. అదేవిధంగా పెండింగ్ లో ఉన్న 8000 కోట్ల రూపాయల స్కాలర్ షిప్ విడుదల చేయకుండా జాతీయ చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు భూక్యా రాజేష్,మండల నాయకులు సందీప్, చిన్న, అశోక్, వినయ్, చరణ్, రేవంత్, ప్రణయ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# నల్ల దుస్తులతో అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు

**విశ్వంభర, మహబూబాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నల్ల రంగు దుస్తులు ధరించి అసెంబ్లీకి హాజరయ్యారు. లగచర్ల రైతులకు సంఘీభావంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలికి నల్లచొక్కాలతో వచ్చి లగచర్ల రైతులను జైలు నుంచి వెంటనే విడుదల చేయాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం లగచర్ల రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



## సీఎం కప్ 2024 క్రీడలు ప్రారంభం




**విశ్వంభర, వరంగల్:** జేఎన్ఎస్ స్టేడియంలో హనుమకొండ జిల్లా స్థాయి సిఎం కప్ 2024 క్రీడా పోటీలను వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి కలిసి ప్రారంభించారు. దాదాపుగా 300 మంది విద్యార్థులు క్రీడా పోటీలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించటానికి రాష్ట్ర ప్రభుత్వం సిఎం కప్ క్రీడా పోటీలను నిర్వహిస్తోందని, పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటాలని కోరారు. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి సిఎం కప్ పోటీల్లో ప్రతిభ చాటి, విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హనుమకొండ డిఎస్వో అశోక్, సిపి అంబర్ కిశోర్ ఝా, కలెక్టర్ సత్య శారదా దేవి, అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, గ్రంధాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వరద రాజేశ్వర్ రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## మానుకోట అభివృద్ధికి నిధులు కేటాయించండి

**ఎమ్మెల్యే డా.భూక్యా మురళీ నాయక్**



**విశ్వంభర, మహబూబాబాద్:** గిరిజన జిల్లా మానుకోట అభివృద్ధి కి ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే డా. మురళీ నాయక్ ప్రభుత్వాన్నీ కోరారు.అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో ఇనుగుర్తి గ్రామాన్ని మండలం చేస్తామని బీఆర్ ఎస్ కాలయాపన చేసి, రాజకీయ లబ్ది పొందారని, గ్రామ ప్రజల పోరాటం ఫలితంగా మండల ప్రకటన చేశారని అన్నారు. కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం మూలంగా ఇనుగుర్తి మండల కేంద్రం అభివృద్ధి కి ఆమడ దూరంలో ఉందన్నారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించి ,ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలన్నారు. గూడూరు మండలం లో బస్టాండ్ ఏర్పాటు కృషి చేయాలని కోరారు.

## జ్యోతిష్య శాస్త్రంలో ఉత్తీర్ణులైన తిప్పర్తి వెంకటేశ్వర్లుకు సర్టిఫికెట్ ప్రదానం



**విశ్వంభర, మెట్ పల్లి:** పట్టణానికి చెందిన తిప్పర్తి వెంకటేశ్వర్లు ఎమ్ ఏ జ్యోతిష్యంలో ఉత్తీర్ణులైన సందర్భంగా జేకేఆర్ ఆస్ట్రో రీసర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోజున విజయవాడలో జరిగిన మహా మెగా జ్యోతిష్య సమ్మేళన కాన్ఫరెన్స్ సెమినార్ కార్యక్రమంలో ఎమ్ ఏ జ్యోతిష్య సర్టిఫికెట్ యూనివర్సిటీ ఛాన్సలర్, ప్రొఫెసర్ రాజా చేతుల మీదుగా అందుకున్నారు. జ్యోతిష్యంలో ఉత్తీర్ణులైన 30 మంది సభ్యులకు సర్టిఫికెట్ ప్రధానోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో జెకెఆర్ ఆస్ట్రో రిసర్చ్ ఫౌండేషన్ యూనివర్సిటీ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలలో ఉత్తీర్ణులైన 30 మంది జ్యోతిష సభ్యులకు ఎమ్ ఏ జ్యోతిష్య సర్టిఫికెట్ లు యూనివర్సిటీ ఛాన్స లర్ జేకే ఆర్ రాజా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు, సభ్యులు జ్యోతిష్య నిపుణులు, మేధావులు మరియు 500 మంది సభ్యులు పాల్గొన్నారు.

## బీఎస్పీ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్‌గా జనగాం కేశవరావు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** బహుజన సమాజ్ పార్టీ భద్రాచలం నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్‌గా జనగాం కేశవరావు నియామకం అయ్యారు. సమాజానికి, సమాచారాన్ని చేరవేయడంలో సోషల్ మీడియా ప్రస్తుతం ఛాంపియన్ గా ఉంది. సోషల్ మీడియా ద్వారా బహుజన వాదం భద్రాద్రి గడ్డ మొత్తం వ్యాప్తి చేస్తామని అన్నారు. బహుజన రాజ్యాధికారం దిశగా రాజకీయాలను అభివృద్ధి చేస్తామని, బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్‌గా జనగాం కేశవరావు స్పష్టం చేశారు.

## అంబుజా సిమెంట్ కంపెనీని రద్దు చేయాలని వినతి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో జరుగుతున్న సిపిఎం మూడవ జిల్లా మహాసభల సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు రామన్నపేట-కొమ్మాయిగూడెం పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేయబోయే అంబుజా సిమెంటు కంపెనీని రద్దు చేసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ, సిపిఎం రామన్నపేట మండల ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మేక అశోక్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్యలు మాట్లాడుతూ.. ప్రజలకు హాని కలిగించే కాలుష్య పరిశ్రమను ఏర్పాటు చేయకుండా సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాలలోనే అంబుజా సిమెంట్ పరిశ్రమపై చర్చ జరిపి రామన్నపేటలో నిర్మించే సిమెంట్ పరిశ్రమను రద్దు చేయాలని, ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. లగచర్లలో ప్రజల నిరసనతో అక్కడ ఏర్పాటు చేయబోయే ఫ్యాక్టరీని రద్దు చేయించిన విధంగా రామన్నపేట మండల ప్రజల అభిప్రాయం మేరకు అంబుజా సిమెంట్ పరిశ్రమను రద్దు చేసే విధంగా చూడాలని, ప్రభుత్వానికి విన్నవించాలని వినతిపత్రం అందించారు.

# డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని పట్టా సర్టిఫికెట్లు లాక్కున్నారు!

- ఇళ్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని బాధితులు ఆవేదన
- అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్
- మహబూబ్‌నగర్ నుంచి బాధితులు ప్రజావాణిలో ఫిర్యాదు




**విశ్వంభర, హైదరాబాద్:** గతంలో రాష్ట్ర ప్రభుత్వం 2012 లో 523 సర్వే నెంబర్లలో ప్రభుత్వం పట్టాలి ఇచ్చి 2018లో డబల్ బెడ్ రూములు ఇస్తామని ఇంటి పట్టాల సర్టిఫికెట్ లను స్వాధీన పరచుకొని అర్హులుగా ప్రకటించిన 586 మందికి తక్షణమే డబల్ బెడ్ రూములు, ఇందిరమ్మ ఇల్లు కేటాయించి ఇల్లు నిర్మాణం చేసి ఇవ్వాలని కోరుతూ ప్రజావాణి తెలంగాణ ప్రజా భవనంలో మహబూబ్ నగర్ అర్బన్ కు చెందిన ఇంటి పట్టా లబ్ధిదారులు ఫిర్యాదు చేసారు. గత కొంత కాలంగా మమ్ముల్ని ఇబ్బంది పెడుతూ మాకు ఇంటి స్థలాలు కేటాయించకపోవడం దారుణం అని ఆవేదన వ్యక్త చేసారు. అవినీతి అక్రమాలకు పాల్పడిన అధికారులపై నాయకులపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులకు న్యాయం చేయాలని, పేదలను ఆదుకోవాలని ప్రజావాణిలో ఉన్నతాధికారులకు తెలిపారు. అప్పటి కలెక్టర్ రోనాల్డ్ రోస్ ఆదేశాల మేరకు పట్టాలుప్రభుత్వానికి స్వాధీన పరచాలని సందేశాలు ఇచ్చారు. స్వాధీన పరిచిన వారికి డబల్ బెడ్ రూమ్స్ ఇస్తామని అవ్వడంతో అధికారుల మాటలు నమ్మి 2018 లో అనేక మంది పట్టా స్థలాల సర్టిఫికెట్లను అందజేసామని తెలిపారు. పట్టాలు స్వాదేనం చేసిన వారిని విచారణ జరిపి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందుటకు అర్హులుగా 886 మందిని నిర్ధారిస్తూ జాబితా విడుదల చేసారు. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వంలో కొంతమంది అవినీతి, అక్రమాలకు పాల్పడి మాకు ఇల్లు రాకుండా చేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టా సర్టిఫికెట్లు ప్రభుత్వానికి స్వాధీనపరిచి నివాస స్థలం కోల్పోయిన పేదలు దీనంగా న్యాయం కోసం అర్థిస్తున్నారు. బీఆర్ ఎస్ పాలనలో తమకు అన్యాయం జంగిందని . కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఆశలు పెట్టుకున్నామని తెలిపారు. సంవత్సరం కాలం గడిచిన , ఆశలు లేనందున లబ్ధిదారులు కాస్త బాధితులుగా మారమని అన్నారు. మహబూబ్ నగర్ అర్బన్ మండల పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి కలదని, కావున మహబూబ్ నగర్ అర్బన్ మండల పరిధిలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిలో అర్బన్ , టౌన్ పరిధిలోని అర్హులందరికీ న్యాయం చేయాలనీ కోరుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపడుతున్న ప్రజా భవన్ లో ప్రజా వాణి లో మా గోడు వెల్లబోసుకుంటున్నామని అని బాధితులు ఆవేదన వ్యక్తం చేసారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ప్రజావాణి అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి శ్రీనివాస రావు , ఎం.డి ఖలీల్ , చైతన్య మహిళా సంఘం జిల్లా నాయకులు శ్రీదేవి, విజయ్ కుమార్, జలాల్ పాషా బి కృష్ణయ్య ఎండి బషీర్ లలిత, మాధవి, లక్ష్మమ్మ , ఆరిఫా భేగం , లక్ష్మి, యాదమ్మ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## లగచర్ల రైతులపై అక్రమ కేసులను ఎత్తివేయాలి

మాజీ జెడ్పిటిసి అనురాధ పత్యానాయక్



**విశ్వంభర, ఆమనగల్లు :** పట్టణంలో మున్సిపల్, మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ మాట్లాడుతూ లగచర్ల రైతులను మోసం చేసి భూములు తీసుకొని పైగా అక్రమంగా రైతులపై కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించడం అన్యాయమని, పెద్ద నేరం చేసినట్టు రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ పాలన అంతమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఇటువంటి అమానవీయ, అణిచివేత విధానాలకు స్వస్తి పలకాలని తెలిపారు.

## తుక్కుగూడలో అంబేద్కర్ విగ్రహానికి వినతి



**విశ్వంభర, మహేశ్వరం:** తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షులు జిల్లెల లక్ష్మయ్య ఆధ్వర్యంలో తుక్కుగూడ న్యూ బస్ స్టాప్ చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కి పూలమాల వేసి తెలంగాణ రాష్ట్ర రైతన్నలపై జరుగుతున్న అరాచకాలను అణిచివేతలను నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరాచకాల నుండి రైతన్నలను వెంటనే విడుదల చేసి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షులు, మహిళ అధ్యక్షురాలు, యూత్ అధ్యక్షులు, బీఆర్ఎస్ కౌన్సిలర్స్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చలో రాజభవన్‌ను విజయవంతం చేయండి



**విశ్వంభర, భూపాలపల్లి:** అమెరికాలో గౌతమ్ ఆదానీపై వచ్చిన ఆరోపణలు అలాగే మణిపూర్ లో జరిగిన అల్లర్లు ఇలాంటి అంశాలపై ఏఐసీసీ పిలుపు మేరకు చలో రాజ్ భవన్ ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల అధ్యక్షుడు ఆకుతోట కుమారస్వామి పార్టీ శ్రేణులను కోరారు. మంగళవారం ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద భారీ జన సమీకరణతో రాజభవన్ వరకు ప్రదర్శనగా చలో రాజభవన్ కార్యక్రమం నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రివర్యులు బట్టి విక్రమార్క, ఎఐసిసి ఇన్చార్జ్ దీపాదాస్ మున్షి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నందున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆకుతోట కుమారస్వామి కోరారు.

## షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



**విశ్వంభర, అంబర్పేట్ :** ప్రేమ్ నగర్ గ్రీన్ ల్యాండ్ హెూటల్ సమీపంలోని పంచర్ దుకాణంలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ సంభవించి దుకాణం మొత్తం కాలిపోయింది. ఈ సంఘటనలో షాపులోని ట్యూబ్స్ టైర్లు మొత్తం కాలిపోయాయి. అంబర్పేట పటేల్ నగర్ లో నివాసముండే మహమ్మద్ సందాని ప్రేమ్ నగర్ గ్రీన్ ల్యాండ్ హెూటల్ సమీపంలో ట్యూబ్లు టైర్ల పంచర్ షాప్ నిర్వహిస్తున్నాడు పంచర్ షాప్ తో పాటు ఆయన ప్రైవేటుగా పెట్రోల్ డీజిల్ కూడా అమ్ముతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో షాపులో షార్ట్ సర్క్యూట్ సంభవించింది పెట్రోలు డీజిల్ ఉండడంతో వెంటనే మంటలు అంటుకొని షాప్ మొత్తం దగ్ధమైంది సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆపేశారు. అప్పటికే షాప్ మొత్తం దగ్ధమైంది. ఈ కార్యక్రమంలో స్థానిక బస్తీ ప్రజలు బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జాఫర్, బిజెపి డివిజన్ అధ్యక్షుడు నాగభూషణం చారి, నాయకులు యూసుఫ్ బాబా, జమీల్,సంతోష్ చారి పాల్గొన్నారు.

## 'హలో మాదిగ - ఛలో హైదరాబాద్' కరపత్రం ఆవిష్కరణ



**విశ్వంభర, ఎల్బీ నగర్:** ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య నాయకత్వంలో రంగారెడ్డి జిల్లా ఎల్బీ నగర్ నియోజకవర్గం లో మహనీయులవిగ్రహాల దగ్గర జనవరి 19-2025న జరిగే 'హలో మాదిగ – ఛలో హైదరాబాద్' రంగారెడ్డి జిల్లా కరపత్రాన్ని ఎల్బీ నగర్ అధ్యక్షులు పంతం ఉపేందర్ అధ్వర్యంలో విడుదల చేశారు. ఈ 'హలో మాదిగ – ఛలో హైదరాబాద్' కార్యక్రమానికి ఎల్బీ నగర్ నియోజకవర్గం నుండి మాదిగ, మాదిగ ఉప కులాలు అధిక సంఖ్యలో పాల్గొని ఎస్సీ లను ఏబీసీడీ లు గా విభజన చట్టం అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జీడీ నర్సిమ్మ జాతీయ ప్రధాన కార్యదర్శి, సంగపాక ఏసోఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్, సుగుణమ్మ రాష్ట మహిళా నాయకురాలు, అంజమ్మ, యాదమ్మ, పోషమ్మ, డి నర్సిమ్మ ,రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి సంపత్, రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ రామస్వామి రాష్ట్ర సహాయ కార్యదర్శి సైదులు, ఎల్బీ నగర్ ప్రధాన కార్యదర్శి జిల్లా ముత్యాలు ఈ రవి ఎల్బీ నగర్ సహాయ కార్యదర్శి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుబీమా డబ్బులు తన ఖాతాలో వేసుకున్న ఏఈఓ



**విశ్వంభర, మహబూబాబాద్:** మరణించిన రైతు కుటుంబానికి రైతు బీమా నగదును అందించాల్సిన ఏఈఓ బాధిత కుటుంబ నిరక్షరాస్యతను ఆసరా చేసుకొని డబ్బులు కాజేసిన సంఘటన మహబూబాబాద్ జిల్లాకు రవి మండలం గుండ్రాతిమడుగు గేటు తండాలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రాతిమడుగు గేటుతండాకు చెందిన గిరిజన రైతు ఈ ఏడాది జూన్ 9న మృతి చెందాడు. నామినీగా ఉన్న ఆయన భార్య బానోత్ ఇరానీ స్థానికుల సహాయంతో రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకున్నారు. అక్టోబర్ 10న బీమా సొమ్ము ఐదులక్షల రూపాయలు ఇరానీ ఖాతాలో జమయ్యాయి. కానీ ఆ..విషయం ఆమెకు తెలియలేదు. ఇరానీ నిరక్షురాస్యురాలు కావడంతో... ఆమె నిరక్షరాస్యతను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఏఈఓ బానోత్ కళ్యాణ్ కొన్ని సంతకాలు చేస్తే నగదు వెంటనే చేతికి వస్తాయని నమ్మించి చెక్కుపై సంతకం చేయించుకున్నాడు. అక్టోబర్ 19న ఇరానీ ఖాతాలో ఉన్న ఐదులక్షల రూపాయలను తన ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. నెల తర్వాత ఇరానీ గుండ్రాతిమడుగులోని బ్యాంకుకు వెళ్లి ఆరాతీయగా ఆమె ఖాతాలోని నగదు ఏఈఓ కళ్యాణ్ ఖాతాకు బదిలీ అయిందని అధికారులు తెలిపారు. దీనిపై ఏఈఓ కళ్యాణ్ ను బాదితులు ప్రశ్నించగా వారం రోజుల్లో డబ్బులు తీసుకోండంటు ఓ..చెక్కు ఇచ్చాడు. కానీ ఆ చెక్కు కూడా బౌన్స్ అయింది. దీంతో దిక్కుతోచని బాధితురాలు ఇరానీ లబోదిబోమంటూ కురవి పోలీసులను ఆశ్రయించారు.

## పలిమెల తహసీల్దార్‌పై వేటు

**విశ్వంభర, భూపాలపల్లి:** జిల్లాలో పలిమెల మండల తహసీల్దార్‌పై వేటుపడింది. పలిమెల తహసీల్దార్ సయ్యద్ సర్వర్ 102 ఎకరాల భూమి డెక్కన్ సిమెంట్‌కు రిజిస్ట్రేషన్ చేయడంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు రావడంతో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ విచారణ చేపట్టారు. శనివారం విచారణ చేపట్టి నివేదికను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మకు అందజేశారు. దీంతో జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ సీసీ యల్ ఏకు సమాచారం అందించారు.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ట్రాఫిక్ సిఐ వెంకటేశ్వర్లు



**విశ్వంభర, ఎల్బీనగర్:** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఎల్ బి నగర్ ట్రాఫిక్ సి.ఐ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కొత్తపేట సిగ్నల్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బుల్లెట్ బైక్ సైలెన్స్ మార్చి జాతీయ రహదారిపై వాహన దారులను భయబ్రాంతులకు గురి చేయడమే కాకుండా, ధ్వని కాలుష్యం చేస్తూ ప్రమాదకరంగా బైక్ నడిపి పట్టుబడిన రెండు బుల్లెట్ బైక్ లకు జరిమానా విధించినట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు, అక్కడికక్కడే మెకానిక్ సాయంతో మార్పిడి చేసి సైలెన్స్ ర్ లను స్వాధీనం చేసుకున్నట్లు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు సి.ఐ, నాగరాజు, యస్.ఐ. రవి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేద మహిళకు అండగా జయశంకర్ ఫౌండేషన్



**విశ్వంభర, భూపాలపల్లి:** కమలాపూర్ గ్రామంలోని మంజునాయక్ తండాకి చెందిన బానోత్ చందన భర్త దేవేందర్ వీరికి ఇద్దరు చిన్నపిల్లలు, వీరిది నిరుపేద కుటుంబం కావడంతో కొంత భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. వ్యవసాయంలో నష్టం రావడంతో అలాగే అప్పు ఇచ్చినవారు కూడా ఇబ్బంది పెట్టడంతో ఇవన్నీ భరించలేక బానోత్ చందన గడ్డి మందు తాగడంతో చావు బతుకుల్లో ఉన్న ఆమెను హాస్పిటల్ తీసుకెళ్లారు. ఆమె వైద్యానికి కూడా డబ్బులు లేని పరిస్థితి రావడంతో వారి కుటుంబం దాతల సహకారం కోరగా విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

## గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు




**విశ్వంభర, భూపాలపల్లి:** చిట్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో అందిస్తున్న వసతులు, విద్యార్థుల ఆహార మెనూ, వంట గది, స్టోర్ రూం, డైనింగ్ హాల్‌లను, విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనంను పరిశీలించి, కామన్ డైట్ మెనూని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల నుంచి భోజన నాణ్యతపై ఫీడ్‌బ్యాక్ తీసుకుని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెనూ పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఇటీవల ప్రభుత్వం డైట్ చార్జీ లు పెంచిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకటే కామన్ డైట్ అమలు చేస్తుందని, రోజు వారి అందించే డైట్ వివరాలు ఫ్లెక్సీ ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువు అత్యంత ప్రాధాన్యమైనవని తెలిపారు. పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో కొంత స్థలం కాలిగా ఉందని అందులో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయని చదును చేయించాలని ప్రిన్సిపల్ కోరగా చదును చేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ తనిఖీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త



**విశ్వంభర, నాగోల్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త అన్నారు. మంగళవారం కొత్తపేట యువ చైతన్య యువజన సంఘం భవనం వద్ద ఎమ్మెల్సీ నిధుల తో వేసిన బోర్ కు అమార్చిన నూతన మోటర్ ను దయానంద్ గుప్త ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలలోని కమునిటీ హాల్స్, పార్క్ లు తదితర ప్రాంతాల్లో బోర్లు వేయించడం జరిగిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారం కోసం ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం అధ్యక్షులు ఎ ఆర్ గుప్త , మేకల సత్యనారాయణ, కొమ్ము బాబు, సామలేటి రమేష్, మొరు సురేష్, శ్రీనివాస్, కంతం బాబు, కంతం మహేందర్, మోర్ రాంబాబు, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

## బోదాసు మహేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



విశ్వంభర, కడ్తాల్ : కడ్తాల్ మండల పరిధిలోని న్యామతాపూర్ గ్రామంలో కలాం ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్ట్, మరియు యశోద హాస్పిటల్స్ వారి సహకారంతో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. యశోద హాస్పిటల్ వారి సహకారంతో గ్రామస్థులు 225 మంది వైద్య పరీక్షలు చేయించుకుని తగిన మందులు తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అమనగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట నర్సింహా ముదిరాజ్, కడ్తల్ మండల్ అధ్యక్షులు బిచ్య నాయక్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి, భాను పాల్గొన్నారు.

## సిమెంట్ కంపెనీలో వాటాల కోసం రైతుల భూములు అన్యాక్రాంతం

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**విశ్వంభర, భూపాలపల్లి :** మంత్రి శ్రీధర్‌బాబు తన తమ్ముడు శ్రీనుబాబుకు దక్కన్ సిమెంట్ కంపనీలో వాటాల కోసం మారుమూల పలిమెల రైతుల భూములను అన్యాక్రాంతం చేస్తున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మంగళవారం పలిమెల మండలంలోని బాధిత రైతుల భూములను సందర్శించిన ఆయన అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత రైతులతో కలిసి మాట్లాడారు. పలిమెల మండలంలోని బోడాయిగూడెం, పంకెన, పలిమెలకు సంబంధించిన సుమారు 300 మంది రైతులు తాత తండ్రుల నుండి కాస్తులో ఉండి పంటలు పండించుకుంటూ జీవనం సాగిస్తున్న భూములు శ్రీధర్‌బాబు అనుచరులైన వనం రాంచందర్‌రావు, చొప్పరి సదానందం, రొడ్డ బాపు, బండారి సదానందం, బొల్లెపల్లి వెంకటస్వామిగౌడ్, తాటి గోపాల్‌గౌడ్, పులి రాజేశం, తుల్సెగారి తిరుపతి పటేల్, పున్నం మధూకర్‌రెడ్డి, చల్ల జక్కిరెడ్డితో పాటు మరికొంత మంది పేరిట 2008లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శ్రీధర్‌బాబు విప్‌గా ఉన్న సమయంలో 300 ఎకరాల వరకు మహ్మద్ కమాలుద్దీన్ అనే వ్యక్తి ద్వారా మంథని లో రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆయన తెలిపారు.

# లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలి

**విశ్వంభర, ఎల్బీనగర్:** తమ భూమిని స్వాధీనం చేసుకుంటే బతకడం కష్టం అవుతుందని అన్న పాపానికి అరెస్టు చేసిన లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్టీఆర్ నగర్ లోని అంబేద్కర్ విగ్రహానికి ఆర్కే పురం డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తుందన్నారు. బలవంతంగా భూమి లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఓసారి ఫార్మా విలేజ్ అని, మరోసారి ఇండస్ట్రియల్ కారిడార్ని మాయ మటలు చెబుతూ భూములను తన అల్లుడికి అప్పజెప్పేందుకు కుట్ర చేస్తున్నారని అన్నారు. తమ జీవన ఆధారమైన భూమిని లాక్కోవద్దని 10 నెలలుగా విజ్ఞప్తి చేసిన పట్టించుకోకుండా నిరంకుశంగా, పాషవికంగా రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకాలు చేస్తుందన్నారు. రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి రైతన్న చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ అమానవీయ అణచివేత విధానాలకు నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు.

### లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలి

**విశ్వంభర, మహేశ్వరం :** మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే సబితా రెడ్డి ఆదేశాల మేరకు అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రైతన్నలపై జరుగుతున్న అరాచకాలను, అణిచివేతల నుంచి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరాచకాల నుంచి లగచర్ల రైతన్నలను కాపాడాలని భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తోంది. అన్నిటికంటే ముఖ్యంగా దళిత గిరిజనులు ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యల వల్ల తీవ్రంగా అణిచివేతకు గురవుతున్నారు. పేద దళిత గిరిజన రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా లాక్కొని వారిని రోడ్డున పడేసే కుట్ర చేస్తోంది. ఈ కాంగ్రెస్ సర్కార్ రాజ్యాంగ వ్యతిరేకంగా అడుగడుగునా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలని, మీరు బుద్ధి చెప్పాలని కోరుకుంటున్నామన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో పేద రైతన్నల భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఓసారి ఫార్మా విలేజ్ అని, మరోసారి ఇండస్ట్రియల్ కారిడార్ అని, మాయమాటలు చెప్తూ ఏదోలాగా రైతన్నల భూములను లాక్కొని ఆదానికి, తన అల్లుడికి అప్పజెప్పాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని తెలిపారు.

### లగచర్ల రైతాంగాన్ని జైలు నుంచి విడుదల చేయాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల చేతులకు బేడీలు వేయ్యడం అత్యంత దుర్మార్గమని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి దౌర్జన్యాలు మంచివి కావని బీఆర్ఎస్ పార్టీ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, మాజీ జడ్పిటిసి జోరుక సదయ్యలు కాంగ్రెస్



ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున వినతిపత్రం సమర్పించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై..అన్యాయంగా, అక్రమంగా కేసులు పెట్టి, జైల్లో పెట్టడం అత్యంత దారుణమని వారు ఆవేదనను వ్యక్తం చేశారు. ఫార్మాసిటీ పేరిట రైతుల భూములను లాక్కోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించిందని, రైతులు తిరగబడే సరికి అక్రమంగా వాళ్లపై కేసులు బనాయించి, రైతుల చేతులకు బేడీలు వేసి, మానసికంగా చిత్రహింసలకు గురిచేస్తుందని ఆరోపించారు.

### దేశానికి అన్నం పెట్టే రైతన్నలను అరెస్టు చేయడం సిగ్గుచేటు

**విశ్వంభర, భూపాలపల్లి :** లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి, జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలు..రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వమని, దేశానికి అన్నం పెట్టే రైతన్నలను అరెస్టు చేయడం సిగ్గుచేటని, రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. మా భూములు ఇవ్వబోమన్న రైతులను అరెస్టు చేశారని, రైతులకు బేడీలు వేయడం అమానుష చర్యగా అభివర్ణించారు.

### అన్నం పెట్టే రైతులను జైల్లో పెట్టిన చరిత్ర రేవంత్ సర్కార్‌దే

**విశ్వంభర, భూపాలపల్లి :** దేశానికి అన్నం పెట్టే రైతులను జైల్లో పెట్టిన చరిత్ర రేవంత్ సర్కార్‌కే దక్కుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు లగచర్ల రైతులను రేవంత్ సర్కార్ నుంచి కాపాడాలని, రేవంత్ సర్కార్‌కు కనువిప్పు కల్గిగేలా చూడాలని కోరుతూ మంథని పట్టణంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఆయన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గొప్పగా రచించిన బారత రాజ్యాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అపహస్యం చేస్తోందని ఆయన విమర్శించారు. రైతును రాజుగా చూసే ఈ దేశంలో రాష్ట్రంలో 35 రోజులుగా బెయిల్ రాకుండా ఏదో సాకు పెడుతూ రైతులను జైల్లోపెట్టించారని, రైతుల చేతులకు బేడీలు వేసి చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### రైతులకు బేడీలు సిగ్గుచేటు

**విశ్వంభర, భూపాలపల్లి:** రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం లగచర్ల రైతులపై చేస్తున్న అరాచకాల నుండి కాపాడాలని మాజీ మంత్రి, బీఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి ఆదేశానుసారం భూపాలపల్లి పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ ఆధ్వర్యంలో బీఆర్ ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, జాగృతి నాయకులు కలిసి భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి లగచర్ల రైతులను కాపాడాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిశ్రమల నెపంతో రైతుల నుండి బలవంతంగా భూములను లాక్కోవాలని చూసిన వారిపై రైతులు తిరగబడితే వారిని అరెస్ట్ చేయడం, అన్నం పెట్టె రైతన్న గుండెపోటుకు గురైతే ఆసుపత్రికీ ఒక దేశద్రోహిలా, ఉగ్రవాదుల మాదిరి చేతులకు బేడీలు వేసి తీసుకురావడం రేవంత్ రెడ్డి దుర్మార్గపు పాలనకు నిదర్శనం అని అన్నారు.

### రేవంత్ సర్కార్ లగచర్ల రైతులను విడిచిపెట్టండి

**విశ్వంభర, కడ్తాల్ :** కడ్తాల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప కే.టి.ఆర్ పిలుపు మేరకు లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, అణిచివేత విధానాలకు నిరసనగా. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించారు . ఈ సందర్భంగా











మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతు భరోసా కాదు కదా రైతులకే భరోసా లేదని మండిపడ్డారు.

**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** లగచర్ల రైతులను భేడీలు వేసి నిర్బంధానికి గురి చేయడం దారుణం దానిని నిరసిస్తూ అంబేద్కర్ విగ్రహానికి మంచాల మండల పార్టీ అధ్యక్షుడు చీరాల రమేష్ ,మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఏర్పుల చంద్రయ్య,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కాట్రోత్ బహదూర్ నాయక్, జిల్లా నాయకులు నర్సింగ్ వెంకటేష్,మాజీ ఎంపీపీ మంకు ఇంద్ర ఎంపీటీసీ అనిత , మాజీ సర్పంచ్ జగన్ రెడ్డి నాయకులు వనపర్తి బద్రి నాద్ ,విజయ్ కుమార్ ,జెంబులా కిషన్ రెడ్డి లు వినతి పత్రాన్ని అందజేశారు.

### లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలి


విశ్వంభర, మహేశ్వరం : మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే సబితా రెడ్డి ఆదేశాల మేరకు అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రైతన్నలపై జరుగుతున్న అరాచకాలను, అణిచివేతల నుంచి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అరాచకాల నుంచి లగచర్ల రైతన్నలను కాపాడాలని భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా రాజ్యాంగాన్ని కాలరాస్తోంది. అన్నిటికంటే ముఖ్యంగా దళిత గిరిజనులు ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యల వల్ల తీవ్రంగా అణిచివేతకు గురవుతున్నారు. పేద దళిత గిరిజన రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను బలవంతంగా లాక్కొని వారిని రోడ్డున పడేసే కుట్ర చేస్తోంది. ఈ కాంగ్రెస్ సర్కార్ రాజ్యాంగ వ్యతిరేకంగా అడుగడుగునా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలని, మీరు బుద్ధి చెప్పాలని కోరుకుంటున్నామన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో పేద రైతన్నల భూములను బలవంతంగా లాక్కునేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఓసారి ఫార్మా విలేజ్ అని, మరోసారి ఇండస్ట్రియల్ కారిడార్ అని, మాయమాటలు చెప్తూ ఏదోలాగా రైతన్నల భూములను లాక్కొని ఆదానికి, తన అల్లుడికి అప్పజెప్పాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర చేస్తున్నారని తెలిపారు.


## బిజెఆర్ భవన్‌లో పెన్షనర్స్ డే వేడుకలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** కొత్తపేటలోనీ బాబు జగన్జీవన్ రాం భవనంలో పెన్షనర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం గవర్నమెంట్ పెన్షనర్స్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు మద్ది శివారెడ్డి ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే వేడుకలకు జేడీవో వసుందర, ఏపీపిఓ మలక్పేట్ నయీముద్దీన్ లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వము వెంటనే పరిష్కరించాలని కోరారు. పెండింగ్లో ఉన్న నాలుగు డిఏలు, పి ఆర్ సి ని వెంటనే అమలు చేయాలన్నారు. హెల్త్ కార్డును కార్పొరేట్ ఆస్పత్రిలో కూడా చెల్లుబాటు అయ్యేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 85 ఏళ్లు నిండిన 33 మంది పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుబాకర్ రావు, వైస్ ప్రెసిడెంట్ వినయ్ కుమార్, ట్రెజరర్ యాదగిరి గౌడ్, సభ్యులు దామోదర్, పూర్ణచంద్రరావు, నరసింహారావు ,పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు స్వీకరణ



**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫార్మసీ మహిళా కళాశాల మహబూబాబాద్ నందు బి. ఫార్మసీ బోధనాంశములలో ఫార్మస్యూటిక్స్ (1), ఫార్మకాలజి (1), ఫార్మకెమిస్ట్రీ (1) 2024-25 విద్యా సంవత్సరమునకు గాను అతిథి అధ్యాపకులుగా పనిచేయుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవని, అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు బి. పార్మసీ, యం. ఫార్మసీ మరియు సర్వీస్ సర్టిఫికేట్స్ జిరాక్స్ ప్రతుల్ని తేది. 21 సాయంత్రం 4 గంటల లోపు కళాశాల కార్యాలయంలో సమర్పించగలరని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. ఎం. స్వప్న రెడ్డి నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

## పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

**విశ్వంభర, ఇనుగుర్తి:** మండలంలోని అయ్యగారి పల్లిలో పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ పంచాయితీ కార్యదర్శి బొమ్మెర వాణి తెలిపారు. గ్రామంలో 227 ఇండ్లకు దరఖాస్తు చేసినట్లు ఇందిరమ్మ యాప్ ద్వారా సమాచారం ఉందని ఈ మేరకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం నాటి సర్వేలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు మామిడి జనార్ధన్, సూర్య నాయక్, మెట్టు రాజు, మార్క సూరయ్య, మద్దికుంట వెంకన్న పాల్గొని పరిశీలించినట్లు చెప్పారు.



## చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రభంజనం



విశ్వంభర, మహబూబాబాద్ : రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థి బృందాలు ప్రభంజనం సృష్టించాయి. ప్రభుత్వ పాఠశాలల ఇంగ్లీష్ మీడియం విభాగంలో మన జిల్లాలోని పెద్ద వంగర మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిట్యాల విద్యార్థి బృందం ఏకంగా మొదటి స్థానంలో నిలిచి, మహబూబాబాద్ జిల్లాకే వన్నె తెచ్చారు. అలాగే , రెసిడెన్షియల్ పాఠశాలల విభాగంలో యం.జె.పి.టి.బి.సి.డబ్ల్యు.ఆర్.ఎస్ బాలుర విద్యార్థుల బృందం, దంతాలపల్లి 5వ స్థానంలో నిలిచారు. గత మూడు రోజులుగా, అంటే ఈ నెల 14, 15, 16 తేదీలలో, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సాంకేతిక విద్యా కళాశాల కేంద్రంగా ఈ పోటీలు విజయవంతంగా ముగిశాయి. పద్మశ్రీ అవార్డు గ్రహీత, డాక్టర్ దాసరి ప్రసాద్ 14వ తేదీన ప్రారంభించగా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, రాజర్షిషా 16వ తేదీన బహుమతి ప్రధానోత్సవం చేశారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట ధరణి పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట ఆర్.డి.ఓ. కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్ డీ ఓ కార్యాలయంలోని ఎలక్షన్ సెల్ ని పరిశీలించి సిబ్బంది కి ఫారం - 6,7,8 లపై పలు సూచనలు చేశారు. అలాగే రికార్డ్ గదిని పరిశీలించారు.సిబ్బంది అందరు సమయపాలన పాటించాలని,ధరణి పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. తదుపరి కేంద్రీయ విద్యాలయ కేంద్రం సూర్యాపేటలో ఏర్పాటు చేయుట కొరకు తాత్కాలిక బిల్డింగ్ ని ఎస్ వీ డిగ్రీ కళాశాల నందు కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సఖీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సఖీ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు ఎన్ని గృహహింస కి గురైన మహిళలకి సంబందించిన కేస్ లు నమోదు అయినాయి, ఎంత మందికి న్యాయ సలహాలు అందించారో సిబ్బంది ద్వారా తెలుసుకొని రిజిస్టర్ ని పరిశీలించారు.హెల్ప్ లైన్ నెంబర్ 181ద్వారా ఇప్పటి వరకు 1062 కాల్స్ రాగా 197 కేస్ లు నమోదు చేయటం జరిగిందని,148 కేస్ లు పరిష్కరించామని



మిగిలిన 49 కేసులు వివిధ దశలలో విచారణ చేయటం జరుగుతుందని తెలిపారు. అలాగే సఖీ కేంద్రం ద్వారా 1288 కేస్ లు నమోదు అవ్వగా 981 కేసులు పరిష్కరించటం జరిగిందని 307 కేసు లు వివిధ దశలలో విచారణలో ఉన్నాయని తెలిపారు. సఖీ కేంద్రానికి వివిధ కారణాలతో వచ్చే మహిళలకి స్కిల్ సెంటర్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆర్ డీ ఓ వేణు మాధవ్, ఎస్ వీ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేష్ లు, సఖీ కేంద్రం పరిపాలన అధికారి శైలజ, కేస్ వర్కర్ సుజాత, పారామెడికల్ సిబ్బంది మానస, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలకు పాల్పడిన ఆరుగురు భారతీయులు

### మయన్మార్ నుంచి స్వదేశానికి రప్పించిన విదేశాంగ శాఖ

**విశ్వంభర, బషీర్ బాగ్ :** ఆగ్నేయాసియాలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నమ్మించి సైబర్ మోసాలకు పాల్పడిన ఆరుగురు భారతీయులను మయన్మార్ నుంచి స్వదేశానికి రప్పించారు. తాజా ఆపరేషన్ తో 2024 జూలై నుంచి మయన్మార్ నుంచి రక్షించిన భారతీయుల సంఖ్య 101కి చేరిందని మయన్మార్లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. రాయబార కార్యాలయం తన హెచ్చరిక సలహాను పునరుద్ఘాటించింది: మిషన్లను సంప్రదించకుండా ఈ ప్రాంతంలో ఉద్యోగ ఆఫర్లకు వ్యతిరేకంగా మా సలహాను మేము పునరుద్ఘాటిస్తున్నాము. మయన్మార్, కంబోడియా, థాయ్ లాండ్ లలో నకిలీ ఉద్యోగాలకు సంబంధించిన సైబర్ మోసాలు పెరిగాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ), మయన్మార్ లోని భారత రాయబార కార్యాలయం హెచ్చరికలు జారీ చేశాయి.



## సీఎం క్రీడల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**విశ్వంభర, మహబూబాబాద్ :** సీఎం క్రీడల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు నిర్వహించాలన్నారు జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు)లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కే.వీర బ్రహ్మాచారి, డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతి రావు, సంబంధిత అధికారులతో కలిసి సీఎం కప్ క్రీడల నిర్వహణపై సమావేశం నిర్వహించారు.



## ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కోట చలం పట్టణంలోని ఎస్కే సలీం ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఫస్ట్ ఎయిడ్ సెంటర్లో నిబంధనలను ఉల్లంఘించి వైద్యం చేయరాదని, ప్రధమ చికిత్స సెంటర్లో ప్రధమ చికిత్స మాత్రమే నిర్వహించాలని, ప్రధమ చికిత్స నిర్వహకులు తమ పరిధిని మించి వైద్యం ఇతర పరీక్షలు నిర్వహించరాదని, ఒకవేళ పరిమితిని మించి వైద్యం చేసినచో శాఖలోని చట్టం పరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. నిబంధనలను ఉల్లగించినట్లయితే ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను మూసివేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, డా. జయ మనోహరి, ఎస్ఓ వీరయ్య, ఏఎస్ఓ మత్స్యగిరి, వైద్య సిబ్బంది పాల్గొనారు.



## షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

**రూ. 40 లక్షలు ఆస్తి నష్టం**

**విశ్వంభర, ఎల్బీనగర్ :** షార్ట్ సర్క్యూట్ తో ఇంట్లో మంటలు చెలరేగి దాదాపు రూ .40 లక్షల వరకు ఆస్తి దగ్ధమైనట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే ఆర్కేపురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలోని ఖిల్లా మైసమ్మ దేవాలయం వెనుక భాగం లో గల రోహిణి విల్లా -1 లో పై అంతస్తులు మంటలు అంటుకొని రెండు రూములో గల ఫర్నిచర్, టీవీ పూర్తిగా దగ్ధమైంది. డా. రాజీవ్ రెడ్డి, డా.శ్రీనిధి లు గమనించి వెంటనే నాగోల్ ఫైర్ స్టేషన్ కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది వచ్చి మంటల్ని ఆరిపారు. ఎలాంటి ప్రాణాష్టమైతే జరగలేదు.

## సమస్యలు పరిష్కరించకుంటే బోర్డు కార్యాలయం ముట్టడి

**విశ్వంభర, హైదరాబాద్:** వాటర్‌వర్క్స్ లో పనీ చేసే ఔట్ సోర్సింగ్ కార్మికుల గత జిఓ మార్చిన సందర్భంగా మిగిలిపోయిన వారందరిని కేటగిరి మార్చి జీవితాలు పెంచాలని మరియూ ఇతర సమస్యలు పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షుడు నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. నేడు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశం బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది .ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతు వాటర్‌వర్క్స్ లో పనీ చేసే ఔట్ సోర్సింగ్ కార్మికులు చాలీ, చాలనీ వేతనాలు 13,500/-లతో హైదరాబాద్ నగరంలో బ్రతకడం చాలా కష్టం కనుకనే గత 2023 ఆగస్టు లో జిఓ 60 ధ్వారా వేతనాలు పెంచిన సందర్భంగా కేతగిరి 2 లో చేర్చాల్సిన కార్మికులను కేటగిరి 1 లో చేర్చడం ద్వారా ప్రతి కార్మికునికి నెలకు 4000/- నష్టపోతున్నారు.కనుక అధికారుల తప్పిధాన్ని సరిదిద్ది కేటగిరి మార్చి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు.

## ఉచిత వైద్య శిబిరం

**విశ్వంభర, కడ్తాల్:** చరికొండ గ్రామంలో ఉప్పల చారిట్రబుల్ ట్రస్ట్ మరియు జర్పుల రాధకృష్ణ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేశారు. డా ఉప్పల అఖిల్ సమక్షంలో 312 మంది వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి జబ్బులుకు మందులు పంపిణీ చేశారు . వైద్య శిబిరంలో ఉప్పల వెంకటేష్ ,దశరథ్ నాయక్ పరిశీలించి గ్రామస్థులకు, వృద్ధులకు, యువకులకు, మహిళకు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసిలు ఉప్పల వెంకటేష్ , జర్పుల దశరథ్ నాయక్, నాయకులు జోగు విరయ్య, లాల్కోట నర్సింహ్మ, కోటేశ్, నరేష్, ప్రశాంత్, శంకరయ్య శ్రీశైలం, వగ్గ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల డైరీ ఆవిష్కరణ

**విశ్వంభర, హైదరాబాద్ :** పెన్షనర్ల దినోత్సవం సందర్భంగా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్, తెలంగాణా వారు ట్రెజరీస్ డైరెక్టర్ కే ఎస్ ఆర్ మూర్తిచే డైరీ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాబోయే సంవత్సరం పిఆర్సి సంవత్సరమని, ఈ సంవత్సరం కరువు భత్యం వాయిదాలన్నీ ఆశాభావం వ్యక్త పరచారు. ఈ కార్యక్రమం లో సంఘ రాష్ట అధ్యక్షుడు ఏ రాజేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి ఎం వి నర్సింగ రావు, ఆర్థిక కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యక్షులు దేశపాండే, అబ్రహం, హైదరాబాద్ జిల్లా సంఘ కార్యదర్శి సూర్యనారాయణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బాల మల్లేష్, రాష్ట్ర కార్యదర్శులు అంజయ్య, యాదయ్య, ఆనందగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పాడే మోసిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**విశ్వంభర, తలకొండపల్లి :** వెల్జాల్ గ్రామంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్ యాదవ్ తండ్రి, మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్ వియ్యంకుడు జంగయ్య యాదవ్ మరణించారు. కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్ యాదవ్, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎద్మ సత్యం, జడ్పిటిసిలు ఉప్పల వెంకటేష్, దశరథ నాయక్, అనురాధపత్య నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు డొకోరి ప్రభాకర్ రెడ్డి, వివిధ పార్టీల రాజకీయ ప్రముఖులు ఆయన మృతి దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, కుటుంబానికి అండగా ఉంటామని తెలియజేశారు ఈ సందర్భంగా గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే పాడె మోసి విచారాన్ని వ్యక్తం చేశారు.

## జాతీయ స్థాయి పోటీలకు నాగోల్ పాఠశాల విద్యార్థులు



**విశ్వంభర, నాగోల్ :** ప్రో కబడ్డీ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీలకు ఆడేందుకు నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళ వారం పూణె కు బయలుదేరారు. ప్రో కబడ్డీ జూనియర్స్ కోసం ప్రత్యేకంగా పంపిన వాహనం లో విద్యార్థులు శంషాబాద్ విమానాశ్రయంకు బయలుదేరారు. ప్రో కబడ్డీ జూనియర్స్ విద్యార్థులు, కొచ్ శంకర్ నాయక్ లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ దేవి , ఉపాధ్యాయుల బృందం, నాగోల్ జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఖన్నా గౌడ్, ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, చంద్రశేఖర్ ఆజాద్, నాల్ల ఉమామహేశ్వర్ గుప్త, ఉమాపతి పాల్గొన్నారు.

## విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య

**విశ్వంభర, హయత్ నగర్:** విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్ నగర్ లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే హయత్ నగర్ లోని ఓ రెసిడెన్షియల్ స్కూల్లో ఏడవ తరగతి విద్యార్థి లోహిత్కష్య రెడ్డి రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి స్వస్థలం వనపర్తి జిల్లా ఫిజిక్స్ ఉపాధ్యాయుడు క్లాస్ రూమ్ లో క్లాస్ లీడర్ తో కొట్టించడం ఉపాధ్యాయుడు వేధింపులు చేయడం వల్లనే విద్యార్థి మృతి చెందాడని బంధువులు ఆరోపిస్తున్నారు. విద్యార్థి మృతి చెందిన విషయం పోలీసు వారు చెప్తే కానీ తెలియలేదని ఇప్పటికి కూడా స్కూల్ యాజమాన్యం ఏం జరిగిందో చెప్పట్లేదని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించండి



**విశ్వంభర, సూర్యాపేట:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలంటూ బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్ రెడ్డి ఆదేశాలతో సూర్యాపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు మంగళవారం స్థానిక ఖమ్మం క్రాస్ రోడ్ లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఛైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ గ్రంధాలయ అధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ లగచర్ల గిరిజన రైతులపై అక్రమ కేసులు బనాయించి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, మంత్రులు విలాసవంతమైన టూర్లలో ఊరేగుతున్నారని విమర్శించారు. లగచర్ల గిరిజన రైతుల భూములను లాక్కుంటుంటే ఇదేమిటని భూములు మీకిస్తే మేమెట్ల బతకాలి అన్నందుకు వారిపై కేసులు నమోదు చేసి బెయిల్ రాకుండా కోర్టులో అడ్డుకుంటున్నారని అన్నారు. గత మూడు నెలలుగా గిరిజన రైతులను చిత్రహింసలకు గురి చేస్తూ, హీర్యానాయక్ అనే రైతుకు చాతినొప్పి వస్తే బేడీలతో ఆసుపత్రికి తీసుకెళ్ళిన ప్రభుత్వ చెష్టలను ప్రజలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. లగచర్ల గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీష్ రావు, జగదీష్ రెడ్డిలు వెంటపడి నిలదీస్తారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి గిరిజనులపై పెట్టిన కేసులు ఎత్తి వేసేలా జ్ఞానోదయం కలిగించాలని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, పట్టణ పార్టీ అధ్యక్షులు సవరాల సత్యనారాయణ, ఆత్మకూర్.ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తూడి నర్సింహ్మారావు, బత్తుల రమేష్, కొణతం సత్యనారాయణరెడ్డి, ముద్దం కృష్ణారెడ్డి, ముదిరెడ్డి అనిల్ రెడ్డి, చింతలపాటి మధు, వీరస్వామి, కిషనానాయక్, శ్రీనివాస్ రెడ్డి, ఈదుల యాదగిరి, షకీల్, మీనయ్య తదితరులు ఉన్నారు.

## వీధి నాటకాలు పునరుజ్జీవం పొందేలా ప్రోత్సాహం అందిద్దాం

**ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్**



**విశ్వంభర, మహబూబ్ నగర్:** గత వారం రోజులుగా అంగరంగ వైభవంగా కొనసాగుతున్న బలభీమాంజానేయ స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహ్మదాబాద్ మండలం చౌదరిపల్లి గ్రామంలో దేవాలయ ప్రాంగణంలో సంపూర్ణ రామాయణం నాటక ప్రదర్శన ఏర్పాటు చేసారు. ఈ నాటక ప్రదర్శనకు విచ్చేసి, కుటుంబ సమేతంగా నాటక ప్రదర్శనను తిలకించిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్- సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ వీధి నాటకాలు పునరుజ్జీవం పొందాలని, రోజురోజుకు అంతరిస్తున్న వీధి నాటకాలకు కొందరు కళాకారులు జీవం పోస్తున్నారని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా నాటకాలు ఉంటుండటంతో చాలా మంది వాటిని చూసేందుకు ఆసక్తి చూపుతున్నారని, నేటి తరానికి చరిత్రను గుర్తు చేస్తూ,ఆనాటి ఆచారాలు సంప్రదాయాలను తెలియజేసేల వీధి నాటకాలను అందరం ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



**విశ్వంభర, మహేశ్వరం :** తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు భాగంగా మహేశ్వరం మండలంలో గడికోటలోని జడ్.పి.హెచ్.ఎస్ హై స్కూల్ ఆవరణలో సీఎం క ప్ టోర్నమెంటును మహేశ్వరం ఎం.పీ.డీ.వో శైలజ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి హాజరై ఆయన మాట్లాడుతూ. గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను ప్రపంచ స్థాయికి వెలికితీసేందుకే సీఎం కప్- టోర్నమెంట్ అని అన్నారు. ఈ కార్యక్రమమానికి టెంటు భోజన ఏర్పాట్లకు సహకరించిన మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ , ఒత్తుల రఘుపతి సహకరించారు .ఈ కార్యక్రమంలో రాఘవేందర్ రెడ్డి, పల్లె బిక్షపతి, మాజీ ఎంపీటీసీ సుదర్శన్ యాదవ్ , మల్లేష్ యాదవ్ , నరసింహ, చేపంగి ప్రవీణ్, సాంబయ్య, శ్రీనివాస్ ఎంఈఓ ఉపాధ్యాయులు అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి



**విశ్వంభర, యాదాద్రి భువనగిరి జిల్లా :** మోటకొండూరు మండలం చందేపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు 25వేల ఆర్థిక సహాయం రాగిరి రితిష్ అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల బోధనను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ఆయన తండ్రి రాగిరి సంజీవ స్మారకార్థం ప్రైవేటు ఉపాధ్యాయురాలి నియామకం కోసం ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. చదువుకు ఏవి ఆటంకం కావని, మనసుపెట్టి విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థాయిలో ఉండవచ్చని అన్నారు. భవిష్యత్తులో ప్రాథమిక పాఠశాల అవసరాల కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీపతి నరేందర్, ఉపాధ్యాయురాలు మదూరి విజయ, మను శ్రీ, పాఠశాల యాజమాన్య కమిటీ మాజీ చైర్మన్ బొట్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ క్రీడాకారులకు టీషర్ట్స్ పంపిణీ



**విశ్వంభర, హనుమకొండ :** జయభేరి, హన్మకొండ లో అటికం ఫౌండేషన్ చైర్మన్, హసన్ పర్తి కబడ్డీ అసోసియేషన్ జోనల్ చైర్మన్ అటికం రవీందర్ ఆధ్వర్యంలో పరకాలలో జరుగుతున్న సిఎం కప్ క్రీడలలో పాల్గొన్న కబడ్డీ క్రీడాకారులైన బాల బాలికలకు అటికం ఫౌండేషన్ తరుపున చైర్మన్ రవీందర్ టీ షర్ట్స్ అందజేశారు. ఈ క్రీడా పోటీలలో హసన్ పర్తి జోనల్ టీం ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సీనియర్ కబడ్డీ ప్లేయర్ చెట్లపల్లి లింగమూర్తి, నేతాజీ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు గద్దం రమేష్, సంగాల విక్టరీబాబు, కొండపాలకల దేవరరాజ్, గుంజ సాయికుమార్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## కాకతీ కదనభేరి పోస్టర్ ఆవిష్కరణ

**విశ్వంభర, ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రం జడ్పీహెచ్ఎస్, బాలికల గురుకులం, తహసీల్దార్ ఉద్యోగులు ఆయా కార్యాలయాల ఎదుట మంగళవారం కాకతీకదన భేరి పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరుతూ ఈనెల 22న వరంగల్ ఇస్లామియా గ్రౌండ్లో జరిగే భారీ సభకు తరలి రావాలని ఉద్యోగ బాధ్యతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి, ఎంఈఓ రూపా రాణి, నాగమణి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్, భాస్కర్, శంకర్, వినయ్, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్‌తో కార్తీక్



బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్‌ని హైదరాబాద్ కార్యాలయంలో మంగళవారం యునైటెడ్ కింగ్ డమ్ లండన్ కార్పొరేటర్ కార్తీక్ బొంకూర్ మర్యాదపూర్వకంగా కలిశారు. సమావేశంలో రాయబార కార్యాలయం యొక్క పనితీరు, దాని ప్రజా ప్రయోజన కార్యక్రమాలు, వాణిజ్య సంబంధాలు మరియు విద్యార్థుల అవకాశాల గురించి చర్చించారు. మన దేశాల మధ్య బలమైన ద్వైపాక్షిక సంబంధాలకు, నిరంతర సహకారం అందించేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు.

**- విశ్వంభర, హైదరాబాద్**

## వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** మండల పరిధిలోని బూరుగుపల్లి కోటమ్మ తల్లి దేవాలయ ఆలయ ప్రాంగణంలో లోని లక్ష్మణ్ కిషోర్ కన్నె స్వాములు అయ్యప్ప స్వామి పడిపూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పడినీ అరటి బెరడులతో వివిధ రకాల పూలతో విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. 18 మెట్లపై ప్రత్యేకంగా అలంకరణలు చేసి జ్యోతులను వెలిగించారు. గురు స్వామి రామచంద్ర చారి ఆధ్వర్యంలో స్వామివారికి మహా పడిపూజ పుష్ప గంధం భస్మాభి పంచామృతాభి అభిషేకాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంతో ఆ ప్రాంతం పరిసరాలు మొత్తం అయ్యప్ప స్వామి శరణు ఘోషతో మారు మోగింది. స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు భజనలు కీర్తనలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సహోదరుడు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## ఆలేరు రెవెన్యూ డివిజన్, రఘునాథపురం మండలంపై అసెంబ్లీలో ప్రస్తావన



**విశ్వంభర, యాదాద్రి భువనగిరి జిల్లా :** ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అసెంబ్లీలో మాట్లాడుతూ ఆలేరు మండలాన్ని రెవెన్యూ డివిజన్ గా , రాజపేట మండలంలోని రఘునాథపురం గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని బీర్ల ఐలయ్య అసెంబ్లీ లో ప్రస్తావించారు. దీంతో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి కలెక్టర్ తో సమాచారం సేకరించిన అనంతరం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. బీర్ల ఐలయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రెవెన్యూ డివిజన్ ల ఏర్పాటు శాస్త్రీయంగా జరగలేదన్నారు. జనాభా,విస్తీర్ణం,పరిపాలన సౌలభ్యం ప్రాతిపదికన రెవెన్యూ డివిజన్ ల ఏర్పాటు జరగలేదన్నారు. ఎలక్షన్లను దృష్టిలో పెట్టుకొని కొత్త డివిజన్లు, కొత్త మండలాలు ఏర్పాటు చేసింది, కానీ రైతుల, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేయలేదన్నారు. రాష్ట్రంలో చాల చోట్ల రెవెన్యూకు సంబంధించిన అనేక భూ సమస్యలు పెరిగాయని, అనేకం అపరిష్కృతంగా ఉండడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అందుకే ప్రభుత్వం కొత్త రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూన్నారన్నారు.

## లగచర్ల రైతులను విడుదల చేయాలని వినతి

**విశ్వంభర, మీర్ పేట్ :** మున్సిపల్ కార్పొరేషన్ బి.ఆర్.యస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లెలగూడ అంబేద్కర్ చౌరస్తాలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి కేటిఆర్ పిలుపు మేరకు మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం శాసనసభ్యురాలు పట్లొల్ల సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ,అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా... రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వినతి పత్రం అందజేశారు.

## లైంగిక హింసను వ్యతిరేకిద్దాం

**విశ్వంభర, వరంగల్:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం లో మహిళలకు భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ లో పోలీస్ డిపార్ట్మెంట్ నుండి షి టీం భరోసా కేంద్రం నుండి వచ్చేసిన సిబ్బంది ఆశా కార్యకర్తలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గోపి సిఐ మట్టెవాడ మాట్లాడుతూ షీ టీం లక్ష్యాలు వరంగల్ జిల్లాలో సక్రమంగా నిర్వహిస్తున్నామని ఎవరైనా 18 సంవత్సరాల పైబడిన స్త్రీలకు ఉద్యోగంలో, వ్యాపారంలో, గృహములో, వివిధ సందడి కార్యక్రమాల్లో ఎలాంటి అరాస్మెంట్ జరిగినా వారిపైన చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నేటి వరకు 250 మంది కేసులను పెట్టినామని తెలిపినారు. స్త్రీలు వరంగల్ బిడ్డలు కాబట్టి ధైర్యంగా ప్రతి సమస్యను మా ముందుకు తీసుకువస్తే వారి పేరు ఎవరికి తెలువకుండా తప్పు చేసిన వారికి శిక్షలు విధిస్తామని తెలిపినారు. అనంతరం భరోసా సెంటర్ సపోర్టింగ్ స్టాప్ శ్రీమతి రజిత మాట్లాడుతూ ఉదయము 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సేవలందిస్తున్నామని పోక్స్ లైంగిక నేరాల నుండి పిల్లలను రక్షిస్తున్నామని పిల్లలకు వారి బంధుమిత్రుల నుండి సంభవించే ప్రమాదాలను తల్లిదండ్రులు నిర్భయంగా ముందుకు వచ్చి చెప్పినట్లయితే నిజ నిర్ధారణ తేలితే వారి పైన సెక్షన్ 161, 164 సి ఆర్ పి సి కింద వాంగ్మూలం నమోదు చేసి వారికి తగిన న్యాయం చేస్తున్నామని తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలి

**జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ కాసిం**

**విశ్వంభర, హైదరాబాద్ :** ఎస్సీ వర్గీకరణ-సుప్రీంకోర్టు తీర్పు-అమలు అంశంపై పి.డి.ఎస్.యూ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షోయబ్ హాల్ నందు పి.డి.ఎస్.యు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్ టేబుల్ కి ముఖ్య వక్తలుగా జస్టిస్ చంద్రకుమార్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం గారు పి.ఓ.డబ్ల్యు జాతీయ కాంగ్రెస్ సంధ్య , రైతు స్వరాజ వేదిక కనగంటి రవి హాజరై మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ అంశంపై పాలకవర్గాలు రెండు ప్రధానమైన సమూహాల మధ్య వైరుధ్యాన్ని పెంచి పోషించే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ అంటే మాదిగ,మాల సామాజిక వర్గాల సమస్యగా చూస్తున్నారని కానీ ఇది మిగిలిన 57 ఉపకులాల సమస్య అనే విషయాన్ని మరుస్తున్నారని తెలియజేశారు.

## జాతీయ విశ్రాంత ఉద్యోగుల దినోత్సవం



**విశ్వంభర, ఆమనగల్లు :** తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఆమనగల్లు శిశు మందిర్ పాఠశాలలో జాతీయ పెన్షనర్ల దినోత్సవము చాలా ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్ర మానికి ముఖ్య అతిదులుగా సీఐ ప్రమోద్ కుమార్ మండల విద్యా ధికారి పాండు నాయక్ తెలంగాణ విశ్రాంత పోలీసు సంఘం గౌరవ అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, సామాజిక సంఘ సేవకులు పాప శెట్టి రాము పాల్గోని పెన్షనర్ల హక్కులు వారి సంక్షేమాన్ని వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య విశ్రాంతి ఉద్యోగుల భవన స్థలము కేటాయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో 75 ఏళ్లు పైబడిన విశ్రాంత ఉద్యోగులు 25 మందికి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంగలి బాలకృష్ణ, పురుషోత్తం రెడ్డి, వల్లపు దాసు నారాయణ, జంగయ్య, విశ్రాంత ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ ప్రధాని దేశానికే సిగ్గుచేటు

**విశ్వంభర, న్యూఢిల్లీ :** దేశ వ్యాప్తంగా కులగణన కొరకు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ మంగళవారం డిల్లి లో గర్జించారు జంతర్ మంతర్ ధర్నా చౌక్ లో ఏర్పాటు చేసిన మహా ధర్నా లో ఆయన కేంద్ర ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు. 1931 నాటి నుండి బీసీ రిజర్వేషన్లు తగ్గించుకుంటూ వస్తున్నారని ఆయన అభివర్ణించారు రెండు శాతం అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించడం కేంద్ర ప్రభుత్వం దిక్కుమాలిన ఆలోచన అన్నారు . కేంద్ర ప్రభుత్వానికి హిందూ నినాదం తప్పా ప్రజల ప్రగతి కొరకు చేసింది ఏమీ లేదన్నారు. రాహుల్ గాంధీ కులం మతం తో మాకు సంబంధం లేదని నరేందర్ గౌడ్ అన్నారు. మాకు కావలసింది కులగనణ అన్నారు. అమెరికా లాంటి దేశాల్లో బెగ్గింగ్ చేస్తే జైలు శిక్షలంటాయని మన దేశం లో మూడు వందల కులాల జీవన వృత్తి అడుక్కోవడమని రికార్డుల్లో నమోదు చేశారని నరేందర్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

## డివైడర్‌ను ఢీకొన్న టవేరా వాహనం

**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ నుండి జడ్చర్ల వైపు వస్తున్న పట్టణానికి చెందిన టాక్సీ డ్రైవర్ విశ్వనాథ్ శెట్టి (55) తవేరా వాహనం నడిపుతూ పైగా ఫోన్ మాట్లాడుతూ, నిర్లక్ష్యంగా వాహనం నడిపిస్తూ రాయికల్ టోల్ ప్లాజా వద్దకు రాగానే అదుపుతప్పి తవేరా వాహనం డివైడర్ పై ఉన్న ఎలక్ట్రిక్ పోల్ ను ఢీకొన్నది. సంఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది.అయితే అక్కడే వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న స్థానిక ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్,ఎస్సై రవీందర్ నాయక్ వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి సాయం చేశారు. సీఐ చంద్రశేఖర్ ఎస్సై రవీందర్ నాయక్,సిబ్బంది ఎల్లాగౌడ్,మురళి దీపక్ సంతోష్ వాలంటీర్ నర్సింగ్ రాథోడ్,తదితరులు టాక్సీ డ్రైవర్ కు సహాయం చేసి ఆసుపత్రికి తరలించడంతో అక్కడ స్థానికులు పోలీసులను అభినందించారు.

# ప్రభుత్వ స్థలాలు కొనుగోలు చేసి మోసపోవద్దు

## కార్పొరేషన్ ప్రజలకు మేయర్ అజయ్ యాదవ్ విజ్ఞప్తి



**విశ్వంభర, బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబరు 63/26 నుండి 63/38 లలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని భవిష్యత్తులో ప్రజా అవసరాలకు అనుగుణంగా ఉపయోగించే ఉద్దేశం ఉన్నందున ఇట్టి స్థలంలో ఎవ్వరూ కూడా క్రయవిక్రయాలు చేయవద్దని బోడుప్పల్ కార్పొరేషన్ మనవి. ఈ మేరకు మంగళవారం నాడు కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబరు 63/26 నుండి 63/38 లలో బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్, కమీషనర్ జీ.రామలింగం, మేడిపల్లి తహసీల్దారు హసీనా లతో కలిసి ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా అక్రమార్కులు కబ్జాలు చేయకుండా ఉండే విధంగా తగు చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ స్థలాన్ని కార్పొరేషన్ మేయర్,కార్పొరేటర్లు,ప్రభుత్వ అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించారు.అనంతరం మేడిపల్లి తహసీల్దారు, మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమి కొంతమంది స్వార్థపరుల కారణంగా రోజు రోజుకు కుంచించుకు పోతుందని ఇలా అయితే భవిష్యత్తులో బోడుప్పల్ కార్పొరేషన్ ప్రజల అవసరాలకు భూమి లేకుండా పోతుందని దానిని దృష్టిలో ఉంచుకుని ఎవ్వరూ కూడా దళారుల మాటలు నమ్మి ప్రభుత్వ భూమిలో ఏలాంటి కొనుగోళ్ళు మరియు నిర్మాణాలు చేయవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్,కార్పొరేషన్ కార్పొరేటర్లు,స్థానిక నాయకులు,డివిజన్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.10 లక్షల చెక్కు అందజేత

**విశ్వంభర, మిర్యాలగూడ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన జీవిత బీమాలో భాగంగా మిర్యాలగూడ కర్ణాటక బ్యాంకు సురక్ష ప్రమాద బీమా పథకం క్రింద సంవత్సరానికి 300 రూపాయలు కట్టడం ద్వారా బాపూజీ నగర్ కు చెందిన బొల్లెద్దు లింగయ్య అకాల మరణం చెందడంతో వారి సతీమణి బొల్లెద్దు లింగమ్మకు కర్ణాటక బ్యాంకు ఇన్సూరెన్స్ క్లయిమ్ ను మంగళవారం రోజున 10 లక్షల రూపాయల చెక్కును బీజేపీ దార్మిక సెల్ రాష్ట్ర కొకన్వీనర్ చిలుకూరి శ్యామ్, కర్ణాటక బ్యాంకు మేనేజర్ బాలాజీ సింగ్, అసిస్టెంట్ మేనేజర్ కుమార్ నాయక్ చేతుల మీదుగా చెక్కును అందించారు. ఈ కార్యక్రమం బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చిల్లంచర్ల అభి, ఇమాని బుచ్చిరెడ్డి, బి. బాలాజీ, చరణ్, ప్రశాంత్, మనోజ్ కర్ణాటక బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి వినతి

**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వం ఆదుకునే విధంగా మంచి బుద్ధిని ప్రసాదించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మంగళవారం వినతి పత్రం అందించారు. బి.ఆర్.ఎస్. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజి మంత్రి కేటీఆర్ పిలుపుమేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు ఈ సందర్బంగా నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ కొడంగల్ లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారి పైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా.. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు.

## టేక్ హూమ్ రేషన్ ఫోటో తీయాల్సిందే

**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** అంగన్వాడి కేంద్రాల ద్వారా టేక్ హూమ్ రేషన్( టి హెచ్ ఆర్) ఇచ్చి ప్రతి లబ్ధిదారున్ని ఫోటో తీసి అప్లోడ్ చేయాలని అల్లాదుర్గం ఐసిడిఎస్ సిడిపిఓ పద్మలత అన్నారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలో చేపడుతున్న అన్ని వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని ఆమె పేర్కొన్నారు. మంగళవారం పేటలోని ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అల్లాదుర్గం వైసీపీఎస్ ప్రాజెక్టు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అల్లాదుర్గం టేక్ మాల్ రేగోడు పెద్ద శంకరంపేట మండలం పరిధిలోని అంగన్వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో సక్రమంగా నమోదు చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో లోపాలు లేకుండా పనిచేయాలని సూచించారు. ఎన్హెచ్ఎస్, పోషణ్ట్రాకర్, టీహెచ్ర్ యాప్లలో పిల్లల వివరాలు, వారి తల్లిదండ్రుల వివరాలను, ఫోటోలతో సహా అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు.

# లగచర్ల రైతులను విడుదల చేయాలి

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**విశ్వంభర, షాద్ నగర్ :** మంగళవారం షాద్ నగర్ పట్టణంలో లగచర్ల రైతులను జైలు నుండి విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసనలు తెలిపిన అనంతరం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడాతు.గడిచిన ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏం చేసిందో చెప్పాలని, పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా, రైతు భరోసా నిధులను వేయకుండా రైతులను అప్పులపాలు చేసిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి దక్కిందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఎం సొంత నియోజకవర్గంలో రైతులను జైలు పాలు చేయడం దేనికి నిదర్శనం అని, ఫార్మా పేరుతో పేద రైతుల భూములను కాజేసేందుకు ప్రయత్నిస్తే రైతులు ఊరుకుంటారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో ఫార్మా అభివృద్ధి కోసం వేల ఎకరాల భూమిని సిద్ధం చేసిందని, ఏవైనా పరిశ్రమలను నిర్మించాలంటే ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసే అవకాశం ఉన్నప్పటికీ, లగచర్ల ప్రాంతంలో భూసేకరణ చేపట్టడం లో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇబ్బందులకు గురి చేస్తూ, ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అర్థం లేని ఆరోపణలు చేస్తూ కాలయాపనం చేయడం తప్ప, ప్రజాసంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి దృష్టి లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రజా వ్యతిరేకతను గ్రహించి పాలనా సజావుగా సాగే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# సర్పంచ్ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయం

### చెనమోని రాములు



**విశ్వంభర, చింతపల్లి :** మండల కేంద్రంలోని 33, 34వ బూత్ కమిటీలను మంగళవారం బిజెపి మండల అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్ అధ్యక్షతన నియమించారు. బూత్ అధ్యక్షులుగా పాలకుల రాజు, మొగిలమోని మల్లేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేనమోని రాములు హాజరై మాట్లాడుతూ .. రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా చింతపల్లి గ్రామంలో కార్యకర్తలు, నాయకులు సంసిద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. చింతపల్లి మండల కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నాయకులు కలిసికట్టుగా శ్రమించి గ్రామం ప్రజల సమస్యల పట్ల స్పందించి గ్రామంలో ఇంటింటికి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ పథకాలను పథకాల గురించి గ్రామస్తులకు గడపగడపకు వివరించి గ్రామ ప్రజలకు చేరువ అయ్యి గ్రామంలో బిజెపి ప్రజా ప్రతినిధులను గెలిపించుకోవడం కోసం కలిసికట్టుగా పనిచేసి జెండా ఎగురవేయాడమే లక్ష్యంగా కార్యకర్తలు శ్రమించాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కుకుడపు రామకృష్ణ, వెన్నం శేఖర్, మహమ్మద్ జాంగిర్, కుంభం శ్రీనివాస్ రెడ్డి, బొడ్డు మహేష్, కుందేళ్ళ శ్రీశైలం, గజ్జె అభినవ్, గంగల వెంకటయ్య, జక్కుల రమేష్, రాపర్తి సతీష్, గడ్డి సైదులు, శివర్ల నగేష్ యాదవ్, మొగిలమోని రవి యాదవ్, గడ్డి మహేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మొబైల్ యాప్ సర్వేను సక్రమంగా నిర్వర్తించాలి

**విశ్వంభర, అమనగల్లు :** రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లులేని నిరుపేదలకు మంజూరుచేయడానికి ప్రత్యేక యాప్ ద్వారా చేపడుతున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వేను గ్రామ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీలు సక్రమంగా నిర్వర్తించాలని అమనగల్లు ఎంపిడిఓ కుసుమమాధూరి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అర్హులను గుర్తించడంలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండ జాగ్రత్తలు వహించాలని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు అమనగల్లు మండలం కోనాపూర్, మేడిగడ్డ తండాలో ప్రారంభమైన ఇందిరమ్మ ఇంటింటి సర్వేను మంగళవారం ఎంపిడిఓ పరిశీలించారు. అనంతరం కోనాపూర్ మేడిగడ్డ తండాలలో నర్సరీ ఏర్పాటు పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు.

## లగచర్ల రైతులను విడుదల చేయాలని వినతి

**విశ్వంభర, మేడిపల్లి :** అరాచక, దుర్మార్గ, ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు నలుపు రంగు కండువాలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెయ్యని తప్పునకు,కేవలం తమ భూమి తమకే ఉండాలని కోరుకున్నందుకు,తమ భూమిని ప్రభుత్వం గుంజుకుంటుంటే ప్రతిఘటించిన పాపానికి కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గిరిజన, దళిత, బలహీన వర్గాల రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం జైల్లో పెట్టిందని దుయ్యబట్టారు. తమ భూములు ఇవ్వబోమంటే వారి పై అప్రజాస్వామికంగా కేసులు పెట్టి, వారిని థర్డ్ డిగ్రీ టార్చర్కు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## నిర్బంధాలతో పోరాటాలు ఆపలేరు

**విశ్వంభర, మర్రిగూడ :** తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని చలో హైదరాబాదుకు వెళుతున్న కార్మికులను నిర్బంధించడం వల్ల ధర్నాలు పోరాటాలు ఆగవని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాన్ని శుభ్రం చేసి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని మురికి కాలువలు శుభ్రం చేసి గ్రామాన్ని అందంగా ఉంచే కార్మికుల వేతనాలు పెంచాలని వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ధర్నాకు వెళుతున్న కార్మికులను అరెస్టు చేయడం న్యాయం కాదని అన్నారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కార్మికులు గత టిఆర్ఎస్ ప్రభుత్వం పై ధర్నాలు రాస్తారోకోలు చేసినప్పుడు ధర్నాల టెంటు వద్దకు వచ్చి మేము అధికారంలోకి రాగానే మీ న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్మికులను మరచి అరెస్టు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పెండింగ్ వేతనాలు ఇవ్వాలని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు.

## ట్రాక్టర్ బైకు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆకుతోటపల్లి గ్రామ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామానికి చెందిన రహీం పని నిమిత్తం ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనం పై మాడుగుల నుండి ఆమనగల్ వెళ్లే దారిలో రోడ్డుపై ఆగి ఉన్న పత్తి ట్రాక్టర్ ను ఢీకొనడంతో రహీం కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన రహీం కు హైదరాబాద్ లోని ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. రోడ్డుపై ఎలాంటి పార్కింగ్ లైట్ వేసుకోకుండా ట్రాక్టర్లు పత్తి లోడుతో ఉండడంతో ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలుపుతున్నారు. ఆకుతోట పల్లి సమీపంలో పత్తి మిల్లు ఉండడంతో ట్రాక్టర్లకు, లారీలకు పార్కింగ్ లైట్ లేకుండా రోడ్డుపై ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు.ఆమనగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## మార్కెట్ కమిటీ ఛైర్మన్గా పరుశురాం రెడ్డి

**విశ్వంభర, పరిగి:** నూతన పరిగి మార్కెట్ కమిటీ ఛైర్మన్ గా పరుశురాం రెడ్డి, వైస్ ఛైర్మన్ గా ఎన్నికైన అయుబ్ లను మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఎజాజ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నసిర్, అనిల్, ఆరిఫ్, సోహెల్ నరసింహ, సల్మాన్, తదితరులు పాల్గొన్నారు.

# భవితకు భరోసా భగవద్గీత శ్లోకాలు

## లయన్స్ క్లబ్ ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా.జి.మహేంద్ర కుమార్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్ :** భవితకు భరోసా భగవద్గీత శ్లోకాలని 320ఎ లయన్స్ క్లబ్ ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా.జి.మహేంద్ర కుమార్ రెడ్డి అన్నారు. డా. కమలాకర్స్ మైండ్ , పర్సనాలిటీ కేర్, నవభారత్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ బాలికల ఎస్సీ వసతి గృహంలో భగవద్గీత శ్లోకాలు పై పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు, పుస్తకాలు,బాలికలకు నెల రోజులకు కాస్మెటిక్స్,వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులను ను సుహాసిని స్పాన్సర్ చేయగా డా.మహేంద్ర కుమార్ రెడ్డి , రామచంద్ర ,సుహాసిని, జ్యోతి రాజా, జయశ్రీ, డా.హిప్నో పద్మా కమలాకర్ అందజేశారు. ఈ సందర్భంగా డా.మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ, భగవద్గీత శ్లోకాలతో విద్యార్థుల్లో ఏకాగ్రత అభివృద్ధి చెందుతుందన్నారు. అర్జునుడు ఎదుర్కొన్న ఆత్మ సంఘర్షణల నుండి నేటి ఆధునిక ప్రపంచంలో మనం ఎదుర్కొంటున్న సమస్యల వరకు, గీతాలోని శ్లోకాలు మనకు ఆత్మబలాన్ని, ధైర్యాన్ని ప్రసాదిస్తాయి న్నారు. జీవన సందేహాలను తొలగించి, మనసును ప్రశాంతపరిచే మార్గాలను సూచిస్తుంది న్నారు. గీతలోని శ్లోకాలు ధర్మం, కర్మ, ఆత్మజ్ఞానం, జీవన విధానాలను సమగ్రంగా వివరించాయని తెలిపారు ."భగవద్గీతలోని శ్లోకాలు నైతిక విలువలు, జీవన పాఠాలు అందించడమే కాకుండా మనసుకు శాంతిని కలిగిస్తాయన్నారు. విద్యార్థులు ఈ శ్లోకాలను పఠించడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకుని, దృష్టి సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చుని అన్నారు. భగవద్గీత భారతీయ ఆధ్యాత్మిక సంపదలో ఒక అపార రత్నమన్నారు. దానిలోని తత్వాలను జీవితంలో ఆచరించడం అత్యవసరమని చెప్పారు. మహాభారత కాలంలో కేవలం ఒక యుద్ధమే జరిగిందన్నారు. కానీ నేటి మన జీవితాల్లో ప్రతి రోజు కొత్త యుద్ధమేనని చెప్పారు. ప్రతి సమస్య ఒక కురుక్షేత్రమేనన్నారు. ప్రతి క్షణం మనస్సులో శత్రువులా ఉత్పన్నమవుతున్న సంక్లిష్ట ఆలోచనలే నన్నారు. ఈ యుద్ధాలన్నింటికి సమాధానం కృష్ణుడు భగవద్గీతలో ఇచ్చిన 18 అధ్యాయాల్లో స్పష్టంగా ఉందన్నారు. గీతా సారం ఆధునిక ప్రపంచంలోనూ వ్యక్తిత్వ వికాసానికి, జ్ఞానోదయానికి ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.డా. హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ భగవద్గీత ఒక మహా తత్వశాస్త్ర గ్రంథమన్నారు. మనస్సు మనోభావాల వికాసానికి కీలకమైన మార్గదర్శిగా పనిచేస్తుందన్నారు. మనస్సు అశాంతిగా ఉంటే, ఆత్మజ్ఞానం ద్వారా తనిఖీ చేసుకోవచ్చన్నారు. మనం ఎవరో, మన స్వభావం ఏమిటి అన్నది అర్థం చేసుకోవచ్చునని చెప్పారు. మనం చేస్తున్న కార్యాలు వాటి ఫలితాలను ఆశించకుండా, నిస్వార్థంగా చేయాలన్నారు. కోపం మనసులో కాదు మాటలో ఉండాలని.. ప్రేమ మాటలో కాదు మనసులోనూ ఉండాలని భగవద్గీత చెపుతుందన్నారు.అబద్ధంలో ఉన్న భయం కంటే ధైర్యంలో వున్న నిజం,నిజాయితీ లో వుండే గర్వం గొప్పదని తెలుపుతుంద న్నారు. కష్ట సుఖాలను సమానంగా స్వీకరిస్తే మనస్సు వృద్ధిచెందించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. భగవద్గీత మానసిక వికాసాన్ని పెంచడానికి, మనస్సును శాంతంగా ఉంచడంలో, ఆరోగ్యకరమైన జీవనశైలిని ఏర్పరచడంలో, తాత్త్విక దృష్టిని సాధించడంలో సహాయపడుతుందని తెలిపారు. భగవద్గీత శ్లోకాల ప్రాముఖ్యతను విద్యార్థులకు పరిచయం చేస్తూ, ధ్యాన సామర్థ్యాన్ని పెంచడానికి , "మన పిల్లలు బాగుంటే ప్రపంచం బాగుంటుంది" అనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. సుహాసిని పాటలు పాడి బాలికలను ఉత్సాహ పరిచారు.

## పిక్టోరియల్ బయోగ్రఫీ అంబేద్కర్ పుస్తకావిష్కరణ




**విశ్వంభర, హైదరాబాద్ :** అంబేద్కర్ అందరి గురించి ఆలోచించేవారు అని ఎమ్మెల్యే జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి హైదరాబాద్ బాగ్లింగపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో అంబేద్కర్ ఫోటోలతో రూపొందించబడిన పిక్టోరియల్ బయోగ్రఫీ అంబేద్కర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ... అంబేద్కర్ అందరివాడని అయితే కొంతమంది మాత్రం దళిత నాయకుడు అంటూ ప్రచారం చేయడం సరైందికాదన్నారు. పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ సీహెచ్ బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ జె.గీతారెడ్డి, ఏసీఈ ఇంజనీరింగ్ అకాడమీ చైర్మన్ వై.వి.గోపాల కృష్ణమూర్తి, ఆర్పీఐ అధ్యక్షులు బి.మహేష్ బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, రచయిత దుర్గం సుబ్బారావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీఎస్ఎన్ మూర్తి, పబ్లిక్ ప్రసీక్యూటర్ పల్లె నాగేశ్వర్రావు పాల్గొన్నారు.

# డిసెంబర్ 23న దేశవ్యాప్త ఆందోళన




**విశ్వంభర, హైదరాబాద్ :** రైతాంగం పండిరచిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే చట్టం తీసుకొస్తామని రాతపూర్వకంగా రైతాంగానికి ఇచ్చిన హామీని తుంగలో తొక్కి దొడ్డిదారిన నల్లచట్టాలను అమలు చేయడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం సిద్ధపడడాన్ని వ్యతిరేకిస్తూ రైతాంగం చేపట్టిన ఎస్కెఎం ఉద్యమానికి మద్ధతుగా డిసెంబర్ 23న 500 జిల్లా కేంద్రాల్లో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటి తలపెట్టిన ఆందోళనా కార్యక్రమాలను జయప్రదం చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్ పిలుపునిచ్చారు. హైదరాబాద్లోని తెలంగాణా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా రైతులు పోరాటంపైన నిర్బంధాన్ని ప్రయోగించి అరెస్టులు చేస్తున్నారన్నారు.

## చిన్నారికి కామినేని ఆస్పత్రి వైద్యుల అరుదైన శస్త్రచికిత్స

**విశ్వంభర, నాగోల్ :** మాడు మూసుకుపోయిన చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స అందించి ప్రాణాపాయ స్థితి నుండి కాపాడినట్లు ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి కన్సల్టెంట్ న్యూరో సర్జన్, మినిమల్ యాక్సెస్ బ్రెయిన్, స్పైన్ సర్జన్ డాక్టర్. ఎస్ రమేష్ తెలిపారు. మంగళవారం ఆసుపత్రిలో ఆయన మాట్లాడుతూ "వరంగల్లో 3డి ప్రింటింగ్ చేసే వ్యక్తికి శిశువు పుట్టిన తర్వాత సుమారు మూడు నెలల వయసులో ఉండగా సాధారణంగానే పిల్లల వైద్యులకు చూపించారు. ఖాళీగా ఉండాల్సిన మాడు ప్రాంతం కూడా బాగా గట్టిగా ఉండి, అక్కడ సైతం కపాలం ఏర్పడడాన్ని ఆయన గుర్తించి.. అందుకు తగిన శస్త్రచికిత్స చేయాలని కామినేని ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఇక్కడ చిన్నారికి అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేసిన తర్వాత.. ఎండోస్కొపిక్ విధానంలోనే సూచరెక్టమీ అనే శస్త్రచికిత్స చేసినట్లు తెలిపారు. శిశువు ఎదిగేకొద్దీ మెదడు కూడా ఎదుగుతుంది. . అందుకు తగినట్లుగా కొన్ని పొరలను తొలగిస్తూ వెళ్లాం. ఇప్పుడు ఈ శిశువు పూర్తి ఆరోగ్యంతో ఉందన్నారు.




కాంట్రాక్ట్ ఏఎన్ఎం లను రాత పరీక్షలు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ వైద్య ఆరోగ్య ఉద్యోగ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో కోటి వైద్య విధాన పరిషత్ వద్ద మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. ధర్నాలో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు. - విశ్వంభర, హైదరాబాద్

# అజిత్ పవార్... మీ చేతిలో నేనేమైనా కీలు బొమ్మనా?: భుజ్‌బల్



**నాసిక్:** ఎన్సీపీ (అజిత్ పవార్)లో ముసలం మొదలైంది. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో తనకు చోటు దక్కక పోవడంతో ఆ పార్టీ సీనియర్ నేత ఛగన్ భుజ్‌బల్ తీవ్ర అసహనానికి గురయ్యారు. పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ , కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రఫుల్ పటేల్‌పై విమర్శలు గుప్పించారు. వారు చెప్పిందల్లా వింటూ గంగిరెద్దులా తలూపడానికి, వారి చేతుల్లో కీలుబొమ్మను కాదని మండిపడ్డారు. ఇంతకీ ఏం జరిగిందంటే..

ఇటీవల జరిగిన మహారాష్ట్ర కేబినెట్ విస్తరణలో తనకు మంత్రివర్గంలో చోటు దక్కుతుందని భుజ్‌బల్ ఆశించారు. కానీ, చివరి దశలో ఆయనకు మొండి చేయి ఎదురైంది. దీంతో అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు దుమ్మా కొట్టిన ఆయన.. మంగళవారం నాసిక్ చేరుకున్నారు. తన మద్దతుదారులందరితో కలిసి సమావేశం నిర్వహించారు. తనకు మంత్రిపదవి రాకుండా అడ్డుకున్నవారిని కచ్చితంగా గుర్తించి తీరుతానని అన్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ కూడా తనను మంత్రి వర్గంలోకి తీసుకునేందుకు ఆసక్తి చూపినప్పటికీ సొంత పార్టీ నేతలే అడ్డుతగిలారని ఆయన ఆరోపించారు.

'' మంత్రి పదవి గురించి అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్ నాతో మాట్లాడతామన్నారు. కానీ, వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. ఈలోగా మంత్రివర్గ విస్తరణ జరిగిపోయింది. ఇప్పుడు నన్ను రాజ్యసభకు వెళ్లమంటున్నారు. అలా చేస్తే.. నన్ను నమ్మి ఓట్లేసిన ప్రజలు ఏమైపోవాలి. నా విజయం కోసం అహర్నిశలూ శ్రమించిన కార్యకర్తల సంగతి ఏంటి? వాళ్లు (అజిత్, ప్రఫుల్) కూర్చోమంటే కూర్చోడానికి, నిల్చోమంటే నిలబడటానికి వాళ్ల చేతిలో కీలు బొమ్మని కాదు. పార్టీ కార్యకర్తలందరితో మాట్లాడి తదుపరి కార్యాచరణ సిద్ధం చేసుకుంటా.

పార్టీ పరంగా అధ్యక్షుడిదే తుది నిర్ణయం. భాజపాలో దేవేంద్ర ఫడణవీస్‌లా, శివసేనలో ఏక్‌నాథ్ శిందేలా, ఎన్సీపీకి సంబంధించిన అన్ని నిర్ణయాలను అజిత్‌పవార్ తీసుకోవాలి. కానీ, అలా జరగడం లేదు. రాష్ట్ర కేబినెట్‌లో నేను ఉండాలని ఫడణవీస్ స్వయంగా చెప్పారు. అందుకే లోక్‌సభ ఎన్నికలకు దూరంగా ఉన్నా. ఇప్పుడు రాజ్యసభ సీటు ఇస్తామంటున్నారు. పార్టీ కోసం పని చేస్తున్నా. రాష్ట్రంలో మీ సేవలు కావాలని అప్పట్లో పార్టీ కోరింది. అందుకు అంగీకరించే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఇప్పుడు రాజ్యసభ ఇస్తామంటే వెళ్తానా? నన్ను గెలిపించిన ప్రజలు ఏమనుకుంటారు? అందుకే మరీ అవసరమనుకుంటే 2 సంవత్సరాల తర్వాత వెళ్తానని చెప్పాను. అప్పటిలోగా నియోజకవర్గ సమస్యలను పరిష్కరించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని అజిత్, ప్రఫుల్ పటేల్‌కు ఇప్పటికే చెప్పాను. అయితే, దీని గురించి మాట్లాడదామన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు'' అని భుజ్‌బల్ అన్నారు. ప్రతి ఒక్క ఎమ్మెల్యే మంత్రి కావాలని కోరుకుంటారని, అయితే, తనను తిరస్కరించిన విధానం సరిగా లేదని ఆయన వాపోయారు.



## ఆ బిల్లు ఏవిధంగా రాజ్యాంగ విరుద్ధం..?

**- కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్**

**ఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభ ముందుకు తీసుకొచ్చిన 'వన్ నేషన్, వన్ ఎలక్షన్ ' బిల్లు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు ఆరోపిస్తుంటే.. ఏరకంగా రాజ్యాంగ విరుద్ధమో చెప్పాలని అధికార పక్షం డిమాండ్ చేస్తోంది. దేశమంతటా (లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలు) ఒకే దఫా ఎన్నికలు నిర్వహించేందుకు వీలుపడేలా రాజ్యాంగంలో మార్పు చేయడం కోసం.. కేంద్రం 129వ రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టింది.కేంద్ర న్యాయశాఖ మంత్రి ప్రతిపాదన మేరకు లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించి బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపారు. జేపీసీ బిల్లుపై సంపూర్ణ అధ్యయనం చేయనుంది. ఇదిలావుంటే ఆ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. ప్రతిపక్షాల ఆరోపణలపై లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మండిపడ్డారు.

వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు ఏవిధంగా రాజ్యాంగ విరుద్ధమో చెప్పాలని డిమాండ్ చేశారు. అబద్ధాలు మాట్లాడటం, అబద్ధపు ప్రచారం చేయడం ప్రతిపక్షాలకు అలవాటుగా మారిందని ఆరోపించారు. నిజంగా ఆ బిల్లు రాజ్యాంగ విరుద్ధమైతే, ఏవిధంగా రాజ్యాంగ విరుద్ధమో చెప్పవచ్చు కదా.. అని వ్యాఖ్యానించారు. ఒక్క ప్రతిపక్ష ఎంపీ కూడా ఆ బిల్లు ఏవిధంగా రాజ్యాంగ విరుద్ధమో చెప్పలేదని విమర్శించారు.

**ఇండోనేషియా రక్షణమంత్రితో**

## భారత నేవీ చీఫ్ భేటీ..



**ఢిల్లీ:** ఇండోనేషియా పర్యటనలో ఉన్న భారత నేవీ చీఫ్ , అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి .. ఆ దేశ రక్షణ మంత్రి, లెఫ్టినెంట్ జనరల్ జాఫ్రీ జంషుద్దీన్ తో భేటీ అయ్యారు. భారత్‌ఇండోనేషియా రక్షణ సంబంధాలకు ఈ భేటీని కీలక ముందడుగుగా చెప్పవచ్చు.భారత్‌ఇండోనేషియా మధ్య రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమావేశంలో చర్చించారు. రక్షణ పరిశ్రమలో రెండు దేశాల నడుమ పరస్పర సహకారాన్ని విస్తరించడంపై కూడా ఈ సమావేశంలో చర్చ జరిగింది. భారత నేవీ అధికార ప్రతినిధి ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు.

## హర్యానా రైతు 44 ఏండ్ల వైవాహిక జీవితానికి స్వస్తి..

**- మధ్యవర్తిత్వంతో భార్యాభర్తలకు విడాకులు..!**



**కర్నాల్:** హర్యానాలోని కర్నాల్ జిల్లాకు చెందిన 70 ఏండ్ల సుభాష్ చంద్ అనే రైతు తన 40 ఏండ్ల వైవాహిక జీవితానికి ముగింపు పలికారు. 1980లో సంతోష్ కుమారి అనే యువతితో సుభాష్ చంద్ వివాహం జరిగింది. కానీ, భార్యాభర్తల మధ్య వ్యక్తిగత విభేదాల వల్ల 2006 నుంచి విడిగా జీవిస్తున్నారు. 2006 నుంచి 18 ఏండ్ల పాటు సాగిన న్యాయ పోరాటం తర్వాత రూ.3.1 కోట్లతో మధ్యవర్తిత్వ ఒప్పందం చేసుకున్నారు. 2006 లో మానసిక వేధింపుల కారణంగా విడాకులు కావాలని సుభాష్ చంద్ పిటిషన్ దాఖలు చేశాడు. 2013లో కర్నాట్ కుటుంబ న్యాయస్థానం ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది.

కానీ ఆయన పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ 11 ఏండ్ల పాటు విచారణ జరిగిన తర్వాత గత నెల నాలుగో తేదీన మధ్యవర్తిత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రూ.2.16 కోట్ల విలువైన డిమాండ్ డ్రాఫ్ట్, పంటల విక్రయం ద్వారా రూ.50 లక్షలు, రూ.40 లక్షల విలువైన బంగారం - వెండి ఆభరణాల అప్పగింతతో ఇరువురి మధ్య మధ్యవర్తిత్వ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సుభాష్ చాంద్ ఆస్తులపై ఆయన మరణం తర్వాత కూడా ఆయన ఆస్తులపై భార్యా పిల్లలకు హక్కు ఉండదు. ఈ మధ్యవర్తిత్వ ఒప్పందానికి జస్టిస్‌లు సుధీర్ సింగ్, జస్జిత్ సింగ్ బేడీలతో కూడిన ధర్మాసనం ఆమోద ముద్ర వేసింది.

**వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు**

## రాజ్యాంగ విరుద్ధం

**- డీఎంకే ఎంపీ కనిమొళి**

**చెన్నై:** 'ఒకే దేశం, ఒకే ఎన్నిక ' బిల్లును తాము వ్యతిరేకిస్తున్నట్లు లోక్‌సభలో ఖరాఖండిగా చెప్పామని డీఎంకే ఎంపీ కనిమొళి చెప్పారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని, అందుకే తాము దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆమె తెలిపారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు సమాఖ్య హక్కులకు, ప్రజల ఆకాంక్షలకు కూడా విరుద్ధమని అన్నారు.ప్రజలు రాష్ట్ర ప్రభుత్వాలను ఐదేళ్ల కాలానికి ఎన్నుకుంటారని, కానీ మీరు వాళ్ల హక్కును దూరం చేస్తారని అనుకోవడం లేదని కనిమొళి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఎన్నేళ్లు ఉండాలనే అధికారాన్ని ప్రజల నుంచి లాక్కుని కేంద్ర ఎన్నికల సంఘానికి ఇవ్వడం కరెక్ట్ కాదని అన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు, సమాఖ్య స్ఫూర్తికి, రాజ్యాంగానికి వ్యతిరేకమని అన్నారు.

కేంద్రం ఆ బిల్లును అమల్లోకి తీసుకొస్తే రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలకు విఘాతం కలుగుతుందని అన్నారు. కాబట్టి తాము ఈ బిల్లును అంగీకరించబోమని అన్నారు. ఇవాళ కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దాంతోపాటే బిల్లును జేపీసీకి పంపాలని ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించి జేపీసీకి అప్పగించారు.



**మొన్న 'పాలస్తీనా'..**

## నిన్న 'బంగ్లా' బ్యాగ్‌తో పార్లమెంట్‌కు ప్రియాంక



**ఢిల్లీ:** పాలస్తీనా అనిరాసి ఉన్న బ్యాగ్‌తో సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో కనిపించిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ .. నేడు కొత్త బ్యాగ్‌తో కనిపించారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులను ఖండిస్తున్న సందేశం ఉన్న బ్యాగులను విపక్ష ఎంపీలు వెంట తీసుకువచ్చారు. మంగళవారం సమావేశాలు ప్రారంభం వేళ.. వాటిని ప్రదర్శిస్తూ, మైనార్టీలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

మంగళవారం ప్రియాంక లోక్‌సభలో మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల మీద భారత్ గళం విప్పాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు అక్కడి ప్రభుత్వంతో మాట్లాడాలని సూచించారు. ఇక నిన్న పార్లమెంట్‌కు వచ్చేటప్పుడు ఆమె వెంట తెచ్చుకున్న బ్యాగుపై పాలస్తీనా అని రాసి ఉంది. ఇజ్రాయెల్ దాడులతో దుర్భర పరిస్థితులను అనుభవిస్తోన్న పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా ఆమె దానిని తీసుకువచ్చారు. అయితే ఆ బ్యాగు తీసుకురావడం చర్చనీయాంశమైంది. జాతీయ అంశాల కంటే అంతర్జాతీయ అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే ప్రయత్నమంటూ భాజపా నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై ప్రియాంక స్పందిస్తూ.. ''నేను ఏమి ధరించాలో ఎవరు నిర్ణయిస్తారు? నేను కోరుకున్నది ధరిస్తా'' అని స్పష్టంచేశారు.పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ పై వచ్చిన ఆరోపణల మీద జేపీసీ విచారణ జరపాలని విపక్షాలు డిమాండు చేస్తున్న విషయం తెలిసిందే. దానిలోభాగంగా కొన్ని రోజులుగా ప్రతిపక్ష నేతలు వినూత్న బ్యాగులతో నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. బ్యాగ్‌కి ఒకవైపు ప్రధాని నరేంద్ర మోదీ , పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ ల చిత్రం, మరోవైపు 'మోదీ, అదానీ భాయ్ భాయ్' అనే నినాదం ముద్రించి ఉన్న బ్యాగులతో కనిపించారు.

## ఇకపై ఎన్‌టీఏ రిక్రూట్‌మెంట్ పరీక్షలు నిర్వహించదు: కేంద్ర మంత్రి




**ఢిల్లీ:** రిక్రూట్‌మెంట్ , ప్రవేశ పరీక్షల నిర్వహణ వంటి అంశాల్లో కేంద్రం ఏర్పాటుచేసిన ఉన్నత స్థాయి ప్యానెల్ దృష్టి సారించింది. దీంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బాధ్యతల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇకపై రిక్రూట్‌మెంట్ పరీక్షలను ఆ సంస్థ నిర్వహించదు. ఈ విషయాన్ని కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు.

''ఉన్నత స్థాయి ప్యానెల్ సిఫార్సు చేసిన సంస్కరణల్లో భాగంగా ఈ మార్పులు చేశాం. ఇకపై రిక్రూట్‌మెంట్ పరీక్షలను ఎన్‌టీఏ నిర్వహించదు. కేవలం ప్రవేశ పరీక్షలు మాత్రమే నిర్వహిస్తుంది. ఇది 2025 నుంచి అమలుకానుంది. ఎన్‌టీఏను ప్రక్షాళన చేస్తాం. వచ్చే ఏడాది దీనిలో మరిన్ని మార్పులు రానున్నాయి. కొత్తగా పది పోస్టులు సృష్టిస్తాం. జీరో ఎర్రర్ టెస్టింగ్ ఉండేలా ఎన్‌టీఏ పనితీరులో మార్పులు ఉంటాయి'' అని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

''కామన్ యూనివర్శిటీ ఎంట్రన్స్ టెస్ట్ ఏడాదికి ఒక్కసారి మాత్రమే నిర్వహించనున్నాం. అంతేకాకుండా.. నీట్ యూజీ పరీక్షలు పెన్‌పేపర్ విధానంలో నిర్వహించాలా..? లేదా ఆన్‌లైన్‌లో చేపట్టాలా అనే విషయంపై ఆరోగ్య మంత్రిత్వశాఖతో చర్చలు జరుగుతున్నాయి. అయితే.. భవిష్యత్తులో అన్ని ప్రవేశ పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది'' అని తెలిపారు.

కాగా.. నీట్ ప్రవేశపరీక్ష పత్రం లీక్, ఇతర పరీక్ష నిర్వహణల్లో అవకతవకలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో కేంద్రం ఆదేశాలతో విద్యాశాఖ ఉన్నతస్థాయి ప్యానెల్ సంస్కరణలకు ఉపక్రమించింది. ప్రవేశ పరీక్ష, రిక్రూట్‌మెంట్ పరీక్ష నిర్వహణల్లో సంస్కరణలు చేసింది. ఈ సిఫార్సుల ప్రకారం.. తాజాగా ఈ మార్పులు చోటుచేసుకున్నాయి.

## ఇగోను పక్కన పెట్టకపోతే అగాధంలో పడిపోతారు : మోహన్ భాగవత్



**పుణె:** ప్రతి ఒక్కరు ఇగోను పక్కన పెట్టాలని లేకపోతే అగాధంలో పడిపోతారని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ హితవు పలికారు. శాశ్వతమైన ఆనందాన్ని గుర్తించినప్పుడే నిస్వార్థమైన సేవ చేస్తారని, అదే ఇతరులకు సహాయపడే ధోరణిని పెంచుతుందని అన్నారు. మహారాష్ట్రలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సమాజంలో ప్రతిదీ తప్పుగా జరుగుతోందనే అభిప్రాయం కూడా పెరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు.

''సమాజంలో ఒక ప్రతికూల అంశం జరిగితే దానికి 40 రెట్లు మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి. సానుకూల అంశాల గురించి అవగాహన కల్పించడం అవసరం. సేవ అనేది సమాజంలో శాశ్వతమైన నమ్మకాన్ని పెంచుతుంది. రామకృష్ణ పరమహంస అభిప్రాయం ప్రకారం.. మనలో రెండు 'నేను'లు ఉంటాయి. ఒకటి ముడిపదార్థం కాగా, మరొకటి పరిపక్వత చెందినది. పరిపక్వతతో కాకుండా ముడిపదార్థం (ఇగోతోఉంటే)గానే ఉంటామంటే.. అగాధంలో పడిపోతాం'' అని అన్నారు. అలాగే అన్ని వర్గాల సాధికారతే దేశం అభివృద్ధిని నిర్ధారిస్తుందని తెలిపారు. దేశ పురోగతికి దోహదపడేలా యువతను తీర్చిదిద్దాలని సూచించారు.

గతంలో కూడా భాగవత్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. ''దేవుళ్లమని మనకు మనం స్వయంగా ప్రకటించుకోకూడదని.. ఆ విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారు. కొంతమంది మెరుపులా మెరవాలని కోరుకుంటారు. కానీ, పిడుగు పడిన తర్వాత మరింత చీకటిగా మారుతుందని వారు గుర్తించరు'' అని నేతలను ఉద్దేశించి అన్నారు.

**ఈ నెల 19న కాంగ్రెస్ ఎంపీలతో**

## రాహుల్‌గాంధీ భేటీ..



**ఢిల్లీ:** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు , కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఈ నెల 19న తమ పార్టీ ఎంపీలతో భేటీ కానున్నారు. పార్లమెంట్ హౌస్ అన్నెక్సేలో ఈ భేటీ జరగనుంది. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు, రైతులకు కనీస మద్దతు ధర, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం తదితర అంశాలపై పార్లమెంటులో అనుసరించాల్సిన విధానంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగుతున్నది. గౌతమ్ అదానీ అంశం, రైతులకు కనీస మద్దతు ధర తదితర అంశాలపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో సభలు వాయిదాపడుతూ వచ్చాయి. చివరకు ఈ నెల 13, 14 తేదీల్లో లోక్‌సభలో, ఈ నెల 16, 17 తేదీల్లో రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ జరిగింది.

రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ ఉభయసభల్లో రాజ్యాంగంపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఉభయసభల్లో వాడీవేడి చర్చ జరిగింది. రాజ్యాంగాన్ని దేశ పరిస్థితులకు అనుకూలంగా మార్చకుండా కాంగ్రెస్ పాలకులు వందలకొద్ది సవరణలు చేస్తూ వచ్చారని ప్రభుత్వం విమర్శించింది. దేశంలో కోసం ఇంతవరకు ఏమీ చేయని బీజేపీ మాకు రాజ్యాంగం గురించి పాఠాలు చెప్పడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండిపడింది.

ఈ క్రమంలో ఈ నెల 19న రాహుల్‌గాంధీ కాంగ్రెస్ ఎంపీలతో భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజ్యాంగంపై చర్చ జరిగిన రెండు రోజులు మినహా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఇంతవరకు ఉభయసభలు సజావుగా సాగలేదు. ఇకముందైనా సభా కార్యకలాపాలు సజావుగా సాగుతాయా లేదా..? అనేది అనుమానంగా ఉన్నది.

## రేషన్ బియ్యం దొంగలు తప్పించుకోలేరు: నాదెండ్ల మనోహర్

**విశ్వంభర, తెనాలి:** పేద ప్రజలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని దారి మళ్లిస్తున్నారని.. క్షేత్రస్థాయిలో వాస్తవాలను తెలుసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అన్నీ పరిశీలించాకే చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన మాట్లాడుతూ..''మరో గిడ్డంగిపైనా అనుమానం ఉంది.. తనిఖీ చేస్తాం. 243 టన్నుల రేషన్ బియ్యం దారి మళ్లించేందుకు ప్రయత్నించారు. వ్యవస్థను ఎంతగా ఖూనీ చేశారో ప్రజలు గ్రహించాలి. ఎవరిపైనా కక్ష సాధింపులు ఉండవని పదేపదే చెబుతున్నాం. నిజాయతీగా పనిచేస్తాం. తప్పు చేసినవారెవరూ చట్టం నుంచి తప్పించుకోలేరు'' అని స్పష్టం చేశారు.కాకినాడ పోర్టులోని స్టెల్లా నౌకలో ఇప్పటికే 1320 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించినట్టు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. మచిలీపట్నం మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత పేర్ని నానికి చెందిన గోడౌన్‌లో 185 టన్నుల రేషన్ బియ్యం మాయమయ్యాయి. దీనికి సంబంధించి పేర్ని నాని సతీమణి జయసుధపై అధికారులు కేసు నమోదు చేశారు.






## కేంద్ర మంత్రితో పయ్యావుల భేటీ..

**నిధుల విడుదలపై చర్చ**

**ఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక సాయం అందించాలని ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్.. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రి నిర్మాలా సీతారామన్‌తో పయ్యావుల కేశవ్ భేటీ అయ్యారు. గత ఐదేళ్లలో 93 కేంద్ర పథకాలు రాష్ట్రంలో అమలు చేయలేదని సీతారామన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆ పథకాలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని.. 73 కేంద్ర పథకాలను పునరుద్ధరించినట్లు చెప్పారు. రాష్ట్ర వాటా ఇచ్చిన పథకాలకు కేంద్ర నిధులు ఇవ్వాలని కోరారు. పెండింగ్ నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వెనుకబడిన ప్రాంతాలకిచ్చే ప్రత్యేక గ్రాంట్ పెండింగ్ నిధులు ఇవ్వాలన్నారు.

**ప్రజా భద్రత దృష్ట్యా ఫోన్లపై**

## నిఘాకు అనుమతి పొడిగింపు



**విశ్వంభర, అమరావతి:** ప్రజా భద్రత దృష్ట్యా టెలిఫోన్, మొబైల్ ఫోన్లపై నిఘా కోసం ఇచ్చిన అనుమతిని పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో ముగ్గురు నిర్దేశిత అధికారులకు ఈ ఫోన్లపై నిఘా ఉంచేందుకు అనుమతిని పొడిగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంటెలిజెన్స్ విభాగం డీజీ లేదా అదనపు డీజీ, కౌంటర్ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్‌లకు చెందిన ఐజీ లేదా డీఐజీలకు కల్పించిన ఈ అధికారాలను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

2025 జనవరి ఒకటో తేదీ నుంచి 2025 డిసెంబరు 31 తేదీ వరకూ నిర్దేశిత ముగ్గురు అధికారులకు ఈ అనుమతిని పొడిగించినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఇండియన్ టెలిగ్రాఫ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం, ఇతర నిబంధనల మేరకు ప్రజాభద్రత దృష్ట్యా అనుమానిత ఫోన్లు, టెలిఫోన్, ఇంటర్నెట్ సేవలపై నిఘా పెట్టేందుకు అనుమతి పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. హోంశాఖ ముఖ్యకార్యదర్శి ముందస్తు అనుమతి ఇచ్చాకే నిర్దేశిత అధికారులు సదరు అనుమానిత ఫోన్లు, ఇంటర్నెట్ సేవలపై నిఘా పెట్టనున్నట్టు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు.

**బియ్యం రవాణా చేసేందుకు**

## అనుమతులు ఉన్నాయా?: ఏపీ హైకోర్టు

**విశ్వంభర, అమరావతి:** కాకినాడ పోర్టులోని ఎంవీ స్టెల్లా నౌక వ్యవహారం ఏపీ హైకోర్టుకు చేరింది. పారా బాయిల్డ్ రైస్‌ను కాకినాడ పోర్టులోని స్టెల్లా నౌకలో లోడ్ చేసేందుకు అనుమతి ఇచ్చేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని పలువురు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం.. దీనిపై పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బియ్యం రవాణా చేసేందుకు అనుమతులు ఉన్నాయా?అని ఈ సందర్భంగా హైకోర్టు ప్రశ్నించింది. నౌకలో బియ్యం లోడ్ చేయకుండా అడ్డుకునేందుకు ప్రభుత్వానికి ఉన్న అధికారాలు ఏమిటని ధర్మాసనం అడిగింది. తమ బియ్యాన్ని నౌకలో లోడ్ చేయకుండా అడ్డుకుంటున్నారని చిత్ర, యాగ్రీ ఎక్స్‌పోర్ట్, పద్మశ్రీ రైస్‌మిల్, సూర్యశ్రీ రైస్‌మిల్ యజమానులు భాస్కరరెడ్డి, గంగిరెడ్డి, విశ్వనాథరెడ్డిలు హైకోర్టులో పిటిషన్లు వేశారు. వివరాలు సమర్పించేందుకు సమయం కావాలని అడిషనల్ అడ్వొకేట్ జనరల్ న్యాయస్థానాన్ని కోరారు. ఏఏజీ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను ఈనెల 19కి వాయిదా వేసింది.





### ఐసీసీ ర్యాంకింగ్స్‌లో
## వన్డేలు, టీ20ల్లో టాప్-3లోకి మంధాన

**ముంబయి:** ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్3లోకి దూసుకొచ్చింది. వన్డేల్లో మూడు స్థానాలు ఎగబాకి రెండో స్థానంలో నిలిచిన ఈ స్టార్ బ్యాటర్.. టీ20ల్లో ఒక స్థానం మెరుగై మూడో ర్యాంక్ దక్కించుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ వన్డేల్లో రెండు స్థానాలు దిగజారి 13వ ప్లేస్‌కు పడిపోగా.. టీ20 ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం మెరుగై టాప్10లోకి వచ్చింది. న్యూజిలాండ్ క్రికెటర్ సోఫీ డివైన్‌తో కలిసి పదో స్థానాన్ని పంచుకుంది. దీప్తి శర్మ ఐదు స్థానాలు దిగజారి 32వ ప్లేస్‌కు పడిపోయింది.భారత్‌తో వన్డే సిరీస్‌లో బ్యాట్ తో అదరగొట్టిన అన్నాబెల్ సదర్లాండ్ ఏకంగా 15 స్థానాలు ఎగబాకి 29వ స్థానంలో నిలిచింది. తహ్లియా మెక్‌గ్రాత్ ఎనిమిది స్థానాలు జంప్ చేసి 24వ స్థానంలో ఉంది. ఆసీస్‌తో తొలి టీ20లో అదరగొట్టిన జెమీమా రోడ్రిగ్స్ ఆరు స్థానాలు ఎగబాకి 15వ స్థానంలో నిలిచింది. షఫాలీ వర్మ 13వ స్థానంలో కొనసాగుతోంది. వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ రెండు స్థానాలు పడిపోయి ఐదో స్థానంలో నిలవగా.. అరుంధతి రెడ్డి ఏకంగా 48 స్థానాలు జంప్ చేసి 51వ స్థానం దక్కించుకుంది. టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో దీప్తి రెండు స్థానాలు మెరుగై సెకండ్ ప్లేస్‌లో నిలిచింది.

## డ్రా దిశగా గబ్బా టెస్ట్..!

**బ్రిస్బేన్:** బోర్డర్ గవాస్కర్ టెస్ సిరీస్‌లో భాగంగా బిస్బేన్ గబ్బా వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లో ఆస్ట్రేలియా పట్టు బిగించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగుల చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ తడబడింది. నాలుగో రోజు మ్యాచ్ ముగిసే సరికి టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. అయితే, బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, ఆకాశ్‌దీప్ జోడి ఆస్ట్రేలియా పేస్ బౌలింగ్‌ను ఎదుర్కొని నిలబడడంతో టీమిండియా ఫాలో ఆన్ గండం నుంచి బయటపడింది. అయినా, ఆసిస్ కంటే 193 పరుగులు ఇంకా వెనుక పడి ఉంది. మ్యాచ్ ముగిసే సరికి ఆకాశ్ దీప్ 27 పరుగులు, బుమ్రా 10 పరుగులతో నాటౌట్ నిలిచారు.

ఇక వెదర్ రిపోర్ట్‌ని పరిశీలిస్తే.. బుధవారం సైతం వర్షం కురిసే అవకాశాలున్నాయి. ఇదే జరిగితే మ్యాచ్ సాగేందుకు అవకాశం ఉండదు. ఆస్ట్రేలియన్ వాతావరణ శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ మ్యాచ్ సమయంలో వర్షం పడేందుకు అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయని పేర్కొంది. ఉదయం, మధ్యాహ్నం చాలా వర్షం కురిసే సూచనలున్నాయని.. పలుచోట్ల భారీ పిడుగులు పడే ఛాన్స్ ఉందన్నారు. ఇక మ్యాచ్ చివరి రోజున 98 ఓవర్లు ఆడాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియా జట్టు రిస్క్ చేయాలని భావిస్తే.. భారత్‌ను వీలైనంత త్వరగా అవుట్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత వీలైనంత వరకు వేగంగా పరుగులు చేసి.. ఆ తర్వాత భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాలి.

ఐదో రోజు మ్యాచ్ అరగంట ముందే మొదలయ్యే అవకాశం ఉంది. అది కూడా వరుణుడు కరుణిస్తేనే. ఇక ఇప్పటికే ఆస్ట్రేలియా టీమ్‌కు షాక్ తగిలింది. ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలిగాడు. సిరీస్‌లోని మిగతా మ్యాచ్‌లకు అందుబాటులో ఉంటాడా? లేదా? అన్ని తెలియదు. ఈ పరిస్థితుల్లో భారత్‌కు ఆస్ట్రేలియా పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించలేకపోతే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఇక చివరి రోజు వర్షం ఆటంకం కలిగించినా మ్యాచ్ డ్రాగా ముగిసేందుకు ఖాయంగా కనిపిస్తున్నది.



# భారత్‌కు తప్పిన 'ఫాలో ఆన్' గండం..

- నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా తొమ్మిది వికెట్ల నష్టానికి 252 పరుగులు
- జడ్డూ - కేఎల్ కీలక ఇన్నింగ్స్‌లు..

**బ్రిస్బేన్:** ప్రధాన బ్యాటర్లంతా పెవిలియన్‌కు చేరారు. ఇక భారత్‌ను చుట్టేయడం సులువే అనుకొన్న ఆసీస్ బౌలర్లకు కొరకరాని కొయ్యలా మారారు. మేం ఎవరికీ తక్కువ కాదంటూ నిలకడగా ఒక్కో పరుగు రాబట్టారు. అవసరమైనప్పుడు దూకుడు ప్రదర్శించి బౌండరీలూ బాదారు. ఇప్పటికే అర్థమైందిగా ఆ జోడీ ఎవరని?.. వారే జస్‌ప్రీత్ బుమ్రా ఆకాశ్ దీప్. స్టార్ బ్యాటర్లకే సాధ్యం కానివిధంగా పోరాడి జట్టును 'ఫాలో ఆన్' గండం నుంచి బయటపడేశారీ పేస్ బౌలర్లు కమ్ బ్యాటర్లు.

ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో భారత్ 'ఫాలో ఆన్'ను తప్పించుకుంది. టెయిలెండర్లు జస్‌ప్రీత్ బుమ్రా (10*), ఆకాశ్ దీప్ (27*) పదో వికెట్‌కు 39 పరుగులు జోడించారు. ఆట ముగిసే ముందు చివర్లో ఆకాశ్ దీప్ కొట్టిన సిక్స్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. అయితే, వెలుతురు లేమి కారణంగా అంపైర్లు మ్యాచ్‌ను కాస్త ముందుగానే నిలిపేశారు. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తొమ్మిది వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 445 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. టీమ్‌ఇండియా ఇంకా 193 పరుగుల వెనుకంజలో ఉంది. 'ఫాలో ఆన్' నుంచి బయటపడంతో టీమ్‌ఇండియా శిబిరంలో జోష్ వచ్చింది.

**జడ్డూ - కేఎల్ కీలక ఇన్నింగ్స్‌లు..**

ఓవర్‌నైట్ 51/4 స్కోరుతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన భారత్‌కు కాసేపటికే షాక్ తగిలింది. ఆఫ్ సైడ్ బంతిని కదిలించి మరీ కెప్టెన్ రోహిత్ శర్మ (10) పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత కేఎల్ రాహుల్ (84), రవీంద్ర జడేజా (77) కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లారు. ఆరో





వికెట్‌కు 67 పరుగులు జోడించారు. ఈ క్రమంలో కేఎల్ సెంచరీ దిశగా సాగినట్లు అనిపించాడు. కానీ, నాథన్ లైయన్ బౌలింగ్‌లో స్టీవ్ స్మిత్ స్లిప్‌లో అద్భుతమైన క్యాచ్ పట్టాడు. అంతకుముందు 33 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద స్మిత్ క్యాచ్‌ను వదిలాడు.

కేఎల్ ఔటైన తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నితీశ్ కుమార్ రెడ్డి (16)తో కలిసి జడేజా ఏడో వికెట్‌కు 53 పరుగులు జోడించాడు. పాట్ కమిన్స్ బౌలింగ్‌లో నితీశ్ బౌల్డ్ అయి పెవిలియన్‌కు చేరాడు. ఆ తర్వాత దూకుడు పెంచే క్రమంలో జడేజా కూడా ఔటయ్యాడు. ఇక ఫాలో ఆన్ తప్పదని భావించిన వేళ.. బుమ్రా ఆకాశ్ దీప్ జోడీ విలువైన పరుగులు రాబట్టారు. చివరికి నాలుగో రోజే ఆలౌట్ కాకుండా ఆటను ముగించారు. భారత క్రికెటర్లలో యశస్వి జైస్వాల్ (4), శుభ్‌మన్ గిల్ (1), విరాట్ కోహ్లీ (3), రిషభ్ పంత్ (9), సిరాజ్ (1) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. రోహిత్ శర్మ 10, నితీశ్‌కుమార్ రెడ్డి 16 పరుగులు చేశారు.

ఆసీస్ బౌలర్లలో పాట్ కమిన్స్ 4, మిచెల్ స్టార్క్ 3.. జోష్ హేజిల్‌వుడ్, నాథన్ లైయన్ చెరో వికెట్ తీశారు.

**కేఎల్ అద్భుతం..**

ఓవర్ నైట్ 51/4 స్కోరుతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన భారత్‌కు కాసేపటికే షాక్ తగిలింది. కెప్టెన్ రోహిత్ శర్మ(10) మరోసారి విఫలమై నిరాశ పరిచాడు. దీంతో అతడిపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో విమర్శలు రేగాయి. మరోవైపు తొలి రోజు నుంచి మంచి ఆటతీరు కనబరుస్తూ వచ్చిన కేఎల్ రాహుల్ (84) కూడా త్వరగానే ఔటయ్యేవాడే. వ్యక్తిగత స్కోరు 33 పరుగుల వద్ద స్లిప్‌లో స్మిత్ క్యాచ్‌ను వదిలేయడంతో బతికిపోయాడు. ఆ తర్వాత ఆసీస్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. జడేజాతో కలిసి ఆరో వికెట్‌కు 67 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొని శతకం దిశగా సాగాడు. కానీ, నాథన్ లైయన్ బౌలింగ్‌లో స్టీవ్ స్మిత్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో కేఎల్ పెవిలియన్‌కు చేరక తప్పలేదు.

**కెప్టెన్.. ఆడేది ఇలాగేనా?**

కెప్టెన్ రోహిత్ శర్మపై మళ్లీ తీవ్రస్థాయిలో విమర్శలు రేగాయి. బాధ్యతాయుతంగా ఆడటంలో మరోసారి విఫలమైన రోహిత్‌కు సారథ్యం భారంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ సంవత్సరం 24 ఇన్నింగ్స్‌ల్లో 602 పరుగులు చేసిన రోహిత్ సగటు 26.39 మాత్రమే. ఇప్పుడు కూడా 27 బంతులను ఎదుర్కొని కేవలం 10 పరుగులకే పెవిలియన్‌కు చేరాడు. కమిన్స్ బౌలింగ్‌లో ఆఫ్ సైడ్ బంతిని కదిలించి కీపర్ చేతికి చిక్కాడు. విరాట్ కోహ్లీ మాదిరిగానే కవర్‌డ్రైవ్ ఆడే క్రమంలోనే వికెట్‌ను సమర్పించడం గమనార్హం.

**జోష్ హేజిల్‌వుడ్ దూరం..**

నాలుగో రోజు కేవలం ఒక్క ఓవర్ మాత్రమే వేసిన జోష్ హేజిల్‌వుడ్ గాయం కారణంగా మళ్లీ మైదానంలోకి దిగలేదు. అతడికి వైద్య పరీక్షలు నిర్వహించిన క్రికెట్ ఆస్ట్రేలియా మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం కష్టమేనని పేర్కొంది. సిరీస్‌లోని మిగతా రెండు మ్యాచుల్లోనూ ఆడే అవకాశాలు తక్కువేనని వెల్లడించింది. జట్టులో మార్పులు ఉంటే త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. జోష్‌కు బదులు రెండో టెస్టులో ఆడిన స్కాట్ బోలాండ్‌కు తుది జట్టులోకి మళ్లీ పిలుపు వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ భారత్ ఫాలో ఆన్‌ను ఎదుర్కొన్నా.. ఆసీస్ మాత్రం మళ్లీ బౌలింగ్ వేసేందుకు మొగ్గు చూపేది కాదని క్రికెట్ పండితుల విశ్లేషణ. హేజిల్‌వుడ్ గైర్హాజరీతో బౌలింగ్ పేస్ భారం కమిన్స్, స్టార్క్‌పైనే పడింది. మిచెల్ మార్ష్ ఉన్నప్పటికీ.. అతడు ఎక్కువగా బౌలింగ్ చేయలేదు. ఇప్పుడు భారత్ 'ఫాలో ఆన్' గండం నుంచి బయటపడింది.

## ఆపద్బాంధవుడు.. రాహుల్ కొత్త అవతారం..!

**ముంబయి:** నవ్విన నాపచేనే పండుతుందన్న సామెత బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో కేఎల్ రాహుల్‌కు అతికినట్లు సరిపోతుంది. గబ్బా మైదానంలో ప్రేక్షకులతో చప్పట్లు కొట్టించుకోవాలనుకోలేదు.. బౌలర్లను డామినేట్ చేయాలనుకోలేదు.. కేవలం నిలకడగా ఆడి జట్టును గండం గట్టెక్కించాలనుకున్నాడు. పరిస్థితులకు తగ్గట్లు ఆడి.. అనుకున్నది సాధించాడు. వాస్తవానికి న్యూజిలాండ్ సిరీస్‌కు స్క్వాడ్‌లో ఉన్నా.. బెంచ్‌కే పరిమితం అయ్యాడు. పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో పరుగుల కోసం అవస్థలు పడుతున్నాడు. మరోవైపు సర్ఫరాజ్ ఖాన్ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటూ 150 పరుగులు చేయడంతో.. రాహుల్‌కు జట్టులో స్థానం ప్రశ్నార్థకంగా మారింది.

ఆస్ట్రేలియా వికెట్లను దృష్టిలో పెట్టుకొని టీమ్ మేనేజ్‌మెంట్ అతడిపై నమ్మకముంచి బీజీటీలో కూడా కొనసాగించింది. ఈ సిరీస్‌లో తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్ మినహాయించి భారత బ్యాటర్లు విఫలమవుతున్నా.. రాహుల్ ఒక్కడే ఆధారపడదగ్గ ఇన్నింగ్స్‌లు ఆడి పరువు కాపాడుతున్నాడు. తాజాగా ఆసీస్ కంచుకోట గబ్బాలో జట్టును ఫాలోఆన్ గండం గట్టెక్కించేందుకు విలువైన 84 పరుగుల ఇన్నింగ్స్ అందించాడు.

**బంతిని పాతబడేట్లు చేసి..**

కుకబుర్ర కొత్త బంతితో మైదానంలో కనీసం 20 30 ఓవర్లు బౌలింగ్ చేశాకే.. మెరుపు కోల్పోయి బ్యాటర్లకు అనుకూలిస్తుంది. అది పాతబడక ముందే భారత బ్యాటర్లు దూకుడుగా ఆడటంతో 30 ఓవర్లు గడిచేసరికి దాదాపు నాలుగైదు వి



కెట్లను భారత్ కోల్పోయింది. ఆసీస్ బ్యాటర్లు మాత్రం పరుగులు తక్కువ చేసినా.. బంతి పాతబడే వరకు ఓపిగ్గా ఎదురు చూస్తున్నారు. దీనికి స్మిత్ ఇన్నింగ్సే పెద్ద ఉదాహరణ. అర్ధ శతకానికి 128 బంతులు ఆడాడంటే అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత దానిని శతకంగా మలిచాడు. భారత్ వైపు వికెట్లు పడుతున్నా రాహుల్ మాత్రం ఓపిగ్గా ఎంపిక చేసిన బంతులనే షాట్లుగా మలిచాడు. నాలుగో రోజు స్మిత్ ఇచ్చిన జీవనదానాన్ని వాడుకొని విలువైన పరుగులు చేశాడు. అతడికి జడ్డూ కూడా తోడు కావడంతో భారత్ గౌరవ ప్రదమైన స్కోర్‌కు చేరి.. ఫాలో ఆన్ నుంచి బయటపడింది.

**వారు చేసిన తప్పులు చేయకుండా..**

గబ్బా టెస్ట్‌లో గిల్, విరాట్ పంత్, రోహిత్‌లు అనవసర షాట్లకు యత్నించి స్లిప్ లేదా వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యారు. ఆసీస్ బౌలర్ల ఆఫ్‌సైడ్ బంతులను మంచి ఫుట్ వర్క్‌తో ఎదుర్కొన్నాడు. కోహ్లీ, రోహిత్ ప్యాడ్ల వద్ద ఎదుర్కొన్నటు వంటి బంతులను రాహుల్ మాత్రం శరీరానికి దగ్గరగా ఆడటం గమనార్హం. బంతి శరీరం దగ్గరకు వచ్చేవరకు ఎదురు చూసి షాట్లు ఆడాడు.. అదే రోహిత్, కోహ్లీలు దీనికి భిన్నంగా చాలా ముందుగా బంతిని ఎదుర్కొనేందుకు యత్నించారు.

**సెనా దేశాల్లో ఆ స్టార్ల కంటే అతడే బెటర్..**

సీమర్లకు అనుకూలించే పిచ్‌లున్న సెనా దేశాల్లో (సౌతాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) వికెట్లపై 2020 నుంచి నిలకడగా రాణిస్తున్న రికార్డు రాహుల్‌కు ఉంది. ఓ రకంగా కోహ్లీ, పంత్, రోహిత్ సహా పలువురు బ్యాటర్లు నియంత్రణ కోల్పోయి షాట్లు ఆడి వికెట్లు కోల్పోయిన చోట్ల కూడా ఇతడు మెరుగ్గా ఆడాడు. తీవ్రమైన ఒత్తిడిలో కూడా అతడు స్కోర్‌బోర్డును కదిలించి ముందుకు తీసుకెళతాడనే పేరుంది. 2020 నుంచి సెనా దేశాల్లో రాహుల్ సగటు 41.5 కాగా.. విరాట్ (30.4), పంత్ (34.8), రోహిత్ (33.2)గా ఉంది. తాజాగా ఆడిన మూడు టెస్టుల్లో అతడే టీమ్ ఇండియా తరఫున టాప్ స్కోరర్.

## టెస్ట్ ఫార్మాట్‌కు రోహిత్ వీడ్కోలుకు అదే సంకేతమా?



**ముంబయి:** టెస్ట్ ఫార్మాట్‌లో వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న టీమ్ ఇండియా సారథి రోహిత్ శర్మ కెరీర్ చరమాంకానికి చేరుకొందనే ప్రచారం జోరందుకుంది. తాజాగా గబ్బా టెస్ట్ మ్యాచ్‌లో ఆసీస్ బౌలర్ పాట్ కమిన్స్ వేసిన బంతిని రోహిత్ పేలవమైన షాట్ కొట్టి వికెట్ సమర్పించుకొన్నాడు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన రోహిత్ తన గ్లౌజ్‌లను డగౌట్ వద్దే పడేసి డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లిపోవడం ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. దీంతో టెస్ట్ కెరీర్‌కు ముగింపు పలకనున్నాడంటూ ఆన్‌లైన్‌లో ప్రచారం మొదలైంది.

6వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి వరుసగా మూడుసార్లు రోహిత్ విఫలమయ్యాడు. మరోవైపు ఓపెనర్‌గా వచ్చిన రాహుల్ ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొని అర్ధశతకం పూర్తి చేశాడు. మైదానంలో కూడా రోహిత్ ఫుట్‌వర్క్ చాలా అసౌకర్యంగా కనిపించింది. బంతి వచ్చేవరకు ఎదురుచూసేంత ఓపిక కూడా అతడి ఆటలో కనిపించలేదు. చివరికి పాదాలను కదిలించకుండానే షాట్ ఆడేందుకు ప్రయత్నించి పెవిలియన్‌కు చేరాడు.

గత రెండేళ్ల నుంచి హిట్‌మ్యాన్ బ్యాట్ నుంచి సుదీర్ఘ ఫార్మాట్లో అనుకొన్న స్థాయిలో పరుగులు రావడం లేదు. మొత్తం 10 టెస్టుల్లో 18 ఇన్నింగ్స్ ఆడి.. కేవలం 621 పరుగులు సాధించాడు. ఒక్క శతకం మాత్రమే నమోదు చేశాడు. అతడి టెస్ట్ కెరీర్ బ్యాటింగ్ సగటు 45 కాగా.. ఈ 18 ఇన్నింగ్స్‌ల్లో యావరేజ్ 34..! ముఖ్యంగా స్వదేశంలో 62 సగటుతో ఆడే రోహిత్.. విదేశాల్లో మాత్రం 33గా ఇది ఉంది.

ఈ ఏడాది జూన్‌లో టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే రోహిత్ ఆ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేశాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత వన్డే ఫార్మాట్‌లో కూడా విశ్రాంతి తీసుకొంటాడనే ప్రచారం జరుగుతోంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ తర్వాత సుదీర్ఘ ఫార్మాట్ నుంచి కూడా వైదొలగుతాడనే ప్రచారం జరిగినా.. బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ అనుకున్నంత సాఫీగా జరగడం లేదు. డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు (WTC Final 2025) చేరాలంటే కచ్చితంగా గెలిచి తీరాల్సిన మ్యాచ్‌ల్లో కూడా బ్యాటర్లు చేతులెత్తేస్తున్నారు. ఇలాగే కొనసాగితే భారత్ ఆ రేసు నుంచి వైదొలగాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో బీజీటీ ఫలితం పైనే రోహిత్ రెడ్‌బాల్ క్రికెట్ భవితవ్యం ఆధారపడిందన్నది ఇప్పటికే అందరికీ తెలిసిన విషయం. గిల్, జైస్వాల్, సర్ఫరాజ్ వంటి యువ తరానికి దారిస్తూ తాను వైదొలుగుతాడని భావిస్తున్నారు.

# భారీ నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు

- ఫెడ్ వడ్డీ రేట్లపై మదుపర్ల దృష్టి..
- సెన్సెక్స్ 1000 పాయింట్లు ఢమాల్

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం భారీ నష్టాల్లో ముగిశాయి. ప్రధాన షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. బలహీన అంతర్జాతీయ సంకేతాలకు తోడు.. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు వెలువడనుండటంతో సూచీలు తీవ్ర ఒడుదొడుకులకు లోనయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 81,511.81 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,748.57) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగించింది. తీవ్ర ఒడుదొడుకుల్లో కదలాడిన సూచీ.. ఇంట్రాడేలో 80,612.20 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 1064 పాయింట్లు క్షీణించి 80,684 వద్ద ముగిసింది. నిఫ్టీ 322 పాయింట్లు కుంగి 24,336 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఐటీసీ మాత్రమే లాభాల్లో ముగిసింది. మిగిలిన షేర్లన్నీ నష్టపోయాయి. జేఎస్‌డబ్ల్యూ



స్టీల్, భారతీ ఎయిర్‌టెల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టీసీఎస్, ఏషియన్ పెయింట్స్, ఎల్‌అండ్‌టీ, రియలన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజీకీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 73.56 డాలర్లు వద్ద, బంగారం ఔన్సు 2,655.80 డాలర్ల వద్ద కొనసాగుతున్నాయి.

**ఫెడ్ వడ్డీ రేట్లపై మదుపర్ల దృష్టి..**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. బుధవారం అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు వెలువడనుండటంతో నేటి ట్రేడింగ్‌ను నష్టాల్లోనే ప్రారంభించిన సూచీలు రోజంతా అదే బాటలో పయనించాయి. ఆటో, బ్యాంకింగ్, ఎనర్జీ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. దీంతో సెన్సెక్స్ 1000 పాయింట్లకు పైగా నష్టపోయింది.

**కారణాలు ఇవే..**

బుధవారం అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయాలు వెలువడాల్సి ఉంది. దీనిపై మదుపరులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే 25 బేసిస్ పాయింట్లు రేటు తగ్గింపు ఉంటుందని మార్కెట్లలో అంచనాలు ఉన్నాయి. దీనికితోడు సమావేశంలో ఫెడ్ చీఫ్ ఏవైనా నిర్ణయాలు తీసుకుంటారా? అనే విషయం కోసం ఇన్వెస్టర్లు ఎదురుచూస్తున్నారు.

విదేశీ సంస్థాగత మదుపర్లు తిరిగి విక్రయదారులుగా మారడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఎఫ్ఐఐలు సోమవారం రూ.279 కోట్ల నిధుల్ని దేశీయ మార్కెట్ నుంచి వెనక్కి తీసుకున్నారు.

నవంబరులో దేశీయ వాణిజ్య ఎగుమతులు ఏడాదిక్రితం ఇదే నెలతో పోలిస్తే 4.85శాతం తగ్గి 32.11 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇదే సమయంలో దిగుమతులు 27శాతం పెరిగి రికార్డు స్థాయి అయిన 69.95 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్యలోటు 37.84 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇది జీవనకాల గరిష్ఠ స్థాయి. ఇది రూపాయిపై ఒత్తిడి తెచ్చింది. ఇది మార్కెట్లపై ప్రతికూలంగా ప్రభావం చూపింది.రూపాయి విలువ క్షీణిస్తోంది. తాజాగా 84.92 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకింది. ఇది కూడా సూచీల పతనానికి ఓ కారణంగా భావిస్తున్నారు.

సెన్సెక్స్30లో అధిక వెయిటేజీ ఉన్న స్టాక్స్.. రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్, నెస్లే ఇండియా, ఎల్‌అండ్‌టీ, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరల్లో విక్రయాలు సూచీలను కిందకు లాగాయి.

### ఎస్ఈ సీఐ నుంచి
## భారీ విద్యుత్ ప్రాజెక్టును పొందిన రిలయన్స్

**ముంబయి:** సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంచి 930 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్, 465 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం ప్రాజెక్టును రిలయన్స్ NU సన్‌టెక్ దక్కించుకున్నట్లు రిలయన్స్ పవర్ ఈ రోజు (మంగళవారం) తెలిపింది. టెండర్ నిబంధనల ప్రకారం, రిలయన్స్ ఎన్‌యూ సన్‌టెక్ సోలార్ పవర్ ద్వారా ఛార్జ్ అయిన 465 ఎండబ్ల్యూ/1,860 ఎండబ్ల్యూహెచ్ బ్యాటరీ స్టోరేజ్ సామర్థ్యాన్ని కూడా ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాజెక్ట్ చైనా తర్వాత ఆసియాలో అతిపెద్ద సింగిల్ సైట్ బ్యాటరీ స్టోరేజ్‌గా గుర్తింపు పొందనుంది. ఎస్ఈసీఐ..రిలయన్స్ ఎన్‌యూ సన్‌టెక్‌తో 25 ఏళ్ల పాటు విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా ఉత్పత్తి అయిన సోలార్ పవర్‌ను భారత్‌లోని బహుళ డిస్కాంలకు విక్రయిస్తారు. రిలయన్స్ NU సన్‌టెక్ ఈ ప్రాజెక్టును బిల్డ్‌ఓన్ ఆపరేట్ ప్రాతిపదికన అభివృద్ధి చేస్తుంది. రిలయన్స్ గ్రూప్‌లో భాగమైన రిలయన్స్ పవర్ లిమిటెడ్, భార



త్‌లోని ప్రముఖ ప్రైవేట్ రంగ విద్యుత్ ఉత్పత్తి కంపెనీల్లో ఒకటి. ఈ కంపెనీ 5,300 మెగావాట్ల ఆపరేటింగ్ పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. ఇందులో 3,960 మెగావాట్ల ససన్ పవర్ లిమిటెడ్..ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ బొగ్గు ఆధారిత పవర్ ప్లాంట్.

## పోకో నుంచి మరో ఎంట్రీ లెవల్ స్మార్ట్ ఫోన్ ఎం7 ప్రో 5జీ..

**ముంబయి:** ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ పోకో తన పోకో ఎం7 ప్రో 5జీ ఫోన్‌ను భారత్ మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ.13,999 పలుకుతుంది. అత్యంత అందుబాటు ధరలో ఉన్న స్మార్ట్ ఫోన్ ఇదే. 6.67 అంగుళాల ఫుల్ హెచ్డీ+ డిస్ ప్లే, మీడియాటెక్ డైమెన్సిటీ 7025 అల్ట్రా ఎస్వోసీ, 45వాట్ల ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 5110 ఎంఏహెచ్ బ్యాటరీతో వస్తుంది. ఇందులో డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ ఉంటుంది.పోకో ఎం7 ప్రో 5జీ (Poco M7 Pro 5G) ఫోన్ 6 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.13,999, 8 జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.15,999 పలుకుతుంది. ఆలివ్ ట్విలైట్, లావెండర్ ఫ్రాస్ట్, లునార్ డస్ట్ పవర్ బ్లాక్ రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్ ద్వారా ఈ నెల 20 నుంచి ఫోన్ల అమ్మకాలు ప్రారంభం అవుతాయి.

2160 హెర్ట్జ్ టచ్ శాంప్లింగ్ రేటు, 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేటుతోపాటు 6.67 అంగుళాల ఫుల్ హెచ్డీ+ డిస్ ప్లే కలిగి ఉంటది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 5 ప్రొటెక్షన్ స్క్రీనింగ్ ఉంటుంది. 2100 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. మీడియాటెక్ డైమెన్సిటీ 7025 అల్ట్రా ఎస్వోసీ ప్రాసెసర్‌తో పని చేస్తుంది. ఆండ్రాయిడ్ 14 బేస్డ్ హైపర్ ఓఎస్ ఔటాఫ్ బాక్స్ వర్షన్‌పై పని చేస్తుంది. రెండేండ్ల




పాటు ఆండ్రాయిడ్ ఓఎస్ అప్‌డేట్స్, నాలుగేండ్లు సెక్యూరిటీ అప్‌డేట్స్ అందిస్తామని పోకో తెలిపింది. 50మెగా పిక్సెల్ సోనీ ల్వెతియా ఎల్వైటీ 600 ప్రైమరీ సెన్సర్, 2మెగా పిక్సెల్ మాక్రో సెన్సర్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 20మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. సెక్యూరిటీ కోసం ఇన్‌డిస్ ప్లే ఫింగర్ ప్రింట్ స్కానర్, 5జీ, డ్యుయల్ బాండ్ వైఫై కనెక్టివిటీ కలిగి ఉంటుంది.

## 2030 నాటికి 2.5 కోట్ల మంది డెలివరీ వర్కర్లు: గడ్కరీ



**ఢిల్లీ:** పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తోన్న ఫుడ్ డెలివరీ రంగం దేశానికి ఎంతో కీలకమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. జొమాటో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఫుడ్ డెలివరీ రంగంపై ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో 77లక్షల మంది డెలివరీ సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. 2030 నాటికి వీరి సంఖ్య 2.5 కోట్లకు చేరుకుంటుందని తెలిపారు.

''2.5 కోట్ల మందికి ఉపాధి కల్పించడం అనేది చాలా గొప్ప విషయం. మనందరికీ ఉద్యోగాలు కల్పించడమే అత్యంత ముఖ్యమైన అంశం'' అని నితిన్ గడ్కరీ అన్నారు. దేశంలోని ఎంతో మంది నిరుద్యోగులకు జొమాటో ఉపాధి కల్పిస్తోందన్నారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డెలివరీ ఏజెంట్లు లిమిటెడ్ సమయంలో వస్తువులను డెలివరీ చేయాల్సిన అవసరం ఉంటుంది కనుక.. ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందన్నారు.

దేశంలో గంటకు 45 ప్రమాదాలు, 20 మరణాలు జరుగుతున్నాయని గడ్కరీ తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు వాళ్లే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్మెట్ వినియోగించకపోవడం వల్ల 55 వేల మంది ద్విచక్ర వాహనదారులు మరణిస్తున్నట్లు తెలిపారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల 10వేల మరణాలు సంభవిస్తున్నాయని, సరైన శిక్షణ అందించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. 50వేల మంది డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నందుకు ఆయన జొమాటోను అభినందించారు.

## ఆ వీడియోలు నమ్మొద్దు..
### కస్టమర్లకు ఎస్‌బీఐ అలర్ట్

**ముంబయి:** పెద్దఎత్తున రిటర్నులు.. అంటూ స్టేట్ బ్యాంక్ టాప్ మేనేజ్‌మెంట్ చెబుతున్నట్లు వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ప్రభుత్వ రంగ బ్యాంక్ ఎస్‌బీఐ స్పందించింది. ఇవన్నీ కేవలం నకిలీ వీడియోలు అంటూ స్పష్టంచేసింది. ఈమేరకు 'ఎక్స్' వేదికగా ప్రజలను అప్రమత్తం చేస్తూ ఓ పోస్ట్ విడుదల చేసింది.

''బ్యాంక్ మేనేజ్‌మెంట్‌కు చెందిన వ్యక్తులంటూ సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్న డీప్ ఫేక్ వీడియోలు నమ్మొద్దు. ఆ వీడియోలో పేర్కొన్న పథకాలతో బ్యాంక్‌కు గానీ, బ్యాంక్ అధికారులకు గానీ ఎలాంటి సంబంధం లేదు. ఈ వీడియోలో ఫలానా పథకంలో పెట్టుబడి పెట్టండంటూ ప్రజలకు సలహా ఇస్తున్నారు. ఇలాంటి అవాస్తవమైన, అసాధారణ రాబడి ఇచ్చే వాగ్దానాలు ఎస్‌బీఐ చేయదు. ఇలాంటి మోసాల బారిన పడకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి'' అంటూ 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది.

# బచ్చలమల్లి ఎమోషన్స్ కి అందరూ కనెక్ట్ అవుతారు: అల్లరి నరేష్

**హీరో అల్లరి నరేష్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి'. సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగాదేవి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అమృత అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన బ్లాక్ బస్టర్స్ తర్వాత హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలై టీజర్, పాటలకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. బచ్చల మల్లి డిసెంబర్ 20న క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో అల్లరి నరేష్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.**



బచ్చల మల్లి కథలో మిమ్మల్ని ఎట్రాక్ట్ చేసిన ఎలిమెంట్స్ ఏమిటి ?

అల్లరి నరేష్ : డైరెక్టర్ సుబ్బు ఈ కథ చెప్పినప్పుడు సింగల్ సిట్టింగ్ లోనే ఓకే అయింది. కథ అంత అద్భుతంగా ఉంది. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో చాలా వేరియేషన్స్ ఉన్న క్యారెక్టర్ ఇది. ఇందులో హాస్యరసం తప్పా అన్ని వేరియేషన్స్ వున్నాయి. నాంది తర్వాత డిఫరెంట్ సినిమాలని చేద్దామనుకున్నాను. అలా మంచి కంటెంట్ సినిమాల కోసం చూస్తున్న టైంలో ఈ సినిమా వచ్చింది. నిర్మాత రాజేష్ గారికి కూడా చాలా నచ్చింది.

బచ్చలమల్లి క్యారెక్టర్ ఇంపాక్ట్ ఎలా వుంటుంది ?

అల్లరి నరేష్ : గమ్యంలో గాలి శీను ఎలా గుర్తుండిపోయాడో బచ్చల మల్లీ కూడా ఓ పదేళ్ళ పాటు గుర్తుండిపోతాడు. క్యారెక్టర్ ఇంపాక్ట్ అలా ఉంటుంది. నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కొత్తగా ట్రై చేశాను. బచ్చల మల్లి చాలా ఇంపాక్ట్ ఫుల్ క్యారెక్టర్. ప్రతి మనిషిలోనూ బచ్చలమల్లి లాంటి క్యారెక్టర్ ఉంటుంది. మనకు తెలియకుండానే జీవితంలో కొన్ని నిర్ణయాలు మూర్ఖత్వంతో తీసుకుంటాం. అందరూ రిలేట్ చేసుకునే క్యారెక్టర్ ఇది. ఇందులో తెలియకుండానే ఒక మంచి మెసేజ్ కూడా ఉంది.

లుక్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు ?

అల్లరి నరేష్ : ఈ కథ 90లో జరుగుతుంది. బచ్చల మల్లీ చాలా రెస్టిక్ క్యారెక్టర్. తను ట్రాక్టర్ నడుపుతుంటాడు. తన బాడీ గురించి ఎక్కువ కేర్ తీసుకునే పర్సన్ కాదు. అలాంటి లుక్ ని తీసుకురావడం కోసం హెయిర్ కి కాస్త రెడ్డిష్ కలర్ ట్రై చేశాం.

క్యారెక్టర్ డ్రివెన్ సినిమాల్లో క్యారెక్టర్ కనెక్ట్ అయితేనే సినిమా కనెక్ట్ అవుతారు మరి ఈ విషయంలో ఎలాంటి కేర్ తీసుకున్నారు ?

అల్లరి నరేష్ : ఈ కథని చాలా నిజాయితీగా చెప్పాం. ఇందులో ప్రతి ఎలిమెంట్ ని చాలా నేచురల్ గా చూపించాం. ఒక ఫైట్ సీన్ జరుగుతున్నప్పుడు రియల్ గా కొట్టుకున్నట్లుగానే ఉంటుంది. సినిమాని చాలా రియలిస్టిక్ గా ప్రజెంట్ చేశాం.

ఇందులో హీరోకి మూర్ఖత్వం వెనుక స్టోరీ ఏమైనా ఉంటుందా?

అల్లరి నరేష్ : వుంది. ఫాదర్ అండ్ సన్, మదర్ అండ్ సన్ ఎమోషన్ ఉంటుంది. నన్ను వద్దనుకుంటే నాకు ఎవరు వద్దు అనుకునే క్యారెక్టర్. ఒక క్యారెక్టర్ తో డిస్కనెక్ట్ అయితే ఇంకా చాప్టర్ ని క్లోజ్ చేసే క్యారెక్టర్. ఇందులో యాక్షన్ కథకి తగ్గట్టుగానే ఉంటుంది.

ఇందులో లవ్ స్టోరీ ప్రాధాన్యత ?

అల్లరి నరేష్ : బచ్చలమల్లి జీవితంలోకి కావేరి అనే అమ్మాయి ఎంటర్ అయిన తర్వాత ఆ అమ్మాయి కోసం మారుతాడు. ఆ మారే క్రమంలో తను చేసిన పాత తప్పులన్నీ ఎదురవుతుంటాయి. ఫైనల్ గా తన ఏ వైపు టర్న్ తీసుకున్నాడు అనేది ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. అమృత అయ్యర్ చాలా షటిల్ గా పెర్ఫార్మ్ చేసింది. తన క్యారెక్టర్ కి మంచి పేరొస్తుంది. ఇందులో రావు రమేష్, అచ్యుత్ కుమార్, వైవాహర్ష, హరితేజ, రోహిణి .. అన్నీ క్యారెక్టర్స్ కథలో చాలా కీలకంగా ఉంటాయి.

ఈ సినిమాలో హైలెట్ గా నిలిచే ఎపిసోడ్స్ ఏంటి?

అల్లరి నరేష్ : ఈ సినిమాలో ప్రీ క్లైమాక్స్ చాలా అద్భుతంగా ఉంటుంది. అది బెస్ట్ పార్ట్ ఆఫ్ ది ఫిలిం.

విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ గురించి?

అల్లరి నరేష్ : విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ నాకు చాలా ఇష్టం. రీసెంట్ టైంలో సీతారామం పాటలన్నీ సూపర్ హిట్. అవన్నీ నాకు చాలా నచ్చాయి. ఇందులో నాలుగు సాంగ్స్ ఉన్నాయి. చాలా టైం తీసుకుని చాలా బ్యూటిఫుల్ గా ఆ పాటల్ని చేయడం జరిగింది. పాటలకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. బ్యాగ్రౌండ్ స్కోర్ ని చాలా అద్భుతంగా చేశారు. ఆడియన్స్ కి ఒక మంచి ఎక్స్పీరియన్స్ ఉంటుంది.

ఈ సినిమా మొదలుపెట్టినప్పుడే టెక్నీషియన్స్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకూడదని డిసైడ్ చేసుకున్నాం. రిచార్డ్ ఎం నాథన్ డిఓపిగా చేశారు. విజువల్స్ చాలా రిఫ్రెషింగ్ ఫీలింగ్ ఇస్తాయి.

మీ నుంచి కామెడీ సినిమాలు తగ్గుతున్నాయి కదా ?

అల్లరి నరేష్ : కామెడీ నా స్ట్రెంత్. ఇండస్ట్రీలో ఇంత లాంగ్ కెరీర్ ఉందంటే దానికి కారణం కామెడీనే. అది నా హోమ్ గ్రౌండ్. కామెడీని వదలను. మధ్యమధ్యలో బ్యాలెన్స్ చేయడానికి ఇలాంటి సీరియస్ కంటెంట్ ఫిలిమ్స్ చేస్తాను. డిఫరెంట్ సినిమాలని చేయాలనేదే నా ప్రయత్నం.

సుడిగాడు 2 ఎంతవరకు వచ్చింది?

అల్లరి నరేష్ : రైటింగ్ జరుగుతుంది. ఈసారి పాన్ ఇండియా వెళ్తున్నాం. కాబట్టి ఇంకాస్త టైం పడుతుంది.

## ఆ ఇద్దరే నా కెరీర్‌ను

# నాశనం చేశారు..

చాలామంది హీరోయిన్లు హిట్ ట్రాక్ లో ఉన్న సమయంలోనే కొంతమంది దర్శకుల చేతిలో పడి సినీ కెరీర్ ని నాశనం చేసుకుని సినిమా ఇండస్ట్రీకే దూరం అవుతారు. తర్వాత ఆ హీరోయిన్లు వారి వల్ల తమ సినీ కెరియర్ నాశనం అయిందని ఎన్నో ఇంటర్వ్యూలలో చెప్పిన సందర్భాలు ఉన్నాయి. అలా ఎంతో మంది హీరోయిన్లు బహిరంగంగానే తమ సినీ కెరీర్ నాశనం అవ్వడానికి ఎవరు కారణమయ్యారో వారి ప్పారు. హీరోల కన్నా హీరోయిన్లకు ఎక్కువగా ఇలాంటి సమస్యలు వస్తుంటాయి. చాలా మంది హీరోయిన్లు ఒకటి రెండు సినిమాలకు దూరం అవుతారు. ఒకప్పుడు సినిమాల తో బిజీగా ఉన్న ఈ అమ్మడు సడెన్ గా ఇండస్ట్రీకి దూరం అవడానికి కారణం ఇద్దరు డైరెక్టర్స్ అని ఓ వార్త సోషల్ మీడియాలో వినిపిస్తుంది.

అయితే తాజాగా పార్వతి మెల్టన్ కూడా తన సినీ కెరీర్ నాశనం అవ్వడానికి ఆ ఇద్దరే కారణం అంటూ ఓ సంచలన విషయాన్ని బయట పెట్టింది. 2005 వ సంవత్సరంలో టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు దేవ కట్టా దర్శకత్వం వహించిన వెన్నెల చిత్రంతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఆ మూవీ పెద్దగా సక్సెస్ టాక్ ను అందుకోలేదు. జల్సా మూవీలో పవన్ కళ్యాణ్ సరసన మెయిన్ హీరోయిన్ గా ఇలియానా చేసినప్పటికీ గుర్తింపు మాత్రం పార్వతి మెల్టన్ కి వచ్చింది.. జల్సాలో జెన్నిఫర్ లోఫెజ్ స్కెచ్ గీసినట్టుందే అంటూ ఆడి పాడి అందరి దృష్టినీ తనవైపు తిప్పకుంది. ఈ సినిమా ఆమె కెరియర్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. అప్పట్లో ఈ పాట సోషల్ మీడియాను షేక్ చేసింది. ఇక ఈ ఇంట్రడక్షన్ తో పార్వతి అందరికీ గుర్తొచ్చే ఉంటుంది. గత కొన్నేళ్లుగా సినిమాలకు దూరంగా ఉంటుంది ఈ బ్యూటీ.. పార్వతి మెల్టన్ తన సినీ కెరియర్లో వెన్నెల, మధు మాసం,అల్లరే అల్లరి, గేమ్, శ్రీమన్నారాయణ వంటి సినిమాల్లో చేసింది. మహేష్ బాబు దూకుడు మూవీలో ఐటమ్ సాంగ్‌లో అదరగొట్టింది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మకి ఇండస్ట్రీలో మంచి గుర్తింపు వస్తున్న తరుణంలోనే ఇద్దరు డైరెక్టర్ల కారణంగా తన సినీ కెరియర్ నాశనం అయ్యింది అంటూ రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో పార్వతి మెల్టన్ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తన సినిమా కెరీర్ నాశనం కావడానికి ఇద్దరు డైరెక్టర్స్ కారణమని ఇంటర్వ్యూ ద్వారా వెల్లడించింది. అయితే ఆ ఇద్దరు దర్శకుల పేర్లు మాత్రం ఆమె బయటకు చెప్పడానికి ఆమె ఇష్టపడలేదు. తెలుగులోనే కాదు పలు భాషల్లో సినిమాలు చేసింది. మళయాళంలో మోహన్ లాల్ హీరోగా నటించిన హల్లో చిత్రం లో నటించి అలరించింది. ఈ సినిమా మళయాళంలో బ్లాక్ బస్టర్ గా నిలిచింది. చివరగా యామహో యమ అనే సినిమాలో నటించింది. ఆ మూవీ అంత హిట్ టాక్ ను అందుకోలేదు. దాంతో పాపకు అవకాశాలు అందని ద్రాక్షలాగా మారాయి. అప్పటి నుంచి సినిమాలకు దూరం అయ్యింది. 2013 లో తాను శంసులాలానిని వివాహం చేసుకున్నట్టు తెలియజేసింది. ప్రస్తుతం భర్తతో కలిసి ఈ బ్యూటీ వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తుంది. మరి సినిమా అవకాశాలు వస్తే సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేస్తుందా లేదా అన్నది ఆసక్తిగా మారింది. ఏది ఏమైనా ఆమె కళ్లకు ప్రత్యేకంగా ఫ్యాన్స్ ఉన్నారు. ఆమెను మళ్ళీ సినిమాల్లో చూడాలని కోరుకుంటున్నారు. ఈ మధ్య హీరోయిన్లు అందరు సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేస్తున్నారు. వరుస సినిమాలతో బిజీ అవుతున్నారు. మరి ఈమె కూడా స్టార్ట్ చేస్తుందేమో చూడాలి.



# డకాయిట్‌లో హీరోయిన్ పోస్టర్ ఆవిష్కరణ



అడివి శేష్ మెగా పాన్ఇండియా యాక్షన్ డ్రామా 'డకాయిట్ ' అడ్రినలిన్ పంపింగ్ ఎక్స్ పీరియన్స్ తో రూపొందుతోంది. షనైల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. ఈ చిత్రం హిందీ, తెలుగు భాషల్లో ఏకకాలంలో షూట్ చేస్తున్నారు. అడివి శేష్ ,షానీల్ డియో సంయుక్తంగా కథ, స్క్రీన్ ప్లే రూపొందిచారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం మహారాష్ట్రలో లాంగ్ షెడ్యూల్‌తో కొనసాగుతుంది.

యాక్టర్ పుట్టినరోజున సినిమా అనౌన్స్ మెంట్ చేసే ట్రెండ్‌కి బిన్నంగా, అడివి శేష్ తన ఫీమేల్ లీడ్ మృణాల్ ఠాకూర్‌ని అనౌన్స్ చేసి, అతని పుట్టినరోజును మరింత ప్రత్యేకంగా చేశారు. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ పాత్రల మధ్య కెమిస్ట్రీని ప్రజెంట్ చేస్తూ డకోయిట్ టీం ఇంటెన్స్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. తనకు ద్రోహం చేసిన తన ఎక్స్ లవర్ పై ప్రతీకారం తీర్చుకునే కోపంతో ఉన్న దోషి కథగా డకాయిట్ వుండబోతుంది. ప్రేమ, ద్రోహం,ప్రతీకారం పవర్ ద్వారా నడిచే తీవ్రమైన యాక్షన్ డ్రామాకు వేదికగా ఆమెను ట్రాప్ చేయడానికి అతను ప్రమాదకరమైన ప్లాన్ ని రూపొందించాడు.

ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ.. "డకోయిట్ టచ్చింగ్ లవ్ స్టోరీతో కూడిన ఇంటెన్స్ యాక్షన్ మూవీ. మృణాల్ బిగ్ స్క్రీన్ పై కొన్ని అత్యుత్తమ పాత్రలకు జీవం పోషింది, ప్రతి పాత్రకు ఒక ప్రత్యేకతను తీసుకురావడం, ప్రతి పాత్రను ఎలివేట్ చేయడంలో ఆమె అసాధారణమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. మృనాల్‌ను డకాయిట్ టీమ్‌కి స్వాగతిస్తున్నాను బిగ్ స్క్రీన్స్ పై తలపడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను." అని అన్నారు.

మృనాల్ ఠాకూర్ మాట్లాడుతూ.. "డకాయిట్ టీమ్‌లో చేరినందుకు సంతోషిస్తున్నాను, అడివి శేష్, షానీల్ డియో స్టైలిష్ విజన్ తో ఇంటెన్స్ కథలను బ్లెండ్ చేస్తూ డకోయిట్ కథని అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. సినిమాలో నా పాత్ర యాక్టర్ గా కొత్త కోణాలను అన్వేషించే అవకాశాన్ని అందిస్తుంది. ఆర్ట్, స్క్రిప్ట్, విజన్ కలయిక ఈ ప్రాజెక్ట్ చాలా ఎక్సయిట్మెంట్ ఇచ్చింది. షానెల్ ప్రపంచంలో లీనం కావడం ఆనందంగా వుంది' అన్నారు.

దర్శకుడు షానీల్ డియో మాట్లాడుతూ"మృణాల్ ఠాకూర్ డాకోయిట్ టీంలో చేరినందుకు మేము సంతోషిస్తున్నాము. ఆమె మల్టీ ట్యాలెంటెడ్. ఈ యాక్షన్‌ప్యాక్డ్ డ్రామాకు ఆమె జీవం పోస్తోంది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జోడి అద్భుతంగా వుంటుంది. ఈ విలక్షణమైన పాత్రలో ప్రేక్షకులు ఆమెను చూసేందుకు , శేష్ , మృణాల్ తమ మొదటి ప్రాజెక్ట్‌లో కలిసి రూపొందిస్తున్న ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీని ఎక్స్ పీరియన్స్ చేయడానికి ఎదురుచూస్తున్నాను." అన్నారు

తారాగణం: అడివి శేష్, మృణాల్ ఠాకూర్

సాంకేతిక సిబ్బంది:

దర్శకత్వం: షానిల్ డియో

కథ, స్క్రీన్‌ప్లే: అడివి శేష్, షానీల్ డియో

నిర్మాత: సుప్రియ యార్లగడ్డ

సహ నిర్మాత: సునీల్ నారంగ్

సమర్పణ: అన్నపూర్ణ స్టూడియోస్

పీఆర్వో: వంశీశేఖర్.

# శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ ట్రైలర్ విడుదల




వెన్నెల కిషోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహించారు. లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. టీజర్ విడుదలైన తర్వాత సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ అయ్యింది మంగళవారం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు.

మేరీ అనే యువతి హత్య సంచలనంగా మారడంతో బీచ్‌లో జరిగే వరుస హత్యల చుట్టూ కథ తిరుగుతుంది. కేసును ఛేదించలేక పోలీసులు క్రియేటివ్, కాలిక్యులేటివ్ ఎప్రోచ్ తో పాపులరైన ఒక ప్రైవేట్ డిటెక్టివ్‌ను నియమిస్తారు. డిటెక్టివ్ గ్రామంలోని ప్రేమజంటతో సహా అనుమానితులను ఏడుగురిని గుర్తిస్తాడు.

రైటర్ మోహన్ కథను ఎంగేజింగ్, సస్పెన్స్‌గా ప్రజెంట్ చేశారు. వెన్నెల కిషోర్ శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ టైటిల్ క్యారెక్టర్ కు జీవం పోశారు. అతని హ్యూమర్ బిహేవియర్ ఉన్నప్పటికీ, కేసును పరిష్కరించడంలో అతని పద్ధతి, తెలివితేటలు ఆకట్టుకునేలా ఉంటాయి. రవితేజ మహద్యం, అనన్య నాగళ్ల ప్రేమ జంటగా నటించగా, సీయా గౌతమ్ పోలీస్ కానిస్టేబుల్‌గా ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. బాహుబలి ప్రభాకర్, మురళీధర్ గౌడ్ ఇతర ముఖ్య తారాగణం.

మల్లికార్జున్ ఎన్ సినిమాటోగ్రఫీ థ్రిల్లర్ టెన్షన్ యు క్యాప్చర్ చేస్తూ ప్రత్యేకంగా నిలిచింది. సునీల్ కశ్యప్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అద్భుతంగా ఉంది, ప్రొడక్షన్ డిజైన్ జానర్‌కి పెర్ఫెక్ట్ గా వున్నాయి. అవినాష్ గుర్లింక్ ఎడిటింగ్ నిర్వహిస్తుండగా, రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్ లిరిక్స్ రాశారు. ఆర్ట్ డైరెక్షన్ బేబీ సురేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రాజేష్ రామ్ బాల్.

ట్రైలర్ తో మరింత ఉత్కంఠను రేకెత్తించిన ఈ చిత్రం డిసెంబర్ 25న థియేటర్లలో విడుదల కానుంది. క, పొలిమేర 2, కమిటీ కుర్రోళ్లు చిత్రాలతో విజయాలు అందుకున్న వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల కానుంది.



## వారియర్ లుక్‌లో ఆకట్టుకుంటున్న సాయి దుర్గతేజ్

మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ తన భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ "సంబరాల ఏటిగట్టు"లో నటిస్తున్నారు. ఈ సినిమా కోసం సాయి దుర్గతేజ్ మేకోవర్ అయిన తీరు ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరుస్తోంది. రీసెంట్ గా గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చేతుల మీదుగా రిలీజ్ చేసిన "సంబరాల ఏటిగట్టు" సినిమా కార్నేజ్ కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. ఈ వీడియోలో వారియర్ లాంటి ఫిజిక్ తో సాయిదుర్గ తేజ్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. స్ట్రిక్ట్ డైట్ , ఎక్సర్ సైజ్ తో ఈ సినిమా క్యారెక్టర్‌కు తగినట్లు మారిపోయారు సాయిదుర్గ తేజ్. ఈ ఇంటెన్స్ యాక్షన్ సినిమాకు, తన క్యారెక్టర్ కు వందశాతం న్యాయం చేసేందుకు సుప్రీమ్ హీరో పెడుతున్న ఎఫర్ట్స్ ను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. సంబరాల ఏటిగట్టు కార్నేజ్ చూస్తే ఈ సినిమాతో సాయి దుర్గతేజ్ ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేయబోతున్నారో తెలుస్తోంది. సంబరాల ఏటిగట్టు చిత్రాన్ని సాయిదుర్గ తేజ్ 18వ చిత్రంగా నిర్మాతలు కే నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. కొత్త దర్శకుడు రోహిత్ కేపీ రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ 25న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.

# అమెరికాలో తారకరామం పుస్తకావిష్కరణ



తెలుగు ప్రజల హృదయాల నేలిన విశ్వ విఖ్యాత నట చక్రవర్తి, నిత్య నీరాజనాలందుకుంటున్న తెలుగుజాతి ఆత్మగౌరవ నినాద ప్రదాత 'అన్న' నందమూరి తారక రామారావు సినిమా వజ్రోత్సవాల సందర్భంగా అమెరికాలో 'తారకరామం ' గ్రంథాన్ని ఆవిష్కరించారు .

కనెక్టికట్‌లో ఎన్‌టీఆర్ లిటరేచర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ వైస్ చైర్మన్ అశ్విన్ అట్లూరి సారధ్యంలో ఎన్‌టీఆర్ అంతరంగాన్ని ఆవిష్కరిస్తూ సీనియర్ జర్నలిస్ట్, రచయిత భగీరథ సంపాదకత్వంలో రూపొందిన "తారకరామం". ప్రత్యేక సంచిక విడుదలైంది. ఈ గ్రంథాన్ని ఎన్‌టీఆర్ లిటరేచర్ అండ్ వెబ్‌సైట్ కమిటీ చైర్మన్ టీడీ జనార్ధన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు, సినిమా రంగ ప్రముఖుల సమక్షంలో విజయవాడలో విడుదలైంది. ఇదే సందర్భంలో అమెరికాలో కనెక్టికట్ రాష్ట్రంలో మా మహానాడు న్యూ ఇంగ్లాండ్ టీం తో కలిసి విడుదల చెయ్యటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని అట్లూరి అశ్విన్ తెలిపారు.

ఎన్‌టీఆర్ నట ప్రస్థానం "మన దేశం" తో మొదలై , "మేజర్ చంద్రకాంత్" వరకు కొనసాగిందని, ఈ మధ్య కాలంలో తెలుగు సినీ రంగంలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిన 75 ఏళ్ల చరిత్రకు 'తారకరామం' వేదికైందని ఆయన తెలిపారు. ఎన్‌టీఆర్ సినిమా వజ్రోత్సవ వేడుకలను అమెరికాలో జరుపుకోడం ఎంతో ఆనందం కలిగిస్తుందని అశ్విన్ తెలిపారు.

# జనవరి 1న విడుదల కానున్న క్రావెన్



మైండ్ బ్లోయింగ్ యాక్షన్ డ్రామా, క్రావెన్: ది హంటర్ ఇంకో రెండు వారాల్లో థియేటర్లలో విడుదల కానుంది. సోనీ సంస్థ నుంచి రానున్న సూపర్ హీరో సినిమాల్లో ఇది కూడా ఒకటి. ఈ సినిమా కి ఆర్ రేటింగ్ వచ్చిన నేపథ్యం లో డైరెక్టర్ చందూర్ మీడియాతో మాట్లాడారు.

"ఈ చిత్రానికి ఆర్ రేటింగ్ రావడం ఒక వరం గా భావిస్తున్నాను. దీని ద్వారా కథ కి నేను నాయయం చేయగలను అని అనిపిస్తుంది. క్రావెన్ కథ ని అత్యద్భుతంగా చెప్పడం అవసరం. అందుకే ఈ సినిమా కి ఆర్ రేటింగ్ రావడం శుభ పరిణామం అని నేను భావిస్తున్నాను." అని అన్నారు.

ఆయన ఇంకా మాట్లాడుతూ, "కోపం, ఆవేశం తో సెర్గీ ఇద్దరు పిల్లలని టీనేజ్ లో చంపేస్తాడు. ఆ తర్వాత అతను ఈజీగా ఎస్కేప్ అయ్యే అవకాశం ఉన్నప్పటికీ అతనలా చేయకుండా ఉన్నాడు. అందుకు కూడా ఒక జస్టిఫికేషన్ ఉంది: చనిపోయిన ఇద్దరూ చెడ్డ వ్యక్తులు అని అతను భావించడం తో, ఆపుకోలేనటువంటి కోపావేశం తో అతను ఈ భూమి మీద నుంచి ఇద్దరిని చంపేశా అని భావించాడు. ఆ కోపమే ఈ కథ కి ఆయువుపట్టు." అని చెప్పారు.

క్రావెన్: ది హంటర్ సినిమా ఆద్యంత యాక్షన్ ఎలిమెంట్స్ తో అలరిస్తుంది. మార్వెల్ కి సంబందించిన ఒక ఐకానిక్ విలన్ కథ ని మనం ఇందులో చూడొచ్చు. చాందర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో అరియానా డీ బోస్, ఫ్రెడ్ హెచ్చింగర్, అలెసాండ్రో నీవోలా, క్రిస్టోఫర్ అబ్బాట్, రస్సెల్ క్రౌ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

ఈ సినిమా జనవరి 1 న ఇంగ్లీష్, హిందీ, తమిళ్, మరియు తెలుగు భాషల్లో విడుదల కానుంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com